సంపుటి : 3
సంచిక : 4
పుటలు : 52
రు. 20/-లు
తెనాలి

1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

జూన్ 2017

## న్యాయస్థానాల్లో తెలుగుకు చోటు ఎప్పుడు?







ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి పరీక్ష

అమ్మభాషకోసం ఉద్యమించాలి-విద్యార్థుల పూనిక

పాలనాభాషగా తెలుగు అమలులో సమస్యలు-పరిష్కారాలు

# తెలుగు నుడిపోరాటంలో 'తెలుగువాణి'కి తోడుగా 'తానా'

'తెలుగువాణి' ట్రస్టను 2004లో స్థాపించి, తమిళనాడులోని తెలుగుప్రజలను వారి అమ్మనుడిని చదువగల, వ్రాయగల శక్తిమంతులుగా చేసేందుకు శిక్షణ ఇస్తున్న సంగతి 'అమ్మనుడి' (నాటి నడుస్తున్న చరిత్ర) చదువరులకు తెలిసిందే. ఇప్పుడు తమిళనాడులోని ఉడుములపేటలో వేలమంది తెలుగుపిల్లలకు అక్షరాలను నేర్పించడంతో మరొక అధ్యాయం మొదలైంది. రెండేళ్ళుగా 'ఎల్లలులేని తెలుగు' పేరుతో మొదలైన శిక్షణా కార్యక్రమానికి 'తానా' (ఉత్తర అమెరికా తెలుగుసంఘం) ఆర్థిక సహకారాన్నందజేసింది. అంతేకాక శ్రీ జంపాల చౌదరి అధ్యక్షతన 'తానా' చేస్తున్న కార్యక్రమాలన్నింటికీ 'ఎల్లలులేని తెలుగు' అనే మకుటాన్ని పెట్టుకొని ముందుకు సాగుతున్నది. మే26, 27, 28 తేదీలలో అమెరికాలోని సెయింట్‌లూయిస్ నగరంలో జరిగిన తానా 21వ మహాసభల్నికూడా ఇదే పతాకశీర్షికతో పెద్దఎత్తున నిర్వహించింది. ఈ సందర్భంగా ఉడుములపేట కార్యక్రమానికి నిర్వాహకుడుగానున్న తెలుగువాణి ట్రస్టీ మార్టూరి వసంత్‌నాయుడు దంపతులనూ వారి కుమార్తె, తెలుగువాణిలో తొలిగా తెలుగు అక్షరాన్ని దిద్దుకొని తెలుగు కథారచయిత్రిగా రాణిస్తున్న కుమారి సంజనాపద్మంను కూడా సభలకు ఆహ్వానించింది. తానావారి గిడుగురామమూర్తి స్మారక భాషాపురస్కార గ్రహీతలు శ్రీ స.వెం.రమేశ్, డా॥సామల రమేష్‌బాబులను కూడా ఆహ్వానించింది. రచయిత, తానా ప్రతినిధి శ్రీవాసిరెడ్డి నవీన్ మరియు శ్రీయుతులు కొలకలూరి ఇనాక్, పాపినేని శివశంకర్, యాకోబ్ మున్నగు రచయితలను కూడా ఆహ్వానించింది. జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాంతరంగా జరిగిన అనేక సభల్లో భాగంగా భాషకు సంబంధించి 27వ తేదీన పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో డా॥ సామల రమేష్‌బాబు, స.వెం.రమేశ్, కొలచాల సురేశ్, సంజనాపద్మం తదితరులు పాల్గొన్నారు. ఆ సందర్భానికి సంబంధించి మాకు అందిన ఫొటోలు ఇవి:





పురస్కారాలను అందుకొంటున్నడా॥సామల రమేష్‌బాబు, కుమారి సంజనాపద్మం




భాషావిషయంపై జరిగిన సభాదృశ్యం



ప్రసంగిస్తున్న స.వెం.రమేశ్

'తానా' వలెనే తక్కిన తెలుగుసంఘాలు కూడా 'ఎల్లలులేని తెలుగు' కోసం తమతమ తావుల్లో తగు కార్యక్రమాలు చేపడతారని ఆశిద్దాం.

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతలకోసం...
◆ తెలుగుభాషోద్యమ నిర్మాణంకోసం...
◆ ఆంధ్ర,తెలంగాణల్లో, ఇతరరాష్ట్రాల్లో, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారికోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి





జూన్ 2017


## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం, సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట -రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అను ఫాంట్స్ లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్, పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi @gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు. 3.రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ- మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకు గాని, ఇంటర్నెట్ పత్రికలకు గాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము. **అమ్మనుడి** లో ప్రచురణైన తరువాత ఇతర పత్రికలలో గాని, సోషల్ మీడియాలోగాని ప్రచురించేట్లయితే, **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| తెలుగును..... | | రహ్మానుద్దీన్ షేక్... | 5 |
| విశాఖపట్నం మహానాడు | | | 6 |
| సంపాదకహృదయం : | ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి పరీక్ష | | 7 |
| ప్రత్యేక వ్యాసం : | పాలనాభాషగా తెలుగులో.... | నూర్‌భాషా రహంతుల్లా | 9 |
| అట్టమీది బొమ్మ : | న్యాయస్థానాల్లో తెలుగుకు..... | | |
| | గౌరవ న్యాయమూర్తులకు వినతి | ఎ.బి.కె.ప్రసాద్ | 14 |
| | జిల్లా న్యాయస్థానాల్లో... | పెండ్యాల సత్యనారాయణ | 16 |
| గల్పిక : | న్యాయమూర్తుల్ని కలవరపరిచే..... | ఆర్.కె.నారాయణ్ | 17 |
| తెలుగు మాధ్యమం: | మాతృభాషా మాధ్యమాన్ని.... | విద్యార్థులు | 19 |
| ఇంటర్‌నెట్ : | భారతీయ భాషలు | రహ్మానుద్దీన్ షేక్... | 22 |
| పొరుగుతెలుగు : | తెలుగు ఆనవాళ్ళు | వాసిరెడ్డి నవీన్ | 24 |
| సాహిత్య రంగం: | మరపురాని వైతాళికుడు... | డా॥ మధురాంతకం నరేంద్ర | 26 |
| తెలుగులెంక సూక్తులు : | | డా॥ నాగభైరవ ఆదినారాయణ | 27 |
| ధారావాహిక : | దేవుడు-జీవుడు | బొర్రా గోవర్ధన్ | 28 |
| పిట్టచూపు : | డిజిటల్ లావాదేవీలు.. | చలసాని నరేంద్ర... | 31 |
| నేటి రచయితలు : | కళింగాంధ్ర కథకుని | మందరపు హైమవతి | 32 |
| నేటి కథ : | మీకు తెలిసిన ఓ కథ నా... | పసల భీమన్న | 34 |
| వారసత్వ విజ్ఞానం : | తొలి విమానాన్ని తయారుచేసిన... | పుప్పల నరసింహం | 39 |
| జానపదం : | జానపద కళలను.... | బద్రి కూర్మారావు | 41 |
| వికీపీడియా : | భాషాసేవ-వికీపీడియా | పవన్ సంతోష్ | 42 |
| పుస్తక సమీక్ష: | తెలంగాణ సమరక్షేత్రాలలో.. | సన్నిధానం నరసింహశర్మ | 43 |
| వ్యంగ్య రచన : | తెలుగు భాష కావాలా.... | వేదగిరి రాంబాబు | 44 |
| చరిత్ర : | తూర్పు చాళుక్యులు | వెంకటేష్ కందుల | 45 |
| పుస్తక సమీక్ష : | తెలుగుభాషకు ప్రాచీనహోదా... | ఎమ్.వి.శాస్త్రి | 46 |
| పర్యాటకం: | పర్యాటక కేంద్రంగా బమ్మెర | సంకేపల్లి నాగేంద్రశర్మ | 47 |
| మాటల తీరుతెన్నులు : | మా తెలుగు తల్లికి..... | గోవిందరాజు చక్రధర్ | 48 |
| ఉద్యమవార్తలు: | విశాఖపట్నంలో ఉద్యమం | | 49 |
| గ్రంథాలయం : | | | 50 |

| | | | |
|---|---|---|---|
| కవితలు | మిన్నపది | -కరణం కళ్యాణ్ కృష్ణకుమార్. | 33 |
| | వారిని అంచులదాకా... | -డా॥ కత్తి పద్మారావు | 38 |
| | అమృతభాష | -వల్లూరుపల్లి లక్ష్మి | 49 |



కార్టూన్లు : **సరసి, శేఖర్** కంప్యూటరీకరణ : **సోమయాజులు**



రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* , e-mail : editorammanudi@gmail.com

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

## చందా వివరాలు

| | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|
| శాశ్వత చందా : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
**AMMA NUDI - AXIS BANK, TENALI**
అక్కౌంట్ నెం. **915020010550189**
**IFSC Code : UTIB0000556**
ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంప గలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

# తెలుగుజాతి (ట్రస్టు)

**నడుస్తున్న చరిత్ర** ప్రోత్సాహంతో 2000సం॥నుండి ఆంధ్ర ప్రదేశ్‌లోని, పొరుగు రాష్ట్రాల్లోని తెలుగువారి శ్రేయస్సుకు, తెలుగు భాషోద్యమ నిర్మాణానికి ఎంతో కృషి జరిగింది. దక్షిణ భారతదేశ మంతటా చిక్కగా అల్లుకొని, మొత్తం దేశంలోనేకాక, ఇతర దేశాల్లో కూడా భాషా సాంస్కృతిక మూలాలను విస్తరించు కొనివున్న తెలుగు జాతిలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో సంఘీభావాన్ని, భావ సమైక్యతను బలపరచవలసిన అక్కరను గుర్తించిన కొందరు కార్యకర్తలు అందుకోసం పనిచేస్తున్నారు. అయితే, అనివార్య కారణాల వల్ల నడుస్తున్న చరిత్ర పత్రికను 2013 నవంబరు నుంచి నిలిపి వేయవలసి వచ్చింది. కొద్ది విరామం తరువాత మళ్ళీ పత్రికను ప్రచు రించడంతోపాటు తెలుగు నుడి, చరిత్ర, జాతి ముందడుగుకు అవసర మైన పుస్తకాల ప్రచురణను, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని తలపెట్టాము. ఇందుకోసం 'తెలుగుజాతి' ట్రస్టును స్థాపించాము. (92/2014).

2015 మార్చి నుంచి **అమ్మనుడి** పత్రికను ప్రచురిస్తు న్నాము. తొలుత స.వెం. రమేశ్ వ్యాసాల సంకలనం **ఎల్లలు లేని తెలుగు**ను విడుదల చేశాము. ఆచార్య గారపాటి ఉమామహేశ్వ రరావు గారి రచనలు **ద్రావిడ-మంగోలు భాషల జన్యుసంబంధం ("తెలుగు" పుట్టుపూర్వోత్తరాలు)** అనే పరిశోధనా గ్రంథాన్ని, **తెలుగు రాష్ట్రాలలో భాషాసంక్షోభం** అనే వ్యాససంకలనాన్ని 2017 మే నెలలో విడుదలచేస్తున్నాము.

**ఈ ట్రస్టును బలమైన పునాదులపై, తగినన్ని వనరులతో నిర్వహించటానికి మీ అందరి చేయూత కావాలి. విరాళాలనిచ్చి తోడ్పడగోరుతున్నాము.**

| | |
|---|---|
| రాజ పోషకులు రు. 1,00,000/- | పోషకులు రు. 25,000/- |
| విశిష్ట పోషకులు రు. 50,000/- | ప్రోత్సాహకులు రు. 10,000/- |

దాత ఫోటోను, క్లుప్తంగా పరిచయాన్ని **'అమ్మనుడి'** పత్రికలో ప్రచురిస్తాము. దాతలందరినీ శాశ్వత చందాదారులుగా పరిగణించి పత్రికను ప్రతినెలా పంపిస్తాము. ట్రస్టు ప్రచురించే పుస్తకాలను కూడా వెనువెంటనే పంపిస్తాము.

సొమ్మును ఆన్‌లైన్‌లో 'TELUGUJAATHI' పేర **యాక్సిస్ బ్యాంక్, సికిందరాబాదు**కు పంపాలి. అక్కౌంట్ నెం. 914020020387880 I.F.S.C.Code : UTIB0000068. లేదా- అదే బ్యాంకు పేర బ్యాంకు డ్రాఫ్టుగా పంపాలి. డ్రాఫ్టు పంపుటకు, ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా : డా॥ సామల లక్ష్మణబాబు, ట్రస్టీ, తెలుగుజాతి (ట్రస్టు),8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి.** గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244

**డా॥ సామల రమేష్‌బాబు,(98480 16136) మేనేజింగ్ ట్రస్టీ**
ట్రస్టీలు : పారుపల్లి కోదండరామయ్య, డా॥ వెన్నిసెట్టిసింగారావు, స.వెం.రమేశ్, సామల లక్ష్మణబాబు, కోటిపల్లి సుబ్బారావు, పూదోట శౌరీలు, డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు

ఇది త్యాగయ్య 250వ జయంతి సంవత్సరం(2017-18)

# తెలుగును ద్రావిడీకరించిన మన త్యాగయ్య

**స**ద్గురు త్యాగయ్య కర్ణాటక శాస్త్రీయ సంగీత సీమలో భవ్యమైన సాహిత్యం - మధురమైన భాష అనే రెండు మేరు శిఖరాలను ఏర్పరిచారు. కఠోర పరిశ్రమ, భక్తి, నియమనిష్ఠ, పట్టుదలలతో సంగీత సామ్రాజ్యంలోనే ఎవరికీ అందనంత ఎత్తుకి ఎదిగారు. ఐదు దక్షిణ భారత రాష్ట్రాల్లోనూ ఎక్కువతక్కువలకు లోనవకుండా గౌరవింపబడే వ్యక్తి త్యాగయ్య 250వ జయంతి సంవత్సరం ఈ 2017-18.

త్యాగయ్య ముగ్గురు అన్నదమ్ములున్న ఉమ్మడి కుటుంబంలో చిన్నవాడు. అన్నలిద్దరు కులవృత్తి చేసుకుంటుంటే, తను మాత్రం సొంతంగా రచనలు చేసి, సంగీతం కూర్చి పాడుకొని - వాగ్గేయకారుడనిపించుకున్నాడు. కడుపు కూటి కోసం యాచకత్వాన్ని ఎన్నుకుని సాధుజీవిగా బ్రతికాడు. "నమో నమో రాఘవాయ" కీర్తన ఆయన తొలి రచన. అది మొదలు అన్ని కీర్తనల్లోనూ త్యాగరాజనుత అనో, త్యాగరాజవినుత అనో, త్యాగరాజాప్త అనో మకుటం చేర్చటం ఆయన అలవాటు. ఎందరో ఈ విషయాన్ని అపార్థం చేసుకున్నారు. తన సొంత పేరుని తన సొంత రచనలో పొగుడుకుంటున్నాడనుకున్నారు. కానీ నిజానికి అక్కడున్న త్యాగరాజు వారి కులదైవం త్యాగరాజేశ్వరుడు - తిరువారూరు గ్రామస్వామి.

ఈయన కీర్తనలన్నీ అచ్చ తెలుగులో ఉంటాయి. కొన్నిట్లో సంస్కృతం తెలుగు సమ్మిళితం చేసి, చెవులకు వినసొంపుగా మణిప్రవాళంగా మలిచారు. కొన్ని సందర్భాలలో పూర్తి సంస్కృత కీర్తనలూ వ్రాసారు. ఒక కథనం ప్రకారం త్యాగయ్య 24 వేల కీర్తనలను రచించారట! కానీ వాటిలో 700 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇవే శాస్త్రీయ కర్ణాటక సంగీతానికి ఆయువుపట్టు.

నెనరు, దుడుకు, దొర, చనువు, చౌఅవ, ఇలాంటి వందలాది అచ్చ తెలుగు పదాలను ఆయన వాడారు. ఈ పదాలకు సంస్కృత మూలాల్లేవు. తెలుగులో నిమిడి ఉన్న మూలద్రావిడ భాష పదాలవి. ఆ విధంగా తెలుగును సంస్కృతం కన్నా తన సోదర భాషలు - తమిళం, కన్నడం, మలయాళాలకు దగ్గర బంధువును చేసాడు. అందుకే అక్కడి వారు తెలుగు కీర్తనలను తలకెత్తుకొని కీర్తించారు. తెలుగులో ఉన్నా, అది పరభాష ఐనా, ఆ కీర్తనల భావాన్ని ఎంతో కొంత అర్థం చేసుకోగలిగారు.

తెలుగు పండితులు- పామరులు అందరూ పెద్దా-చిన్నా తేడా లేకుండా మాట్లాడుకునే భాషను దక్షిణ భారత శాస్త్రీయ సంగీతానికి భాషగా చేసింది త్యాగయ్య.

**వేల వేవేల కచేరీల్లో వినబడేది, వినిపించబడేది తెలుగే!**



నన్నయ్య మొదలు తెలుగులో ఇలాంటి గౌరవం ఇంకెవరికీ లేదు. వారి రచనలు పాఠ్యానికే పరిమితమవడం, ఆ పాఠ్యం తెలుగులో కాస్తో కూస్తో ప్రవేశమున్నవారికే అర్థమవటం ఇందుకు ముఖ్య కారణం. వెయ్యేళ్ళకు పైబడిన తెలుగు సాహిత్య చరిత్రలో అన్నమయ్య, రామదాసు, త్యాగయ్య లాంటి అతి కొద్ది మందికే ఇతర భాషీయులను తమ రచనల వైపు - తెలుగు వైపు ఆకర్షింపచేసే శక్తి వాగ్గేయకారులకు ఉండింది.

అన్నమయ్యలా తాత్విక-సాంఖ్యక-భక్తి చింతనల మధ్య అల్లాడుతూనో, లేదా రామదాసులా ప్రభుత్వ పనుల్లో తలమునకలయ్యో లేదు త్యాగయ్య. పూర్తిగా సంగీతం పైనే ధ్యాస. నాదోపాసన చేసాడు. అందుకే అతని సంగీతం ప్రామాణికం. ఈ ప్రామాణికతే ప్రపంచ వ్యాప్తంగా సంగీత పాఠాలుగా నేర్పబడుతోంది. మరీ ముఖ్యంగా దక్షిణ భారత దేశమంతటా. అంటే మన త్యాగయ్య తెలుగును ప్రపంచీకరించడంలో మొట్ట మొదటివాడన్నమాట.

యూరప్ నుండి సాళువ వంశస్థుల ఏలిక విజయనగర సామ్రాజ్య హంపీ నగరానికి వచ్చిన గుర్రాల వ్యాపారి నికొలొ డి కొంటి తెలుగును ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని కొనియాడితే, మన త్యాగయ్య సంగీతానికి అత్యంత అనువైన భాష తెలుగు అని వ్రాసి, పాడి, వినిపించి నిరూపించాడు. నేటికీ అన్ని దక్షిణ రాష్ట్రాలలో అచ్చతెలుగు వినపడేలా చేసాడు.

**-రహ్మానుద్దీన్ షేక్**

---

## పనిమనుషుల వద్ద తెలుగు నేర్చుకుంటున్న ఐఏఎస్ అధికారులు

తెలుగు భాషా కౌశల్య పరీక్షకు ఐఏఎస్ అధికారులు తమ పనిమనుషుల వద్ద ప్రయివేట్ తీసుకుంటున్నారు. పనిమనుషులు ఇంటిపనితోపాటుగా ఐఏఎస్‌లకు తెలుగు మాస్టార్లవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారిణి సుమిత ద్వారా తెలుగు భాషను తన పనిమనిషి వద్ద నేర్చుకున్నట్టు చెప్పింది. ఐఏఎస్ అధికారుల భార్యలు తమ భర్తలకన్నా మెరుగ్గా తెలుగు మాట్లాడుతున్నారు. రహస్యమేమిటంటే పనిమనుషుల దగ్గర మెల్లి మెల్లిగా తెలుగు నేర్చుకోవటమే.

## నీట్ పరీక్షలు తెలుగు మాధ్యమ గందరగోళం

దేశవ్యాప్తంగా డాక్టర్ చదువు కోసం వ్రాసే పరీక్ష నీట్‌ను తెలుగు మాధ్యమంలో కూడా వ్రాసుకునే వెసులుబాటు సీబీఎస్ఈ కల్పించింది. ఐతే పరీక్షలో ఆంగ్ల మాధ్యమం-హిందీ మాధ్యమం పేపర్లతో పోల్చితే తెలుగు పేపర్‌లో ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని తేలింది. భౌతికశాస్త్ర పేపర్‌లో అనువాదాలు తప్పులతడకగా ఉన్నాయని అభ్యర్థులన్నారు.

వరంగల్‌లో తెలుగు మాధ్యమంగా సూచించిన విద్యార్థులకు హిందీ పేపర్లు రావడంతో గందరగోళం ఏర్పడింది. సీబీఎస్ఈ ఆయా విద్యార్థులకు పునఃపరీక్ష నిర్వహించనుంది.

# విశాఖపట్నంలో తెలుగుదేశం మహానాడు దగ్గర తెలుగు భాషోద్యమకారుల నిరసన









**తె**లుగు భాషోద్యమకారులు ఈనాడు మహానాడు వేదిక సాక్షిగా తెలుగుకు ఈ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటారు. నినదించారు.

పగలు 2.30 గం.నుంచి ఒక్కొక్కరుగా ముందు ఉద్యమకారులు పోగయ్యారు. భాషోద్యమ నినాదాలున్న అట్టలను పట్టుకొని, నోటికి నల్లని గుడ్డను అడ్డంగా కట్టుకొని తయారయ్యారు. అది చూసిన ఎబిఎన్ ఆంధ్ర జ్యోతి టివి, టివి5, ఎన్‌టివి వగైరా వారు ఉద్యమ నాయకులు మధు, పరమేశ్వరం వగైరా వారితో ఇంటర్వ్యూ చేశారు. టివి వార్త ద్వారా తెలిసిందో, పోలీస్ ఇంటలిజెన్స్ ద్వారా తెలిసిందో కాని లోపలి నుంచి వెంబడే ప్రతిస్పందన వచ్చిందని వేరే మిత్రులు ఫోన్ చేసి చెప్పారు. తెలుగు భాష కోసం కొన్ని పనులు చేస్తామని ప్రకటించినట్లుగా తెలిసింది. నెమ్మదిగా వేదిక వైపు నడుస్తున్న ఉద్యమ కారులను పోలీసులు అడ్డుకున్నారు. నినాదాలు ఇవ్వము, గొడవ చేయము అన్నా ప్రదర్శనకారులను లోపలికి పోనివ్వలేదు. గేటు దగ్గరే ఉంటామన్నా- నినాదాల అట్టలు ఉన్న వైపు చూస్తూ జనం ప్రోగు అవటం గమనించిన ఒక పెద్ద పోలీస్ ఆఫీసర్ వచ్చి గేటు దగ్గర కూడా ఉండొద్దు అన్నారు. దానితో ప్రదర్శనకారులు రోడ్ డివైడర్ దగ్గర నిలబడ్డారు. అక్కడా జనం మూగటం మొదలయ్యారు. మరో ఆఫీసర్ వచ్చి అక్కడా వద్దు అన్నాడు. రోడ్‌కు రెండవ వైపుకు వచ్చి తరువాత 4.25 గం.ల వరకు నిరసన ప్రదర్శనను కొనసాగించారు.

ఇందులో విశ్రాంత ప్రొఫెసర్ విశ్వేశ్వరం, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు మధు, సాయిప్రసాద్, వీరభద్రం, కిషోర్ వగైరాలు, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ కోదండరామయ్య, భాషోద్యమకారులు వెంకటరావు, మాదిరెడ్డి రమేష్, పవన్, వేదుల కామేశ్వరశర్మ ఇంకా మాతృభాషోద్యమ వేదిక, తెలుగుభాషోద్యమ సమాఖ్య, వివిధ ఉపాధ్యాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంపుటి : 3 సంచిక : 4
అమ్మనుడి
జూన్ 2017

సంపాదకీయం

2017 ఆగస్టు 29 నాటికి ప్రాధికార సంస్థ ఏర్పాటు-

# ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి పరీక్ష

ఎట్టకేలకు తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటుకు సంబంధించిన కమిటీ నివేదికను నిన్ననే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందుకొన్నారు. 2016 ఆగస్టు 29న తెలుగుభాషా దినోత్సవంనాడు ముఖ్యమంత్రి ప్రకటనను అనుసరించి సెప్టెంబరు 14న తెలుగుభాషా సంస్కృతుల అభివృద్ధి అధ్యయన కమిటీ నియామకం జరిగింది. ఆ కమిటీ తనకు నెల రోజుల్లో నివేదికను సమర్పిస్తుందని, దానిని పూర్తిగా ఆమోదిస్తానని ఆనాడు ముఖ్యమంత్రి సభకు వాగ్దానం చేశారు. తొమ్మిది నెలల సమయం తీసుకొని, ఇప్పుడు ఆకమిటీ 156 పుటల నివేదికను ఆయనకు సమర్పించింది. దానిని ముఖ్యమంత్రిగారు వివిధ శాఖాధిపతులకు పరిశీలన నిమిత్తం పంపిస్తున్నట్లు తెలిసింది. ఆగస్టు 29న వేదికపైన ఆయనే ప్రకటించినట్లు ఆ నివేదికను ఇప్పుడు పూర్తిగా ఆమోదిస్తారో లేదో తెలియదు.

కమిటీ ఏమేమి సిఫారసులు చేసింది, వాటిని అంశాలవారీగా పరిశీలించి నిర్ణయం తీసుకొంటారా లేక ప్రాధికార సంస్థను వెంటనే ఏర్పాటుచేసి, తాము ఇచ్చిన మాటలను నిలబెట్టుకొంటారా అనేది ఇంకా స్పష్టత లేని అంశమే. రాజకీయనేతల వాగ్దానాలకు, వాటి అమలుకు ఎంతవరకు సంబంధం ఉంటుందో అందరికీ తెలిసిన సంగతేకదా!

నివేదిక ఇచ్చిన వెంటనే కొన్ని వివరాలను కమిటీ సభ్యులు డా॥ మండలి బుద్ధప్రసాద్ పత్రికలవారికి తెలియజేశారు. కమిటీలో ఆయనతోపాటు అప్పటి భాషా సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ పల్లె రఘునాథరెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీ పరకాల ప్రభాకర్, తదితర అధికారులు ఉన్నారు. మొత్తం కమిటీ రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లో పర్యటించి తయారుచేసిన ఈ నివేదిక మొత్తం డా॥ బుద్ధప్రసాద్‌కుగల తెలుగుభాషా సంస్కృతుల అభివృద్ధి పట్ల గల అవగాహనకు, ఆలోచనలకు అద్దం పడుతుంది. ఈ విషయంలో ఆయనపై ముఖ్యమంత్రిగారికి పూర్తిగా నమ్మకం ఉందని, త్వరలోనే నివేదిక ముఖ్యమంత్రిగారి ఆమోదానికి నోచుకొంటుందని ఆశించడం తప్పు కాదు.

నిజానికి, నివేదికలోని సిఫారసులన్నీ లోగడ ఎన్నో జి.వో.ల రూపంలో వచ్చినవే. 1982లో తెలుగుదేశం పార్టీ స్థాపన సమయంలో ప్రకటించిన దశసూత్ర ప్రణాళికలోనివే. పాలనలో తెలుగు అమలుకు సంబంధించి 60 ఏళ్లకు పైగా నలిగిన అంశాలే. అయితే వాగ్దానాలూ, ఉత్తర్వులూ తప్ప, వాటి అమలు పట్ల శ్రద్ధ వహించని ప్రభుత్వ నేతలదే బాధ్యత అంతా. అధికారుల మీదకో, ప్రజల మీదకో బాధ్యతను త్రోసివేసే రాజకీయ అవకాశవాదం తన నగ్నత్వాన్ని దాచుకోవడం సాధ్యం కాదని తెలుసుకోవాలి. ఇప్పుడు రాగల మార్పు ఒక్కటే. ఇప్పుడు ప్రాధికార సంస్థ ఏర్పడుతోంది గనుక, వ్యవస్థాపరంగా ఇంతవరకు ఉన్న లోటు ఒక్కటీ తీరుతుంది. అయినా మార్పు రాకపోతే అందుకు కేవలం ముఖ్యమంత్రికీ, ఆయన ప్రభుత్వానికీ రాజకీయ సంకల్పం లేదు' అనేది మరింత స్పష్టం అవుతుంది.

విద్యారంగానికి సంబంధించి కమిటీ సిఫారసులను ఈ ప్రభుత్వం ఆమోదించబోదు అనే అనిపిస్తుంది. అయితే ఆ విషయం మీద ఇప్పుడేమీ స్పందించకుండా తన తెలుగు (మాతృభాష) వ్యతిరేక విధానాలను చంద్రబాబుగారి ప్రభుత్వం కొనసాగిస్తుందనే అనిపిస్తుంది. అటువంటప్పుడు ప్రాధికారసంస్థ యీ అంశంపై ప్రభుత్వంతో ఘర్షణ పెట్టుకొంటుందా? ఇది ముఖ్యమైన అంశం.

ప్రాధికార సంస్థను ఏడు విభాగాలతో ఏర్పరచుతారని పత్రికల్లో వచ్చింది. అవి అధికారభాష అమలు విభాగం, తెలుగు భాషాభివృద్ధి విభాగం, ఇ-తెలుగు విభాగం, అనువాద విభాగం, ప్రచురణల విభాగం, అంతర్జాతీయ

తెలుగుభాషాభివృద్ధి విభాగం, గ్రంథాలయాల విభాగం. మొదటి ఆరు అంశాల సంగతి బాగానే ఉంది గానీ గ్రంథాలయాలకు సంబంధించి మాత్రం వేరొక ప్రత్యేక సంస్థను ఏర్పరచడం మంచిది.

ఇంతకూ ప్రాధికార సంస్థను చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన సంస్థగా ఏర్పాటుచెయ్యవలసి వుంది. కాలం చెల్లిన పాత అధికారభాషాసంఘం (ఇది కేవలం సలహా సంఘమని మరువరాదు) సహజమరణం చెందుతుంది. తెలుగుభాషను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు, ముఖ్యంగా విద్య, పాలనా రంగాల్లో ఉన్నతస్థాయికి చేర్చేందుకు, అంతర్జాతీయస్థాయిలో ఒక ముఖ్యమైన, శక్తిమంతమైన భాషగా తీర్చిదిద్దేందుకు ప్రాధికార సంస్థను మనం నిర్మాణం చేసుకోవలసి ఉంది.

అయితే – ఇప్పుడు కార్పొరేట్ శక్తులకు పూర్తిగా లొంగిపోయిన ప్రభుత్వం ఇందుకు సిద్ధపడుతుందా అనేది అసలు ప్రశ్న. మాటకూ చేతకూ ఏమాత్రం సంబంధంలేని మన ప్రభుత్వనేతలు ఈ కమిటీ నివేదికను బుట్టదాఖలు చేసేంత 'తెలివితక్కువవారు' కాదు. తెలుగుదేశం ప్రభుత్వనేత ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన 'తెలుగు అభివృద్ధి ప్రాధికార సంఘం' ప్రతిపాదనను ఏ సాకుతో త్రోసిపుచ్చినా – అది వినాశనాన్ని కోరి తెచ్చుకోవడమే అవుతుంది. 1982లో ఎన్‌టిఆర్ ప్రకటించిన 10 సూత్రాల ప్రణాళికనూ, 2014లో ఎన్నికల సందర్భంగా పార్టీ ప్రకటించిన ఎన్నికల వాగ్దానాలనూ త్రోసిపుచ్చినట్లవుతుంది. కనుక చంద్రబాబుగారి వంటి రాజనీతిజ్ఞుడు అంత తెలివితక్కువ పని చెయ్యరు.

ఆయనకు కావలసినవి రాజకీయ ప్రయోజనాలు. ఆమాటకు వస్తే రాజకీయనాయకులందరికీ కావలసింది అదే. ఇందుకు ఏ స్థాయివారూ మినహాయింపు కాదు. అందువల్ల ఆయన ప్రాధికార సంఘాన్నీ, కమిటీ సూచించిన అకాడమీలనూ అన్నిటినీ స్థాపించడానికి సిద్ధపడతారు. వీలైనంత ఆర్భాటంతో రానున్న సాధారణ ఎన్నికల నాటికి –ఎంతో ప్రచారాన్ని, ప్రజల్లో ఆసక్తినీ కలిగించే విధంగా మరల తమ తెలుగుభక్తిని ప్రదర్శిస్తారు. కానీ, ఆచరణలో ఇప్పటి పరిస్థితి పెద్దగా మారుతుందని అనుకోలేం.

'మహానాడు' సందర్భంగా కొందరు భాషోద్యమకారులు విశాఖపట్టణంలో ఆ వేదిక దగ్గరే నిరసన ప్రదర్శన చేశారు. అంతేకాకుండా, నిరంతరం ఏదోవిధంగా భాషోద్యమ భావాల ప్రచారం ప్రభుత్వం చెవిన పడుతూనే ఉంది. అందుకే ముఖ్యమంత్రిగారు మహానాడులో ఒక మహత్తర సందేశాన్నిచ్చారు– 'ఉపాధికి ఆంగ్లం, ఉనికికి తెలుగు' అని. ఈ కొద్ది అక్షరాలు చాలు, ఆయన ఆలోచనాధోరణిని తెల్పేందుకు. తెలుగువాళ్లంగా మనకు గుర్తింపు కావాలి గనుక సాంస్కృతికంగా మనం తెలుగువాళ్లంగా ఉనికిని కాపాడుకోవాలనీ, ఉపాధికి మన తెలుగుభాష పనికిరాదు అనీ, ఇంగ్లీషుతోనే మన బ్రతుకు వెలుగుతుందనీ తెలుగురాష్ట్ర ముఖ్యమంత్రిగారిచ్చిన ఘనమైన సందేశం అది!

ఇంత స్పష్టంగా సందేశాన్ని తెలుగుదేశం పార్టీ మహానాడు సందర్భంగా తమ పార్టీకీ, ప్రజలకూ అందజేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారి ధైర్యానికి మెచ్చుకోవాలి. అయితే ఒక్క విషయం ముఖ్యమంత్రిగారికి స్పష్టం చెయ్యదలచాం : "అయ్యా, తమ ఆలోచన, అవగాహన పూర్తిగా తప్పు. తెలుగుప్రజల్లో ఇప్పటికీ అత్యధిక శాతం తెలుగుతోనే బ్రతుకుతున్నారు. ఇంగ్లీషువల్ల బ్రతుకుతున్నామనుకోవడం, దానివల్లే భవిష్యత్తు ఉందనుకోవడం అధ్యయన లేమికీ, బానిసభావనకూ పరాకాష్ఠ మాత్రమే. దీన్ని పూర్తిగా నిరూపించడానికి తెలుగునేలపై మేధావులూ, భాషోద్యమకారులూ సిద్ధంగా వున్నారు. దయచేసి వారు చెప్పేదీ, వ్రాసేదీ తెలుసుకోవడానికి మీరు సిద్ధమైతే, అందుకు సమయాన్నివ్వగలిగితే – మేము వినయపూర్వకంగా అటువంటి సమావేశాన్ని ఏర్పాటుచెయ్యడానికి గాని, సమాచారాన్ని తమకు అందజేయడానికి సిద్ధంగా ఉన్నాం."

ప్రాధికార సంస్థ నిర్మాణం కోసం ముఖ్యమంత్రిగారు నియమించిన కమిటీ ఇచ్చిన నివేదికను వెంటనే ఉన్నదున్నట్లు ఆమోదించాలని కోరుతున్నాం. రాజకీయ పునరావాసానికి, ఆశ్రితులకు పదవులివ్వడానికి సంస్థను బలిచెయ్యకుండా, తెలుగు అభివృద్ధి పట్ల నిబద్ధత గలవారికి, నిపుణులకు బాధ్యత నివ్వాలని ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాం. ఇది ముఖ్యమంత్రిగారి చిత్తశుద్ధికి పరీక్ష. రాబోయే ఆగస్టు 29 నాటికి ఈ సంస్థను ఏర్పరచి, ప్రజల మన్ననలను పొందాలని ముఖ్యమంత్రిగారికి విన్నవిస్తున్నాం.

తేదీ: 31-05-2017

సామల రమేష్‌బాబు

-నూర్‌బాషా రహంతుల్లా
9948878833

# పాలనా భాషగా తెలుగు అమలులో ఎదురయ్యే సమస్యలు -పరిష్కారాలు

**శి**శువుకు తల్లిపాలు ఎలాంటిదో విద్యార్థికి మాతృభాషలో బోధన కూడా అలాంటిదేనని రవీంద్రనాథ్ ఠాగూర్ పేర్కొన్నారు. కానీ నేటి ప్రభుత్వం తీసుకొస్తున్న జీ.ఓ 14 నిర్ణయం గూర్చి ప్రతీ తెలుగు పౌరుడు ఎంతగానో ఆలోచించి మాతృభాషా వికాసానికై, దాని పరిరక్షణకై ఉద్యమించాల్సిన సమయం ఆసన్న మైనది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తొలగించి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శిశువుకు తల్లి పాలను త్రోసిపుచ్చి ఒకేసారి ఆవకాయ అన్నంతో అన్నప్రాసం చెసే విధంగా ఉంది. ఇటువంటి నిర్ణయాలు ప్రముఖ భాషావేత్తలతో చర్చించి, పరిశీలించి అమలు చేయడం సమంజసం.

◈ మాతృభాషను ప్రాథమిక స్థాయినుండి నేర్చుకోని విద్యార్థి పరభాషను నేర్చుకోవడం ఎంతవరకు సాధ్యం? ఇతర భాషల్ని నేర్చుకోవడానికై మాతృభాష అభ్యసనం ఎంతగానో దోహద పడుతుందని, ప్రముఖ పాత్ర వహిస్తుందని ఎంతోమంది భాషావేత్తలు, మనోవైజ్ఞానిక వేత్తలు సూచించిన అభిప్రాయం.

◈ ఇరుగు పొరుగు రాష్ట్రాలు వేరే భాషలతో సంబంధం లేకుండా వారి మాతృభాషాభివృద్ధికై కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. వీటిని గమనించైనా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిర్ణయాలు తీసుకోవాలి. మన రాష్ట్రప్రభుత్వం నేడు తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా మాతృభాషా వికాసం జరుగుతుందా? క్షీణిస్తుందా? ఈ నిర్ణయం కారణంగా కలిగే ప్రయోజనాలు, అప్రయోజనాలేమిటీ? అనే విషయాన్ని ప్రభుత్వం ఎంతోమంది భాషావేత్తలతో సునిశితంగా చర్చించాలి.

◈ మాతృభాషను పరిరక్షించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. అటువంటి బాధ్యతను విస్మరించి తెలుగుతల్లిని అగౌరవపరిచేలా తీసుకున్న ఈ నిర్ణయం వెంటనే రద్దు చేయాలి.

◈ భారత రాజ్యాంగం 350 అధికరణం ప్రకారం ప్రాథమిక విద్య ఎవరికైనా మాతృభాషా మాధ్యమంలోనే చదువు చెప్పాలని చెప్పుతుండగా, రాజ్యాంగానికి విరుద్ధంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతవరకు సమంజసమూ? ప్రభుత్వం మరొకసారి పునఃపరిశీలించాలి.

**భా**షల ప్రాతిపదికపై ఏర్పడిన మొదటి రాష్ట్రం అంధ్రప్రదేశ్. తమిళభాష ఆధిపత్యాన్ని వదిలించుకొని మన తెలుగు భాషలో మనల్ని మనమే పరిపాలించుకుందామనే సదాశయంతో ఆనాడు ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు తెలంగాణా,ఆంధ్రప్రదేశ్ రెండూ తెలుగు రాష్ట్రాలే. ఉమ్మడి రాష్ట్రంలోని భాషా పరమైన కోరికలే ఇప్పటికీ తెలుగు ప్రజలలోఉన్నాయి,ఎప్పటికీ ఉంటాయి. అవి తీరేదాకా ప్రజలు అడుగుతూనే ఉంటారు. ప్రజల భాషలో పరిపాలన జరగాలనే కోరిక అతి సహజమైనది.

**ఇప్పటివరకు వచ్చిన జీవోలు :**

తెలుగులో పాలన సాగించటం కోసం 1988 నుండి ఇప్పటి వరకు 5 ముఖ్యమైన ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయి. వాటి ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అధికార భాషగా తెలుగును ఖచ్చితంగా అమలు చెయ్యాలి. జీవోలిచ్చారు కానీ ఆ ఉత్తర్వులు ఎన్నడూ సరిగా అమలు కాలేదు. అవేమిటో చూద్దాం:

1. ఆంగ్లంలో వచ్చిన ఏ ఉత్తరం పైనా ,ప్రతిపాదనపైనా ఎలాంటి చర్య తీసుకోకుండా తిప్పి పంపే అధికారం ప్రతి గజిటెడ్ అధికారికీ ఉంది. తమకంటే పై అధికారుల కార్యాలయాలనుండి వచ్చినా సరే ఆంగ్లంలో వచ్చిన లేఖలను తిప్పి పంపవచ్చు. ఈ విధంగా చేయడం వల్ల జరిగే కష్ట నష్టాలకు,జాప్యానికీ వాటిని ఆంగ్లంలో పంపిన అధికారులదీ, కార్యాలయాలదే బాధ్యత. (ప్రభుత్వ ఉత్తర్వు (సాధారణ పరిపాలన అ.భా శాఖ) సంఖ్య -167, తేదీ. 19.3.1988)

2. 1988 నవంబరు 1 వ తేదీ నుండి రాష్ట్రంలో ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే జరగాలి. అన్ని ప్రభుత్వ ఉత్తర్వుల జారీకి తెలుగు భాషనే ఉపయోగించాలి. ఆంగ్లం వాడకూడదు. కేంద్ర ప్రభుత్వం,ఇతర రాష్ట్రాలు,రాష్ట్రం వెలుపల ఉన్న చిరునామాదారులతో మాత్రమే ఆంగ్లం ఉపయోగించాలి. (ప్రభుత్వ ఉత్తర్వు (సాధారణ పరిపాలన అ.భాశాఖ) సంఖ్య- 587, తేదీ. 28.10.1988)

3. అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అన్ని సంస్థలు, అన్ని స్థానిక సంస్థలు తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలి. అన్ని శాసనేతర అవసరాలకు ప్రజలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలకూ తెలుగు భాషనే ఉపయోగించాలి. (ప్రభుత్వ ఉత్తర్వు (సాధారణ పరిపాలన అ.భా శాఖ) సంఖ్య - 218, తేదీ. 22.3.1990)

4. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వులు, నియమాలు, నిబంధనలు, ఉపవిధులు అన్నీ కూడా తెలుగు భాషలోనే ఉండాలి. (ప్రభుత్వ ఉత్తర్వు( సాధారణ పరిపాలన అ.భా శాఖ) సంఖ్య- 420, తేదీ .13.9.2005 )

5. రాష్ట్రంలోని అన్ని దుకాణాలు ,సముదాయాల బోర్డులు ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ నామఫలకాలు,శంకుస్థాపన శిలాఫలకాలు తెలుగులోనే రాయించాలి. ( ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 11 (యువజన & సాంస్కృతిక అధికార భాష శాఖ) తేదీ. 14.9.2016)

పై ఉత్తర్వులన్నీ ఖచ్చితంగా అమలుచేస్తే పరిపాలన పూర్తిగా తెలుగులోనే జరుగుతుంది. జరిగి తీరాలి.

**మరి తెలుగు పరిస్థితి ఎందుకు ఇలా దిగజారింది ?**

తెలుగువాడిగా పుట్టటం ఎన్నోజన్మల పుణ్యఫలం అనీ, రాయల కాలంనాటి రాజభాష అనీ గొప్పలు చెప్పుకోవటమే కానీ, క్రమంగా తెలుగు భాష పాలనకు దూరమై కవులకూ కవిత్వాలకు మాత్రమే పరిమితమై పోయింది. తెలుగులో చదువుకొనే పిల్లలు తగ్గిపోయారు. తెలుగు బడులు మన కళ్ళముందే ఇంగ్లీష్ కాన్వెంట్లుగా మారిపోయాయి. తెలుగులో చదివితే ఉద్యోగాలు రావు అనే అభిప్రాయానికి ప్రజలు వచ్చేలా చేసారు. ప్రాథమిక పాఠశాలలు కూడా ఇంగ్లీషువే

కావాలని పట్టుబడుతున్నారు. ఎందుకంటే తెలుగు మాత్రమే చదివితే ఉద్యోగాలు రాని పరిస్థితి ఉంది. తెలుగు భాష ద్వారా కూడా ఉద్యోగాలూ, డబ్బు వస్తుంటే, అప్పుడు కొందరైనా స్వార్థం కొంత చంపుకొని తెలుగు చదువుతారు. తెలుగు భాషను బయటి వాడు ఎలాగూ ఆదరించడు, ఇంట్లోని వాడూ ఆదరించటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తెలుగులో పరిపాలన కోరుతున్న మనల్ని కొందరు విచిత్రంగా చూస్తారు. ప్రజల భాష పాలనా భాషగా మారకపోతే, ఆ భాష చచ్చిపోతుంది. తెలుగు భాషను ఇళ్ళల్లో మాట్లాడుకోవటానికి పరిమితం చేసి, ఆఫీసుల్లో మాత్రం ఆంగ్లానికి పట్టం కడుతున్నారు. తెలుగు ప్రజలు ఇంట్లో తెలుగు మాట్లాడుకున్నా, ఆఫీసులో ఇంగ్లీషు, కోర్టులో ఇంగ్లీషు, కొన్ని ప్రాంతాల్లో హిందీ లేదా ఉర్దూ మాట్లాడాల్సి వస్తుంది. చివరికి దేవుడి ప్రార్థన చేసుకుందామన్నా సంస్కృతంలోనో అరబ్బీలోనో చేసుకోవాల్సి వస్తోంది. **తెలుగు మనిషి మనసుతో పనిలేని ఓ యంత్రం లాగా మారాడు. అలా కాకుండా ఆఫీసుల్లో కూడా మన మనసే (అమ్మభాష) రాజ్యమేలాలి అంటే ఆ భాష బాగా నేర్చిన వారిని మాత్రమే అధికారులుగా రానివ్వాలి.** పాలకులకు ఆచరణలో కొన్ని భాషాపరమైన అవసరాలు, సమస్యలు పదేపదే ఎదురౌతాయి. అందువలన మన భాషలో పరిపాలన బాగా జరగటానికి

ఇంకా ఏమేమి సమస్యలు ఎదురౌతాయో వాటిని అధిగమించి ఎలా పనులు చెయ్యాలో చూద్దాం:

**1. న్యాయపాలన తెలుగులోకి మారాలి**

పూర్వకాలంలో మన దేశంలోని రాజులు చక్రవర్తులు, తమ తమ మాతృభాషలలో ప్రజలతో సంభాషించేవారు. అలాగే దైనందిన జీవిత వ్యవహారాల పరిష్కారాల విషయంలో కూడా మాతృభాషని ఉపయోగించటం వలన ప్రజలకు రాజ్యపాలన దగ్గరైంది. ప్రజల భాషలోనే రాజ్యపాలన సాగింది. ఎవరైనా బాధితుడు వచ్చి ధర్మ గంటను మ్రోగిస్తే, రాజు విచ్చేసి బాధితుడి మొరవిని నిందితుడ్ని పిలిపించి అందరి సమక్షంలో విచారించేవాడు. అ విచారణలో ఇరు పక్షాల వాదోపవాదాలు మాతృ భాషలో జరిగేవి. తీర్పరి అయిన రాజుగారికి ఫిర్యాది-నిందితుడికీ మధ్య మధ్యవర్తిగా ఏ 'ప్లీడరు' వుండేవాడు కాదు.

రాజు విచారణ జరిపేటపుడు ప్రజల భాషలోనే ప్రశ్నించి వివాద మర్మాన్ని పసిగట్టేవాడు. చివరకు ప్రజల భాషలోనే తీర్పు ప్రకటించే వాడు. ఈ మేరకు ఆటు విచారణ - ఇటు తీర్పు ప్రజల సొంత భాషల్లో జరగటంతో మధ్యవర్తుల ఆవసరమే వుండేది కాదు. తీర్పు సొంతభాషలో రావడంతో ఫిర్యాదికిగానీ, నిందితుడికిగాని అర్థంకానిదంటూ ఏమీ వుండేది కాదు. ప్రస్తుత న్యాయపరిపాలన విధానంతో అనాటి పద్ధతులను పోల్చి చూసుకుంటే ఎంతో క్షోభ కల్గుతుంది. ఈనాటికైనా పరిపాలనా విధానాలన్నీ ప్రజల భాషలోనే జరిపితే, అనాటి ఆనంద కరమైన పరిస్థితులు తిరిగి వస్తాయి.

పశ్చిమ గోదావరిజిల్లా మొగల్తూరు మండలంలో ఎమ్మార్వోగా ఉండగా 23 రిట్ పిటీషన్లకు పేరావారీ జవాబులు తెలుగులోనే రాసిపంపాను. కలెక్టరేట్ నుండి ఫోన్. తెలుగులో ఎందుకు పంపారనే ప్రశ్న. తెలుగులోనైతే జవాబులు తప్పులేకుండా సూటిగా, స్పష్టంగా ఇవ్వగలననీ, అర్థంకాక పోవడమనే సమస్యే రాదనీ, వాటిని యథాతథంగా హైకోర్టుకు సమర్పించమనీ, కాదు కూడదంటే ఇంగ్లీషులోకి తర్జుమా చేయించి జిల్లా కేంద్రం నుండే హైదరాబాద్‌కు పంపించండనీ వేడుకున్నాను. పై జీవోలూ, అధికార భాషా చట్టం పుణ్యాన వారు వాటిని హైకోర్టులో నివేదించారు. యథాతథంగానో, ఆంగ్లంలోకి మార్పించో నాకు తెలియదు గానీ అన్ని కేసులూ గెలిచాం. **ఆలోచన మన అమ్మ భాషలోనే పుడుతుంది. అమ్మ భాషలో వాదిస్తే గెలుపు ఖాయం అనే సంగతి అర్థమయ్యింది.**

**2. అన్నిదరఖాస్తులు తెలుగులోఉండాలి**

పాలకొల్లు మండలంలో ఎమ్మార్వోగా ఉండగా దరఖాస్తు ఫారాలు నింపడానికి ఆఫీసు బయట ఒక ప్రైవేటువ్యక్తి పనిచేస్తూ ఉండేవాడు. వచ్చిన వ్యక్తుల అవసరాలనుబట్టి ఇంతింత ఈ ఫారం నింపడాని కివ్వాలని వసూళ్ళు చేస్తున్నాడని ఫిర్యాదులు వచ్చాయి. ఆ ఫారాలు ఇంగ్లీషులో ఉండేవి. ఏయే పనులకోసం ఈ ఆఫీసుకు ప్రజలు వస్తున్నారు, ఏమేమి ఫారాలు వాళ్ళు పూరించి ఆఫీసులో ఇవ్వాలో తెలుసుకున్నాను. ఓపికగా ఆయా దరఖాస్తులు తెలుగులోకి అనువదించాను. నాలుగైదు తరగతులు చదివిన వారెవరైనా పూర్తిచేయటానికి వీలుగా అన్నిరకాల దరఖాస్తుఫారాలు తయార య్యాయి. వాటిని ఆ ఊళ్ళోని జిరాక్సు షాపులన్నిటికీ ఇచ్చి కేవలం అర్థరూపాయికే ఏ ఫారమైనా అమ్మాలని చెప్పాము. ఎవరికివారే ఫారాలు నింపుకొని వస్తున్నారు. ప్రతిఫారమూ నాలుగైదు దశలు దాటివచ్చే పద్ధతి తీసేశాం. గ్రామ పాలనాధికారి, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ సంతకాలు చేస్తే చాలు. వాటిపైన నేను సంతకం చేసేవాడిని. ఆఫీస్‌లో గుమాస్తాల ప్రమేయం తగ్గింది. పత్రాల జారీవేగం పెరిగింది.

**3. ధృవీకరణపత్రాలు తెలుగులోనే ఇవ్వాలి**

నేను హై స్కూల్ చదువుకు రోజూ 7 కి.మీ. కంకటపాలెం నుండి బాపట్ల నడిచి వచ్చే వాడిని. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం తహసీల్ దార్ ఆఫీస్‌కు వారం రోజులపాటు తిరిగేవాడిని. ప్రతిరోజూ దఫేదారు దగ్గర ఒకటే సమాధానం- దొరగారు క్యాంపు కెళ్ళారు, రేపురండి. ఆనాడు అనుకున్నాను నేను గనక తాసీల్దారునైతే చిన్నపిల్లలకు చకచకా సంతకాలు చేసి పంపిస్తాను. తహసీల్దారు నయ్యాక మాట నిలుపుకున్నాను.

స్కూళ్ళు తెరిచే జూన్ మాసంలో సర్టిఫికెట్ల కోసం పిల్లలు బారులు తీరేవాళ్ళు. రద్దీ ఎక్కువగా ఉన్నపుడు ఆ పిల్లల చేతనే సర్టిఫికెట్లపై నంబర్లు వేయించి స్టాంపు, సీలు కొట్టుకోమనేవాడిని. అరగంటలో పిల్లలంతా సర్టిఫికెట్లతో వెళ్ళిపోయేవారు. అంతా తెలుగులోనే. తెలుగు పిల్లలు తెలుగులో ఎంతో వేగంగా పనిచేసేవాళ్ళు. నా 13 సంవత్సరాల ఎమ్మార్వో పదవీ కాలంలో తెలుగు పిల్లలు ఎక్కడా పొరపాటు చేయలేదు. రిజిస్టర్లన్నీ చక్కటి తెలుగులో మన తెలుగు పిల్లలే నిర్వహించారు. మండలంలోని అన్ని హైస్కూళ్ళ ప్రధానోపాధ్యాయులకూ ఒక ప్రొఫార్మా ఇచ్చి, వారి స్కూల్లోని పిల్లలందరి కులం, స్వస్థలం, పుట్టిన తేదీ- మొదలైన వివరాలు నింపి ధ్రువీకరించి పంపమని కోరాను. ఆయా గ్రామ పాలనాధికారులు కూడా ఆ వివరాలను ధ్రువీకరించారు. పిల్లలెవరూ మండల కార్యాలయానికి రానక్కర లేకుండా? శాశ్వత కుల, నివాస స్థల, పుట్టిన తేదీ ధ్రువపత్రాన్ని' వారి ఫొటోలు అంటించి, వారి వారి పాఠశాలల్లోనే పంపిణీ చేశాం. పట్టాదారు పాసుపుస్తకాలు రైతుల ఇళ్లకు పంపిణీ చేయించాం. వీటన్నిటిని తెలుగు రాతపనిలో, మంచి చేతిరాతకలిగిన గ్రామ సేవకులు, ఉపాధ్యాయులు, గ్రామ పాలనాధికారులు, విద్యార్థుల్ని కూడా ఉపయోగించుకున్నాం. ఎలాంటి తప్పులూ దొర్లలేదు. ఏ ఊరి ప్రజల పని ఆ ఊళ్లోనే ఆ ఊరివాళ్లే చేసుకున్నందువలన ఎంతో స్పష్టంగా పనిజరిగింది. ఇప్పుడు 'విద్యార్థుల సేవలో' రెవిన్యూ అనే మంచి కార్యక్రమం జరుగుతోంది.

**4. తెలుగు అనువాదాలు ఇంకా బాగుపడాలి**

2008 లో పులిచింతల ప్రాజెక్ట్‌లో భూసేకరణ సమ్మతి అవార్డు తెలుగులో ఇచ్చాను. అంతకు ముందు ఎలాంటి మాదిరీ లేని పరిస్థితుల్లో కొత్తగా అనువాదానికి స్వయంగా పూనుకొని రాసిన ఆ అవార్డు రాష్ట్రంలో మొదటి తెలుగు అవార్డు అయ్యింది. ః- అధికారులలారా! ఇలా మీరెందుకు రాయలేరు?! (జనవరి, 2009, పాలనాభాష (సమాచారనేత్రం). కాబట్టి ఎవరో ఒకరు పూనుకొని కొత్త పత్రాలను తయారు చేయాలి. అవే కాలక్రమేణా మెరుగు పడుతూ వాడుక భాషలోకి మారుతూ అందరికీ మార్గదర్శకమౌతాయి.

**ప్రస్తుతం ఇంగ్లీషు నుండి తెలుగులోకి, తెలుగు నుండి ఇంగ్లీషు లోకి కంప్యూటర్‌పై జరిగే అనువాదాలు సవాలక్ష లోపాలతో ఉన్నాయి. తెలుగువారు సాంకేతికంగా ఎంత ఎదిగినా, నేటివరకూ అనువాద యంత్రాల తయారీలో బాగా వెనుకబడే ఉన్నారు. కారణం తెలుగు చదువు నాశనమై పోవడమే.** కాబట్టి అనువాదాలను తప్పుల్లేకుండా చేసి ఇచ్చే సాఫ్ట్‌వేర్ల తయారీదార్లపై తెలుగు ప్రజలు,నాయకులు దృష్టి సారించాలి. మంచి తమిళంలో ఉత్తమ సాఫ్ట్‌వేర్‌ను ఎంపిక చేసి, దాని రూపకర్తకు కన్యన్‌పూంగుండ్రనాథ్ పేరుతో రూ.1 లక్ష నగదు అవార్డు, ప్రశంసపత్రం ప్రతి సంవత్సరం పంపిణీ చేస్తున్నారు. తెలుగులో కూడా ఉత్తమ సాఫ్ట్‌వేర్‌లు తయారుచేసిన సాంకేతిక నిపుణులకు,తెలుగు భాషకు ఉపకరించే సులభ ఉపకరణాలను తయారు చేసిన సాంకేతిక పరిజ్ఞానులకు తెలుగు వైతాళికుల పేరు మీద ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలి. మనకు కూడా కొలిచాల సురేశ్, వెన్న నాగార్జున లాంటి కంప్యూటర్ తెలుగు లిపి సాంకేతికులు చాలామంది ఉన్నారు. తెలుగులోకి తర్జుమాలో తప్పులు రాకుండా మెరుగు పరిచే వారికి ఆర్థిక సహాయం చెయ్యాలి. అనువాద ఉపకరణాలు లెక్కకు మిక్కిలిగా రావాలి. ఆన్‌లైన్‌లోనూ ఆఫ్‌లైన్‌లోనూ వాటిని విరివిగా లెక్సికన్లు వాడుకునే సౌలభ్యాలు కలగాలి. యంత్రానువాదాలకూ, లిప్యంతరీకరణకూ, విషయాలకు ఆకారాది సూచికలను తయారు చేయటానికీ, వెతకటానికి అనుకూలంగా తెలుగులో కంప్యూటర్ వాడకం పెరగాలి. తెలుగు నుండి ఇంగ్లీషు తదితర భాషల్లోకి అలాగే ఇంగ్లీషు నుండి తెలుగులోకి తర్జుమా చేసే ఉపకరణాలు ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందలేదు. అనువాదంలో చోటుచేసుకుంటున్న లోపాలను తప్పుల్నీ సరిదిద్దటానికి తెలుగు సాంకేతిక నిపుణులు అందరూ పూనుకోవాలి. ఈ అనువాద సామాగ్రి ఎంత నాణ్యంగా అభివృద్ధి చెందితే తెలుగులో పాలన అంత నాణ్యతగా ఉంటుంది. ఫైళ్ళ కదలికలో వేగం పెరుగుతుంది. ఏ ఏటికాయేడు విడుదలైన అనువాద ఉపకరణాలలో నాణ్యమైన వాటికి బహుమతులివ్వాలి.

**5. నిఘంటువులలో వాడుక భాష పదసంపద పెరగాలి – వాడుకభాష లోకి చట్టాలు మారాలి**

మన రాష్ట్రంలో తెలుగు మొదటి అధికార భాష కాగా ఉర్దూ రెండవ అధికార భాష. ఈ రెండు భాషల ప్రజల మధ్య వారివారి భాషా పదాల పరిచయం, అవగాహన, మరింత పెరగటానికి నిఘంటువులు ఎంతగానో తోడ్పడతాయి. **ఉర్దూ-తెలుగు నిఘంటువు, ఉర్దూ-తెలుగు జాతీయాలు, తెలుగు-ఉర్దూ సామెతలు లాంటి పుస్తకాలు ఎక్కడా అమ్మకానికి దొరకడంలేదు. ముద్రించాల్సిన అవసరం ఉంది. ముషాయిరాల కంటే ముఖ్యమైన తెలుగు-ఉర్దూ, ఉర్దూ- తెలుగు నిఘంటువులు కావాలి. వక్ఫ్‌బోర్డు నిఖానామాలు (వివాహ ధ్రువపత్రాలు) తెలుగు భాషలో కూడా ప్రచురించాలి.** తెలుగు జాతీయాలూ, నుడికారాలూ, పదబంధాలూకూర్చిన నిఘంటువుల అవసరం ఉంది. ఆన్‌లైన్‌లోనే నిఘంటువులకు కొత్త పదాలను జోడించే అవకాశం అందరికీ ఇవ్వాలి. ఏయే ప్రాంతాల్లో ఏ పదాన్ని ఎందుకు, ఎలా వాడుతుంటారో ఆయా ప్రాంతాల ప్రజలనే చెప్పనివ్వాలి. సరిగా ఉన్నట్లు భావించిన కొత్త పదాలను ఎప్పటికప్పుడు నిఘంటువుల్లో చేరుస్తూ పోవాలి. మన నిఘంటువుల సైజు పెరగాలి. అవి జన బాహుళ్యానికి వాడకంలోకి విస్తారంగా వస్తూనే ఉండాలి. వాడుక భాషలో నానా భాషలూ కలగాపులగంగా ఉంటాయి. అయితే అవన్నీ ప్రజలకు బాగా అర్థమౌతాయి. పరభాషా పదాలనే కారణంతో ఇప్పుడు తెలుగు వాడకంలోంచి సంస్కృతం, ఇంగ్లీషు, ఉర్దూ పదాలను తీసివేయ కూడదు, తీసివేయలేము. ఎందుకంటే అవి మనభాషలో అంతర్భాగాలై పోయాయి. **అక్కరలేని ఆపరేషన్ ఎవరు చేయించు కుంటారు? చేసినా గాయాలవడం తప్ప, మరే మేలూ కలుగదు. అందువలన ఈ సంకర తెలుగు భాషలోనే ఆఫీసుల్లో ఫైళ్ళు నడిపితే అదే పదివేలుగా భావించాలి. ఛాందసవాదులు- వాళ్ళు చెయ్యరు, ఇంకొకళ్ళను చేయనివ్వరు. ఒకవేళ ఈ పనిని వాళ్ళకప్పజెబితే ఎవరికీ అర్థంకాకుండా పాడుచేస్తారు. ప్రజలు ఇంతకంటే ఇంగ్లీషే నయమని వాపోయేలా చేస్తారు. మన శాసన సభలో ఎమ్మెల్యేలు ఈ మూడు భాషల పదాలు కలగలిపి మనోరంజకంగా మాట్లాడుతున్నారు. అదే నేటి తెలుగు, వాడుక తెలుగు. వారు అడిగింది అడిగినట్లు తెలుగు లిపితో సాగదనుకుంటే ఆంగ్లలిపినే వాడుకోండి. మన మాటముఖ్యం. వాళ్ళు ప్రజాప్రతినిధులు. వాళ్ళు మాట్లాడుతున్నది మన ప్రజల భాష. ఆ భాషలో, యాసలో జీవోలు రావాలి. అప్పుడే తెలుగు అధికార భాషగా విరాజిల్లుతుంది.**

మాతృభాష అంటే పసిపిల్లవాడికి తల్లి ఉగ్గుపాలతో పాటు రంగరించి పోసే భాష. మమ్మీ, డాడీ, ఆంటీ, అంకుల్, బ్యాగు, బుక్కు,స్లేట్, పెన్సిల్ లాంటి మాటలు తెలుగు తల్లులు తమ పిల్లలకు రంగరించి పోస్తున్నారు. బయట స్కూలు, ఆఫీసు, మార్కెట్టు, కోర్టుల్లో ఎన్నెన్నో ఆంగ్ల పదాలు ఎడతెరిపి లేకుండా వాడుతున్నారు. మాటకు వాడుకే గదా ప్రాణం? వాడకం అంతా ఆంగ్లపదాల్లో జరుగుతూ ఉంటే తెలుగు గ్రంథానికి పరిమితమై పోయింది. కవులు, సాహితీ వేత్తలు మాత్రమే భాష గురించి బాధ పడుతున్నారు. పాలక భాషకు ఉండవలసినంత పదసంపద ఎన్నేళ్లు గడిచినా సమకూర్చలేక పోతున్నారు. అనువాదకులు తేటతెలుగుకు బదులు సంస్కృతం వాడి భయపెడుతున్నారు. కాలగమనంలో కొత్త కొత్త ఆంగ్లపదాలే మనకు అబ్బుతున్నాయిగానీ, కొత్త తెలుగు పదాలుగానీ, పాతవేగాని కొత్తగా వాడకంలోకి రావడంలేదు.

వేలాది ఆంగ్ల పదాలు మన తెలుగు ప్రజల నాలుకలపై నాట్య మాడుతూ, మన పదాలే అన్నంతగా స్థిరపడిపోయాయి. ఈ పదాలను విడిచిపెట్టి మనం తెలుగులో సంభాషణ చేయలేము. చేసినా ప్రజలకు అర్థంగాదు. ఉర్దూ, సంస్కృత,ఆంగ్ల పదాలెన్నింటినో తెలుగు తనలో కలుపుకుంది. అలాగే తెలుగు ప్రజల వాడుకలో బాగా బలపడిన, ఇక ఎవరూ పెకలించలేనంతగా పాతుకుపోయిన, ఇంగ్లీషు పదాలను మన తెలుగు డిక్షనరీలో చేర్చటం వల్ల మన భాష తప్పక బలపడుతుంది. వాడుక పదాల సంపద భాషకు జీవమిస్తుంది. అవి పరభాష పదాలు కూడా కావచ్చు. మనం తెలుగును సరిగా నేర్చుకోక ముందే మనకు ఇంగ్లీషు నేర్పారు. వందలాది ఏళ్ళు మనం ఇంగ్లీషును గత్యంతరం లేక హద్దు మీరి వాడినందు వల్ల, అది మన భాషా పదాలను కబళించి తానే తెలుగై మనలో కూర్చుంది. మన ఆత్మలను వశం చేసుకుంది. ఇక ఇప్పుడు ఈ ఇంగ్లీషు పదాలను నిర్మూలించడం మన తరం కాదు. వాటిని మన పదాలుగా అంగీకరించడమే మంచిది.

**ఏఏటికాయేడు మన నిఘంటువుకి పదసంపద సమకూర్చాలి. ఎన్ని ఎక్కువ తెలుగు నిఘంటువులు నెట్‌లో చేరితే తెలుగు అంతగా బలపడుతుంది.ఆధునిక అవసరాలకు ధీటుగా తెలుగు భాష తయారు కావాలి. ఇంగ్లీషులో ఉన్న సౌలభ్యాలన్నీ తెలుగుకూ కల్పించాలి.**

**6.అక్షర రూపాలు పెరగాలి -లిపిసమస్యలు తగ్గాలి**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ, పెద్దన, తిమ్మన, తెనాలిరామకృష్ణ, సూరన్న, రామరాజ, మల్లన్న, ధూర్జటి, రామభద్ర, గిడుగు, గురజాడ, సురవరం, యన్.టి.ఆర్., మండలి, నాట్స్, పొన్నాల, రవిప్రకాష్, లక్కిరెడ్డి అనే18 అక్షరరూపాలను విడుదలచేశారు. కానీ ఇప్పటికే అనూ, సూరి లాంటి యూనీ కోడేతర ఫాంట్లలో ముద్రితమై ఉన్న విస్తారమైన తెలుగు సాహిత్యాన్ని తెలుగు యూనీకోడు లోకి మార్చే మార్పిడి సాధనాలు కావాలి. తర్జుమాలో తప్పులు వస్తున్నాయి. అనువాద ఉపకరణాలు, నిఘంటువులు, లెక్కకు మిక్కిలిగా రావాలి. ఆన్‌లైన్‌లోనూ ఆఫ్‌లైన్‌లోనూ వాటిని విరివిగా లెక్సికన్లు వాడుకునే సౌలభ్యాలు కలగాలి. వాటిని తయారు చేసే సాంకేతిక నిపుణులకు నిధులు ఇవ్వాలి. ప్రతి యేటా తెలుగు వైతాళికుల పేరు మీద ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలి. ఎన్ని ఎక్కువ తెలుగు నిఘంటువులు నెట్‌లో చేరితే తెలుగు అంతగా బలపడుతుంది. **కాగితం, కలం రోజులు పోయాయి. ఆధునిక అవసరాలకు ధీటుగా తెలుగుభాష తయారు కావాలి. ఇంగ్లీషులో ఉన్న సౌలభ్యాలన్నీ తెలుగుకూ కల్పించాలి. పదాల శుద్ధి యంత్రం, గుణింత, వ్యాకరణ పరిష్కారయంత్రం, సాంకేతిక నిఘంటువులు, మాండలిక నిఘంటువులు, డిజిటల్ నిఘంటువులు, అమరకోశాలు, పదశోధనా యంత్రాలు, ఉచ్చారణ 'పద ప్రయోగ నిఘంటువులు, లిపిబోధినులు, సాహిత్య శోధనా పరికరాలు, పదానుక్రమణికలు- ఇలా ఎన్నో రావాల్సిన అవసరం ఉంది. కంప్యూటర్ చదువులుకూడా రావాలి. అలా చదివిన డిగ్రీ విద్యార్థులకు పోటీపరీక్షల్లో ప్రోత్సాహకాలు ప్రకటిస్తే తెలుగు చాలాకాలం బ్రతుకుతుంది. యంత్రానువాదాలకూ, లిప్యంతరీకరణకూ, విషయాలకు ఆకారాది సూచికలను తయారు చేయటానికీ, వెతకటానికి అనుకూలంగా తెలుగులో కంప్యూటర్ వాడకం పెరగాలి.**

**7. లిపి సంస్కరణ జరగాలి లేదా రోమన్ లిపిలో కార్యాలయ వ్యవహారాలు నడపాలి :**

"ముత్యాలలాంటి తెలుగక్షరాలంటూ లిపిమీద లేనిపోని సెంటిమెంట్లు పెట్టుకోవడం మాని రోమన్ లిపిలో(a,aa,i,ee ఈ విధంగా) తెలుగును నేర్పితే అప్పుడు మన దేశం ఆధునిక యుగం లోనికి ప్రవేశిస్తుందని తన నిశ్చితాభిప్రాయమని 1976 లోనే మొదటి ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా అన్నారు మహాకవి శ్రీశ్రీ. ( ప్రజాతంత్ర (18.4.1976) "అనంతం" పేజీ196).

వత్తులు, గుణింతాల ఇబ్బందిని అధిగమించలేకనే చాలామంది బాగా తెలుగు వచ్చిన వాళ్ళు కూడా తెలుగు టైపింగ్ జోలికి రాలేకపోతున్నారు. లిపి సంస్కరణ కూడా అవసరమే. వత్తులూ గుణింతాల బెడద లేకుండా ఒకే వరసలో సాగిపోయేలా రోమన్ లిపిని యంత్రానికి తగ్గరీతిలో ఆంగ్లేయులు ఎంతగానో అభివృద్ధి పరిచారు, అరబిక్ అంకెలను, భారతదేశపు సున్నాను అరువు తెచ్చుకొని మరీ ఆంగ్ల లిపిని విశ్వవ్యాప్తం చేశారు. ఆంగ్ల భాషనూ, అంకెల్ని మనం ఎలాగూ వాడుతూనే ఉన్నాం. ఇక అక్షరాలను కూడా వాడుకుంటే అధికార భాషగా రోమన్ తెలుగును పిల్లలకు నేర్పటం, ఫైళ్ళలో ద్వారా అమలు చేయటం ఎంతో సుళువవుతుంది. లిపిసమస్య సాకుతో అధికారభాష అమలును ప్రక్కన పెట్టటం కంటే అంతర్జాతీయంగా అమలవుతున్న లిపినే మన భాషకు వాడుకుంటే మేలు జరుగుతుంది. చరిత్రలో తెలుగు లిపి ఎన్నో సార్లు మారింది. దేశమంతటికీ ఉమ్మడి లిపిగా ఆంగ్లాక్షరాలను ఉపయోగించుకోవాలి. ప్రపంచం మొత్తం చదవగలిగే స్థాయికి ఎదిగిన ఆంగ్ల లిపిని వాడుకోవటం ద్వారా మన దేశ భాషలన్నింటికీ జవసత్వాలు సమకూరుతాయి.పైగా అన్నిభాషల వాళ్ళూ సెల్ ఫోనుల్లో ఆంగ్ల లిపి ద్వారానే మెసేజీలు ఇప్పటికే పంపుకుంటున్నారు. ప్రపంచ దేశాలలో ఆంగ్ల లిపిలోని సంస్కృత శ్లోకాలను చదువు కుంటున్నారు. దేశ వాసులందరినీ రోమన్ లిపి ద్వారా త్వరగా అక్షరాస్యుల్ని చేయవచ్చు.దేశ మంతటా ఒకే లిపి ఉండటం వలన అందరూ అన్ని భాషలనూ అర్థం చేసుకోలేకపోయినా కనీసం అన్ని భాషలనూ చదవగలుగుతారు, కార్యాలయాలనుండి వచ్చే ఉత్తర్వులను చదవటం చదివించుకొనటం సులువౌతుంది. లిపి ద్వారా ఐక్యత వస్తుంది. అందువలన తెలుగులో పాలన వ్యవహారాలు సులువుగా జరగాలంటే వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ఆనాడు కోరినట్లు లిపి సంస్కరణన్నా జరగాలి లేదా శ్రీ శ్రీ గారి సలహా మేరకు రోమన్ లిపిలో అయినా కార్యాలయ వ్యవహారాలు నడపాలి.

**8. తెలుగు మాధ్యమంలో చదువులు పెరగాలి :**

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో కూడా అన్ని స్థాయిల్లో పదో తరగతి వరకు తెలుగు మీడియం ఉండాలి. రాజ్యాంగంతో సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలను వాడుక భాషలోకి తేవాలి. ఎనిమిదో షెడ్యూల్‌లో పేర్కొన్న భాషలన్నిటినీ అప్పటికప్పుడు తర్జుమాచేసే విధంగా పార్లమెంటులో ఏర్పాటుచేయాలి. న్యాయస్థానంలో తీర్పులు అధికార భాషలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అధికార భాషను అమలు చెయ్యని అధికారులపై చర్యలు తీసుకునే అధికారం అధికార భాషా సంఘానికి ఇవ్వాలి. తెలుగు భాషా రక్షణ అభివృద్ధికి మంత్రిత్వ శాఖ కూడా ఏర్పాటు చేశారు. సాహిత్య అకాడమీలు కూడా రాబోతున్నాయి. తెలుగులో ఉత్తరప్రత్యుత్తరాలు రాయగల ఐ.ఎ.యస్., ఐ.పి.యస్. అధికారుల్ని మాత్రమే ప్రజలతో సంబంధమున్న కీలక స్థానాల్లో నియమించాలి. తెలుగు విశ్వవిద్యాలయం, అధికార భాషాసంఘం, తెలుగు అకాడమీ, అన్ని విశ్వవిద్యాలయాల్లోని తెలుగు విభాగాలు కలసికట్టుగా కృషిచేసి ఏయేటికాయేడు అవి తెలుగు భాషాభివృద్ధి కోసం ఏంచేశాయో, ఏం సాధించాయో ప్రగతి నివేదికలను బయటపెట్టాలి. ఈ సంస్థలన్నీ ప్రజలనుండి సూచనలు తీసుకోవాలి. **పరిపాలక గ్రంథాలు అంటే కోడ్లు, మాన్యువల్‌లు లాంటివన్నీ తెలుగులో ప్రచురించి అన్నికార్యాలయాలకు పంపాలి. సర్వీస్‌కమిషన్ పోటీపరీక్షలు, శాఖాపరమైన పరీక్షలు తెలుగులో నిర్వహించాలి. కూడిక, తీసివేత లాంటి తెలుగు పదాలకు బదులు సంకలనం, వ్యవకలనం లాంటి సంస్కృత పదాలను వాడి తెలుగు మీడియం అంటే పిల్లలు భయపడేలా చేశారు. పిల్లల పుస్తకాలు వాడుక తెలుగుతో చెయ్యాలి. కేవలం తెలుగు మీడియంలో మాత్రమే చదివిన వారికి ఇంగ్లీషు రాకపోయినా ఎటువంటి శాస్త్ర సాంకేతిక రంగంలో నయినా ఉద్యోగం వస్తుందనే వాతావరణం కల్పించాలి.**

**9. ఉద్యోగాలు , ప్రోత్సాహకాలిచ్చి భాషను కాపాడాలి**

*ఎవరి భాషను వాళ్ళు కాపాడుకోవాలి- అధికారభాషగా అభివృద్ధి చేసుకోవాలి (రాజ్యాంగం 345 ఆర్టికల్).*

కోయంబత్తూరులో జరిగిన ప్రపంచ తమిళ మహాసభల్లో తమిళ మాధ్యమ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు సులభంగా లభించేలా కొన్ని తీర్మానాలు చేశారు. తమిళ మీడియం అభ్యర్థులకు ఉద్యోగాలు దొరకకపోతే ప్రజలు పిల్లల్ని తమిళ మాధ్యమంలో చదివించరనీ, ఎవరూ చదవని భాష నశిస్తుందనీ, తమిళం పదికాలాలపాటు బ్రతకాలంటే ఆభాషలో మాత్రమే చదివిన వారికి వెనుకబడిన కులాల వారికి ఇస్తున్నట్లుగా ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానం చేశారు. అందుకోసం అత్యవసరంగా ఒక ఆర్డినెన్స్ తెచ్చారు. శాసన సభలో, స్థానిక సంస్థల్లో, ప్రభుత్వ కార్పోరేషన్లు, కంపెనీలలో తమిళ అభ్యర్థులకు 20 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని శాసించారు.

తమిళనాడు ప్రభుత్వం జీవో ఎం ఎస్ నంబర్ 145 P & AR (S) డిపార్ట్ మెంట్ తేదీ. 30.09.2010 ద్వారా తమిళ మీడియం లో డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 20 శాతం రిజర్వేషన్ ఇస్తున్నారు. చెన్నై హైకోర్టు కూడా 23.2.2016 న ఈ చట్టాన్ని సమర్ధించింది.ప్రమోషన్లలో కాకుండా ప్రభుత్వో ద్యోగాలకు మొదటిసారిగా నేరుగా జరిపే నియామకాలకు తమిళ మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు 20% ఉద్యోగాలు రిజర్వు చేయడంలో ఎలాంటి తప్పూ లేదని తేల్చేసింది.రాజ్యాంగంలోని 345 ఆర్టికల్ ప్రకారం ఎవరి భాషను వాళ్ళు కాపాడుకోవాలని,ఆయా రాష్ట్రాలలో పాలనాభాషగా అధికారభాషగా అభివృద్ధి చేసుకోవాలని కూడా తెలియ జేసింది. కాబట్టి తమిళనాడును ఆదర్శంగా తీసుకొని ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ప్రోత్సాహకాలు ఇవ్వాలి.తమిళనాడులో లాగా ఉద్యోగాలలో 20% రిజర్వేషన్ ఇవ్వాలి. గ్రూప్ 1, గ్రూప్ 2,3 లాంటి సర్వీసు ఉద్యోగాలలో తెలుగు మీడియంలో చదివిన వారికి గతంలో ఇచ్చిన మాదిరే 5% ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలి. పబ్లిక్ సర్వీస్ కమీషన్లు తెలుగు మాధ్యమ అభ్యర్థులను ఆదరించాలి.

తెలుగు మీడియం అభ్యర్థులకు 10 శాతం ఉద్యోగాలు కోటా ఇస్తామని అప్పటి సాంస్కృతిక శాఖ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గారు ప్రకటించారు. ఇంటర్ వరకు కూడా తెలుగు మీడియాన్ని తప్పనిసరి చేస్తామన్నారు.(ఆంధ్రజ్యోతి 9.12.2016).ఈ ప్రకటనలు జీవో లుగా రావాలి. ఉద్యోగ నియామకాలు పూర్తయ్యే లోపు ఈ ప్రతిపాదనలను పబ్లిక్ సర్వీసు కమిషన్లు ప్రభుత్వానికి పంపి ఆమోదం పొందాలి. అంధ్రప్రదేశ్,తెలంగాణా రాష్ట్రాల సర్వీస్ కమిషన్లు రెండూ భారీ ఎత్తున గ్రూప్-2,3 సర్వీసు ఉద్యోగాల భర్తీ చేస్తున్నాయి. వీటిలో మున్సిపల్ కమిషనర్, ఏసీటీఓ, సబ్ రిజిస్ట్రార్, డిప్యూటీ తహసిల్దార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సీనియర్ ఆడిటర్, సీనియర్ అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సెక్రెటరీ లాంటి ఉద్యోగాలున్నాయి. ఇవన్నీ తెలుగులో చేసే ఉద్యోగాలే . ఐ ఏ ఎస్, ఐ పి ఎస్ లాంటి ఉన్నతో ద్యోగాలు కావు. తెలుగు ప్రజలతో మమేకమై వారితో ముఖాముఖి తెలుగులో మాట్లాడుతూ వారిమధ్యే నివసిస్తూ వారికి సేవలందించే ఉద్యోగాలు. తెలుగు ప్రజల సమస్యలను సరిగ్గా విశ్లేషణ చేయాలి. గ్రామ సామాజిక, ఆర్థిక వ్యవస్థపై తగిన అవగాహన తెచ్చుకోవాలి. ప్రజా పరిపాలన పరిజ్ఞానం పెంచుకోవాలి. అక్కడి ప్రజలు వారి భాషలో చెప్పే సమస్యలు, పరిష్కారాలు, సూచనలు వినాలి, రాయ గలగాలి. ఈ నైపుణ్యాలన్నీ ప్రజల భాష లో తెలుగు మాధ్యమంలో చదివిన వారికే ఎక్కువగా ఉంటాయి. గ్రూప్ 1, గ్రూప్ 2 సర్వీసు ఉద్యోగాలలో డిగ్రీ తెలుగు మీడియంలో చదివిన వారికి గతంలో ఇచ్చిన మాదిరే 5 శాతం ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలి. తమిళనాడు తరహాలో తెలుగు మాధ్యమ అభ్యర్థులకు 20 శాతం ఉద్యోగాలు కూడా రిజర్వేషన్ ఇస్తే, అప్పుడు తెలుగులో కార్యాలయ వ్యవహారాలు నడిపే వాళ్ళు రంగప్రవేశం చేస్తారు. కొంతవరకైనా ఆఫీసుల్లో తెలుగు బ్రతుకుతుంది. తెలుగు మీడియంలో చదివితే ఉద్యోగా లొస్తాయన్న ఆశతో కొంత మందైనా తెలుగులో చదువుతారు. తెలుగులో చదివిన అధికారులు కార్యాలయాల్లో జరిగే పనులన్నిటికీ "కొత్తపదాలు" పుట్టిస్తారు. తెలుగు పదకోశాలు అమలవుతాయి. పరిపాలనకు పనికొచ్చే శాస్త్రీయ పాలనా తెలుగు తయారవుతుంది. **అధికారభాషగా తెలుగు అమలు కావాలంటే తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థుల్ని ప్రోత్సహించి అధికారులుగా చేయకతప్పదు.**

**10. తెలుగు అమలుకై అధికారభాషా సంఘం, తెలుగు అకాడమీలు, తెలుగు విశ్వవిద్యాలయాలకు అదనపు బాధ్యతలు అధికారాలు ఇవ్వాలి.**

వ్యాపార సంస్థలు, దుకాణాలన్నీ తెలుగులో బోర్డులు ఏర్పాటు చేయకపోతే వాటి లైసెన్సులు రద్దు చేసే అధికారం కన్నడ అధికార భాషా సంఘానికి ఉన్నట్లుగా, తెలుగు అధికార భాషా సంఘానికి కూడా ఉండాలి. మండల స్థాయి నుండి సచివాలయం వరకు అధికార భాషను అమలు చెయ్యని అధికారులపై చర్యలు తీసుకునే అధికారం అధికార భాషా సంఘానికి ఇవ్వాలి. తెలుగు విశ్వవిద్యాలయం, అధికార భాషా సంఘం, తెలుగు అకాడమీ, అన్ని విశ్వవిద్యాల యాల్లోని తెలుగు విభాగాలు కలసికట్టుగా కృషిచేసి ఏయేటికాయేడు అవి తెలుగు భాషాభివృద్ధి కోసం ఏంచేశాయో, ఏం సాధించాయో ప్రగతి నివేదికలను తెలుగు ప్రజలకు బయటపెట్టాలి. ఈ సంస్థలన్నీ ప్రజల నుండి సూచనలు తీసుకోవాలి. పరిపాలక గ్రంథాలు కోడ్లు, మాన్యువల్‌లు లాంటివన్నీ తెలుగులో ప్రచురించి అన్ని కార్యాల యాలకు పంపాలి. సర్వీస్‌కమిషన్ పోటీ పరీక్షలు, శాఖాపరమైన పరీక్షలు తెలుగులో నిర్వహించాలి.

**11. మంత్రిత్వ శాఖ, సచివాలయం, శాసనసభలు, న్యాయస్థానాలు అన్నీ కలసికట్టుగా కృషి చెయ్యాలి**

హైకోర్టులో తెలుగులో వాదనలకు అనుమతించాలి. తెలుగును రెండవ జాతీయ భాషగా ప్రకటించాలి. మన ప్రజల భాషలోనే జీవోలు రావాలి. అప్పుడే తెలుగు అధికార భాషగా విరాజిల్లుతుంది. తెలుగు భాష మాట్లాడేవాళ్ళ సంఖ్యనుబట్టి, జనబలాన్ని బట్టి పార్లమెంటులో మన గౌరవం మనకు దక్కుతుంది. హిందీతో పాటు తెలుగును కూడా ఇతర భాషలవాళ్ళు నేర్చుకోవాల్సి వస్తుంది. పార్లమెంటులో హిందీ వాళ్ళలాగా మనం కూడా తెలుగులో మాట్లాడవచ్చు. కేంద్ర ప్రభుత్వం జారీచేసే ఉత్తర్వులన్నీ తెలుగులో పొందవచ్చు. కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులో నడుపవచ్చు. చట్టాలన్నీ తెలుగులోకి మార్చబడతాయి. తెలుగులో తీర్పులొస్తాయి. తెలుగులో ఇచ్చే అర్జీలు ఢిల్లీలో కూడా చెల్లుతాయి. ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలుగువారికి కొండంత అండ, గౌరవం - హిందీ వాళ్ళతో పాటు సమానంగా లభిస్తాయి. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వే స్టేషన్లలో బోర్డుల మీద తెలుగులో కూడా పేర్లు రాస్తారు. ఈ రోజున హిందీ భాష వల్ల హిందీ వాళ్ళకు ఏయే ప్రయోజనాలు ఒనగూడాయో - అవన్నీ తెలుగువాళ్ళు కూడా పొందవచ్చు.

*(రచయిత:స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, అమరావతి నగరం,మందడం)*

# న్యాయస్థానాల్లో తెలుగుకు చోటు ఎప్పుడు?

**15 ఏళ్ళలో ఇంగ్లీషుకు స్వస్తి పలకాలని రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించినా, నేటికీ ఇంగ్లీషే అన్ని రంగాల్లో రాజ్యమేలుతున్నది. జిల్లాస్థాయి వరకూ అన్ని వ్యవహారాలూ అధికార భాషలైన తెలుగు, ఉర్దూలలోనే జరగాలని జి.వొ.నెం.485/29-3-1974 ఆదేశించినా, నేటికీ ఇది ఆచరణలోకి రాలేదు. ఈ అంశంపై పదేళ్ళ క్రిందట శ్రీ ఎ.బి.కె. ప్రసాద్ అధ్యక్షతన అధికారభాషాసంఘం ఎంతో కృషిచేసింది. కాని, సాధికారతలేని ఆ సంఘం చేసినదంతా బూడిదలో పోసిన పన్నీరు అయింది. అందుకు సంబంధించిన రెండు వ్యాసాలను, ఒక గల్పికను ఇక్కడ మీకోసం ఇస్తున్నాము. -సంపాదకుడు.**

---

## గౌరవన్యాయమూర్తులకు వినతి!

**-ఎ.బి.కె.ప్రసాద్**

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం వచ్చి ఇప్పటికి నలభై రెండేళ్ళు గడిచిపోయాయి. అయినా, రాష్ట్ర ప్రజల భాష అయిన తెలుగు భాషను పాలనాభాషగా పూర్తి స్థాయిలో అమలు జరపడంలో విఫలమవుతూ వచ్చాం. ఈ విషయంలో, చట్టాన్ని అమలు జరపక పోవడాన్నీ లేదా అమలు జరపడానికి నిరాకరించడాన్నీ సర్వ సాధారణంగా "చట్ట ధిక్కారం"గానూ, నేరంగానూ ప్రభుత్వాలూ, న్యాయస్థానాలూ పరిగణించాలి. కాని ఈ రెండు వ్యవస్థలకూ కడచిన యాభై ఏళ్ళుగానూ ఈ విషయం పట్టలేదని చెప్పటానికి చింతిస్తున్నాను.

మాతృభాషలో పాలనను, మాతృభాషలో విద్యనూ, కోర్టులలో మాతృభాషలో న్యాయాన్నీ ఆశించి, పొందే హక్కు ఈదేశ పౌరులకు ఉంది; అది పూర్తిగా రాజ్యాంగ విహితం కూడా. ఈ మూడు వ్యవస్థ ల్లోనూ మాతృభాషలోనే ప్రజలకు పాలన, విద్య, న్యాయం అందాలని గాంధీజీ ప్రబోధించాడు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో మాతృభాషల ప్రాధాన్యం ప్రజల ఆందోళనకు ఒక ముఖ్యాంశంగా ఉంది; ఆ పునాది పైనే భాషా రాష్ట్రోద్యమాలు తలెత్తాయి. ఈ ఉద్యమ వ్యాప్తిలో అగ్ర భాగాన నిలిచిన వాళ్ళు తెలుగువాళ్ళే. అయినా, పాలనా వ్యవస్థ, న్యాయస్థానాలూ అయిదు దశాబ్దాలకు పైగా "నిమ్మకు నీరెత్తిన"ట్లు కూర్చున్నాయి. **ప్రజల డబ్బుతో జీతాలు పొందుతూ, ప్రజల భాషలో వ్యవహారాలు నడపకుండా** కాలక్షేపం చేస్తూ రోజులు దొర్లించు కుంటూ పోతున్నారే కాని ప్రజల గుండె గొంతుకలో కొట్టాడుతున్న చిరకాల వేదనను, ఆవేదనను వారు అర్థం చేసుకోలేక పోతున్నారు, ఈ రోజుకీ! పైగా, కిందిస్థాయి (జిల్లాస్థాయి)లో ఉన్న న్యాయస్థానాలు స్థానిక భాషలోనే - ప్రజల మాతృభాషలోనే వాద ప్రతివాదాలూ, తీర్పులూ నడపాలని **1974లోనే ప్రభుత్వం జి.వో.ఎం.ఎస్. నెం. 485 (హోం శాఖ, 1974 మార్చి 29)** ఆదేశించి, నిర్దేశిస్తున్నప్పటికీ గత 34 సంవత్సరాలుగానూ ఆ ఉత్తర్వు అమలులోకి రాలేదు. అంటే, పాలనాభాషగానూ, న్యాయస్థాన నిర్వహణా భాషగానూ కూడా పూర్తిస్థాయిలో తెలుగును అమలు జరపకుండా తాత్సారం జరుగు తోందని స్పష్టపడిపోయింది. ఇక ఈ చండితనానికి, అలసత్వానికీ స్వస్తి చెప్పవలసిన ఘడియలొచ్చాయని న్యాయవ్యవస్థ కూడా గ్రహించ వలసి ఉంది. ఈ సాచివేతకు కారణంగా వినిపిస్తున్న సాకులలో ఒకటి - "తెలుగులో తీర్పులు లేవు కదా, అవి ఉంటే తీర్పులు రాయడానికి ఉదాహరణలుగా మాకు తోడ్పడతాయ"ని కొందరు న్యాయమూర్తి మిత్రుల ఫిర్యాదు. జిల్లా న్యాయస్థానాల్లో వ్యవహరించే న్యాయమూర్తి మిత్రులూ, న్యాయవాదులూ తెలుగువారే అయినప్పుడు, వారు వాద ప్రతివాదాలు నిర్వహించి, సాక్ష్యం నమోదు, తీర్పులూ తెలుగులో యివ్వడం ద్వారానే తమకు తాముగానే 'ఉదాహరణ'గా చరిత్రలో నిలబడిపోతారు కదా! పైన ఉదాహరించిన జి.వో. (485) వెలువడడానికి ముందే కనీసం మూడు సందర్భాల్లో ఒకే నెలలో మూడుసార్లు ఆంధ్రప్రదేశ్ గౌరవ ఉన్నత న్యాయస్థానం రిజిస్ట్రారు మూడు అర్ధాధికార లేఖలను కింది స్థాయి కోర్టులకు జారీ చేశారని మరవరాదు. (1.3.1974, 20.3.1974, 22.3.1974) అన్ని జిల్లా కేంద్రాలు ఈ అర్ధాధికార లేఖలను అందుకున్నాయి. అయినా, 'ఎక్కడ వేసిన గొంగళి' అక్కడనే ఉండిపోయింది.

"కచ్చేరీల" వ్యవస్థలో సామాన్య ప్రజలకోసం దేశభాషలలో వాద ప్రతివాదాలు, తీర్పులూ ఎందుకు అవసరమో తెలంగాణాలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభలో మహాసభ మొదటి అధ్యక్షునిగా సుప్రసిద్ధ న్యాయవాదీ, ప్రసిద్ధ గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడూ, పండిత సంపాదకుడూ, ప్రముఖ సాహితీవేత్త అయిన సురవరం ప్రతాపరెడ్డి చాల సూటిగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రథమాంధ్ర మహాసభ (1930) న్యాయస్థానాలలో ఉపయోగించవలసిన భాష గురించి చేసిన '17వ తీర్మానా'న్ని 1931లో ఉదాహరించారు. ఆ తీర్మానంలో యిలా ఉంది :"గ్రామస్తులకు అనుకూలముగా నుండుటకై మున్సిఫ్ అదాలతులలోనూ, సబ్-రిజిస్ట్రారు కచ్చేరీలలోనూ **వ్యవహార మంతయూ ఇంగ్లీషు ఇలాకాలో వలె జనుల దేశభాష యందే జరుపుట అత్యవసరమని** ఈ మహాసభవారు ప్రభుత్వము వారికి సూచించుచున్నారు".

అంటే, ఇక్కడ ఆ తీర్మానం రెండు విషయాల్ని తేటతెల్లం చేసింది: 1. ఇంగ్లీషు వాళ్ళు తమ భాషలోనే వ్యవహారాలు నడుపుకుంటారనీ, మనదేశంలో కూడా న్యాయస్థానాల్లో మాతృభాషలను వారు అనుమతించారనీ, 2. కాబట్టి అదేవిధంగా తెలుగువాళ్ళు కూడా తమ మాతృభాషలోనే న్యాయస్థానాల్లో లావాదేవీలు నడుపుకోవాలనీ.

ఈ విషయాన్ని సురవరం ప్రతాపరెడ్డి మరింతగా వివరిస్తూ **న్యాయస్థానాలున్నది కలవాళ్ళకోసమే కాదు, వాళ్లకన్నా వీటి అవసరం పేద ప్రజలకే ఎక్కువ ఉందని** చెప్పారు. ఆయన మాటల్లోనే విందాం:

"న్యాయస్థానముల వ్యవస్థతో అమీరులకెంత సంబంధము గలదో నంతకంటే ఎక్కువ సంబంధము బీదలకును, గొంగళ్ళను కప్పుకొను తెగల వారికినీ కలదు. ధనవంతులకంటె ఎక్కువగా బీదసాదల హక్కులు సంరక్షింపబడుట అత్యవసరము. మన న్యాయస్థానముల ప్రస్తుత వ్యవస్థయందు అనేక లోపములుండుటబట్టి ఈ విషయమున ఫలవంతముగా లేదు. **జనులకు న్యాయము ప్రసాదించుటలో లోపభూయిష్టమైన వ్యవస్థ** తన పర్యవసానమును కలిగించుచున్నది... దురదృష్టవశమున న్యాయశాఖలో పనిచేయుచున్న అధికారులు దేశభాషలందు ప్రవేశము కలవారు కారు. **సాక్షులకు, నిందితులకు అదాలతు (కోర్టు) భాష తెలియదు.** వీరిరువురి మధ్య అనగా, అధికార వర్గము, సాక్షులు, నిందితుల పరస్పర భావములను వెల్లడించుటకు

భాషాంతరీకరణము (తర్జుమా/అనువాదం) చేయువారు కావలసి వచ్చుచున్నది. **ఈ పద్ధతి నిర్మూలింపబడుట అత్యావశ్యకము.** నిందితుల వాజ్మూలములు వారి మాతృభాషయందే గ్రంథస్థ మొనరింపబడుటయే ముఖ్యమైన పని. ఇలా చేయవలెనని నియమ మున్నప్పటికిని.. నూటి కొక నిందితుని వాజ్మూలమైనను మాతృ భాషలో రికార్డు చేయబడు చున్నదాయను సందేహము కలుగును. తర్జుమా చేయువారు కూడ అంత విశ్వాసపాత్రులును, ఉభయభాషా ప్రవీణులుగను లేకుండుటచే వారు చెప్పేదానిపైన సంపూర్ణ విశ్వాసముంచుటకు వీలులేదు. కనుక వీరిపై ఆధారపడి యుండు తీర్పులు న్యాయపథమున నుండక పోవుటకూడ కొన్ని సమయము లందు సంభవించును. మనము నిజమైన న్యాయమును బడయుట లేదు. ఇందుకు ముఖ్యమైన కారణము – గొప్ప అధికారములు గల మన మున్సిఫ్ మేజిస్ట్రేటుల వద్ద వాజ్మూలముల నిచ్చు సాక్షులలోను, కక్షిదారులలోను ఎక్కువ భాగము అదాలతీ భాష తెలిసినవారు కాదు. న్యాయస్థానమునకు దేశభాషల పరిచయము లేదు. **న్యాయశాఖా వ్యవస్థయందు విస్పష్టముగా కానవచ్చుచున్న ఈ కళంకమును తొలగించుటకు** కృషి సలుపవలెను" (1931 ఫిబ్రవరి 21, "గోలకొండ" సంపాదకీయం)

ఇక్కడ మరో సంగతిని మనం ప్రస్తావించుకోక తప్పదు. "తెలుగులో తీర్పులు లేవ"ని ఫిర్యాదు చేసే మిత్రులే చట్టాలు ఇంగ్లీషు లో ఉన్నప్పుడు, తీర్పులు తెలుగులో చెప్పడం ఎలా సాధ్యపడుతుందన్న వాదన కూడా తెస్తుంటారు. కాని న్యాయశాస్త్రంలో ప్రసిద్ధులయిన కొందరు ఇప్పటికే, గత ఇరవయ్యేళ్లకు పైగానే అనేక చట్టాలను సులభమైన తెలుగులోకి తీసుకొచ్చారు. ఆంగ్లంలోని శాస్త్ర సాంకేతిక పదాలను అలవోకగా ఇముడ్చుకొని తనలో వొదిగించుకోగల శక్తియుక్తులున్న తెలుగుభాష, అన్య భాషలతో సునాయాసంగా చాకిరీ చేయించుకొని లబ్ధి పొందగల తెలుగుభాష, న్యాయశాస్త్ర పదజాలాన్ని కూడా లొంగదీసుకోగలదని పలువురు న్యాయశాస్త్ర రచయితలు రుజువు చేశారు. అలాంటి వారు న్యాయస్థానాలలో పదవులలో ఉండి యిచ్చిన కమ్మని తెలుగు తీర్పుల సమాహారమే ఈ గ్రంథ కూర్పు కూడా! ఏ ఇంగ్లీషు మోజులో పడిపోయి తెలుగులో మాట్లా డటం, తెలుగులో రాయటం మరచిపోయారో, అలాంటి వారంతా మూడువందల సంవత్సరాలపాటు ఏ గ్రీకు, లాటిన్, ఫ్రెంచి భాషల పెత్తనం నుంచీ, దాష్టీకం నుంచీ బయటపడడం కోసం, తమ ఇంగ్లీషును మాతృభాషగా వినియోగించుకుని ప్రయోజనం పొందడం కోసం ఇంగ్లాండ్ ప్రజలు అనేక పోరాటాలు, తిరుగుబాట్లు సాగించ వలసి వచ్చిందని మరచి పోరాదు! ఆ లాటిన్, గ్రీకు, ఫ్రెంచి చట్టాలనే తమ మాతృభాష అయిన ఇంగ్లీషులోకి అనువదించు కుంటూనే తమ నుడికారాన్ని వదులుకోకుండానే ఇంగ్లాండ్ ప్రజలు లబ్ధి పొందగాలేనిది –ఇండియాలోని మాతృభాషలు, రాష్ట్రాలలోని న్యాయస్థానాలూ ఎందుకు లబ్ధి పొందలేవు? అయిదు హిందీ రాష్ట్రాలలోని హైకోర్టులకు కేంద్రప్రభుత్వం హిందీ భాషలోనే వాద ప్రతివాదాలూ, తీర్పులూ చెప్పుకోడానికి అనుమతి యివ్వగా లేనిది– మిగతా రాష్ట్రాల ప్రజలకు ఆ అవకాశం, సహజమైన హక్కును ఎందుకు గుర్తించరు? పైగా, కేంద్రం ఆ అవకాశం హిందీ రాష్ట్రాల లోని ఉన్నత న్యాయస్థానాలకు కల్పిస్తూనే హిందీ తీర్పులకు ఇంగ్లీషు అనువాదాలను మాత్రం జోడించాలని చెప్పినప్పుడు, అదే వెసులు బాటును రాజ్యాంగ పరిధిలోనే ఇతర భాషా రాష్ట్రాలకు ఎందుకు కల్పించరు? ఎందుకు అనుమతించరు? ఇంగ్లాండ్‌కు ఆచరణ సాధ్యమైన ప్రయోగం, ఇంగ్లాండ్‌కు వలసగా ఉండి స్వాతంత్ర్యం పొందినా, స్వభాషా వికాసానికి చేటు మూడుతున్నా జాగ్రత్త పడాలన్న తాపత్రయం, తపన –మనవాళ్ళకి ఇప్పటికీ లేకపోవడం విచారకరం కాదా?

పారుదలలో లేని నీరు పాడై పోతుందని, వాడకంలో లేని భాష వాడిపోతుందని, "ప్రపంచీకరణ" నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ "యునెస్కో" మాతృభాషలకు రానున్న ప్రమాదాన్ని గురించి ప్రస్తావిస్తూ హెచ్చరించింది. అందులోనూ, రెండు రకాల భాషలకు వీలుకల్పించే చట్టాలూ, న్యాయశాస్త్ర పరిభాష అలవాటు లో ఉన్న సమాజాలలో పదాలతోపాటు భాష్యాలూ వంకర్లు పోతుం టాయి! ఒకే చట్టానికి భాష్యం చెప్పేటప్పుడు ఇద్దరు లాయర్లు అటూ, ఇటూ చెరొక వైపూ ద్వారపాలకుల మాదిరిగా నిలుస్తుండడం ఒక వింత దృశ్యం కూడా! ఈ ద్వైధీ భావాన్ని ప్రసిద్ధ రచయిత కాఫ్కా "ది ట్రయల్" అన్న రచనలో ఒక పిటీషనరుకు కోర్టుకు సమర్పించడం కోసం అతని న్యాయవాది రాసిచ్చిన పిటీషను గురించి వివరిస్తాడు. తన లాయర్ గురించి ఆ పిటీషనరు చెప్పిన మాటలు : "నా న్యాయవాది చాల మేధావి. కాని, పిటీషను ఫలితం గురించి మాత్రం తబిశీళ్ళు చెప్పడు గాక చెప్పడు. నాకు తెలియని లాటిన్ భాషలో నా పిటిషన్‌ను గుప్పించేశాడు. పేజీలన్నింటినీ కోర్టులో దాఖలు చేయాల్సిన జనరల్ అప్పీళ్ళతో నింపేశాడు; ఆ తర్వాత తనకు ఇష్టులయిన అధికారులను పొగడ్తలతో నింపాడు; చివరికి న్యాయ వాదిగా తనను తానే పొగుడుకుంటూ పోయాడు; ఇలా సాగిస్తూ సాగిస్తూ అతి నమ్రతతో వొంగి వొంగి కోర్డువారిని ఉద్దేశించి మాట్లా డుతూ అప్రస్తుత ప్రస్తావనగా తన క్లయింటును పోలిన క్లయింటుకు వర్తించే పురాతన కాలపు పుట్టెడు కేసుల్ని ఏకరువు పెడుతూ తన వాదన ముగించేశాడు." ఈ విషయాన్ని కాఫ్కా ఎందుకు చెప్పాడంటే పదాల క్లుప్తీకరణ స్థానంలో 'సాగులాగుడు' వాదనల మూలంగా అసలు విషయం కాస్తా మరుగున పడిపోతుందని, భావ వ్యక్తీకరణను మాతృభాష సులభతరం చేస్తుందని చెప్పడం కోసమే! బహుశా ఈ అదుపు కోసమే "గలివర్స్ ట్రావెల్స్" రచనలో ప్రసిద్ధ ఆంగ్ల రచయిత జొనాథన్ స్విఫ్ట్ ఒక వింత ప్రతిపాదనను వ్యంగ్యంగా చేసి ఉంటాడు : "no law of the country may exceed in words the number of letters in their alphabet which is twenty-two" (ఏ చట్టమూ అక్షరమాలలోని 22 అక్షరాలకు మించిన పదాలతో ఉండరాదు)! ఏది ఏమయినా ఇంగ్లాండ్‌లో ప్రసిద్ధ న్యాయమూర్తులలో ఒకరైన జస్టిస్ స్క్రుటన్ అన్నట్టు సామాన్య ప్రజలు వాడే భాషను లాయర్లు వాడకుండా ఎల్లకాలం తప్పించుకుని తిరగలేరు!! ఒక సామాన్యుడి పరిజ్ఞానం ఎంత గొప్పదో జస్టిన్ విన్ (ఇంగ్లండ్) పెద్ద చదువు సంధ్యలు లేని నేరస్థుని తాలూకు కేసు అప్పీలు కోర్టు ముందుకి పరిష్కారం కోసం వచ్చినప్పుడు ఆ క్రిమినల్‌కు (అతని పేరు 'కాక్స్') న్యాయశాస్త్ర విషయాలు ఎంత బాగా తెలుసో ఒక ఉదాహరణ యిచ్చాడు : "నేను ఫ్రాన్స్‌లో తలపెట్టిన నేరాలకు ఇంగ్లాండ్‌లో నన్ను శిక్షించడం చట్ట విరుద్ధం" అని కాక్స్ చాటినప్పుడు– జస్టిస్ విన్ యిలా వ్యాఖ్యానించాడు : "అతనికి 'లా' ఎంత తెలుసో మనకు తెలియదుగాని, ఈ కేసులో మాత్రం దురదృష్టవశాత్తూ కాక్స్ మొత్తం వాదనంతా సబబైనదే!" అదీ సామాన్యుడి శక్తి. అందుకే సామాన్యుడి భాషలో, మాతృభాషలోనే న్యాయస్థానాల వ్యవహారాలు నడిపినప్పుడు అందరికీ సుఖం అని చెప్పేది!

జిల్లా స్థాయి న్యాయమూర్తులూ, న్యాయవాదులూ సదా ఈ అంశాన్ని గుర్తించగలరనీ, తెలుగులో వేసిన ఈ తీర్పుల పుస్తకాన్ని ఉపయోగించుకోగలరని, భాషాసంఘం ఈ కృషికి చేదోడు వాదోడు కాగల నెట్‌లో (apolc.net) ఉంచిన న్యాయ, పాలనా భాషా నిఘంటువును కూడా సద్వినియోగం చేసుకోగలరనీ ఆశిస్తున్నాను.

హైదరాబాద్,
16 జనవరి 2009.

ఎ.బి.కె.ప్రసాద్
ఆధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం

- పెండ్యాల సత్యనారాయణ
98664 42034

# జిల్లా న్యాయస్థానాల్లో మాతృభాష: రాష్ట్రప్రభుత్వం బాధ్యత

దిగువస్థాయి న్యాయస్థానాలలో సివిల్, క్రిమినల్ న్యాయప్రక్రియ ఏ భాషలో ఉండాలో ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించాలి. ఉత్తర భారతంతో సహా పలు రాష్ట్రప్రభుత్వాలు సకాలంలోనే స్పందించాయి. తమ రాష్ట్రాలలోని మాతృభాషలలోనే న్యాయప్రక్రియ ఉండేవిధంగా పైన ఉదాహరించిన రెండు చట్టాలనూ సవరించుకున్నాయి. **మన రాష్ట్రం మాత్రం ఈ విషయంలో ఇంకా నిద్రావస్థలోనే ఉన్నది.**

ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా కోర్టులలోను, మెజిస్ట్రేట్ కోర్టులలోను న్యాయప్రక్రియ అంతా ఆంగ్ల భాషలోనే జరుగుతున్నది. దావాలు దాఖలు చేయటం, సమాధాన పత్రాలు దాఖలు చేయటం, పిటీషన్లు, కౌంటర్లు, అఫిడవిట్లు, వాదప్రతివాదాలు, తీర్పుతో సహా మొత్తం ఆంగ్లభాషామయమే. ఆఖరికి **సాక్షి తెలుగులో ఇచ్చిన వాంగ్మూలాన్ని కష్టపడి ఆంగ్లభాషలోనికి మార్చి** రికార్డు చేయటం (టైపు చేయటం) జరుగుతున్నది. ఈ దురవస్థకు కారణమేమిటి? ఇందుకు ఎవరిది బాధ్యత? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే న్యాయస్థానాలలో భాషగురించి సంబంధిత చట్టాలు ఏమి చెబుతున్నాయి అన్న విషయాన్ని ముందుగా తెలుసుకోవాలి.

**హైకోర్టు భాష**

భారత రాజ్యాంగంలోని 348 అధికరణం రాష్ట్రాలలోని హైకోర్టులో, సుప్రీంకోర్టులో వాదదగిన భాషను నిర్ధారించు అధికారం కేంద్ర పార్లమెంటుకు సంక్రమింపచేసింది. ఆ అధికరణములోని క్లాజు (1) ప్రకారం సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులలో న్యాయప్రక్రియ అంతా తప్పనిసరిగా ఆంగ్లములోనే జరగాలి. ఇందుకు భిన్నముగా చట్టమును చేయు అధికారము పార్లమెంటుకు ఉన్నప్పటికీ ఆ అధికారాన్ని పార్లమెంటు ఇంతవరకు ఉపయోగించుకోలేదు. అందువలన 1947 నుంచి ఇప్పటి దాకా మన హైకోర్టులో ఆంగ్లమే అధికార భాషగా కొనసాగుతున్నది.

**దిగువ న్యాయస్థానాలలో భాష**

రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక జిల్లా కోర్టు, సెషన్సుకోర్టు, తాలూకా, మండలస్థాయిలో అనేక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులు, హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాలలో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులు ఉన్నాయి. వీటన్నింటినీ దిగువస్థాయి న్యాయస్థానాలు అని వ్యవహరిస్తుంటారు. నగర జనాభాలో కొద్ది శాతం మినహాయించి మండలాలు, తాలూకాలు, గ్రామాలలోని ప్రజలలో ఎక్కువభాగం కనీసం అక్షరాస్యులు కూడా కాదు. జిల్లాకోర్టు, మున్సిఫ్ మేజిస్ట్రేటు కోర్టులలోని లిటిగేషన్‌లో ఎక్కువభాగం గ్రామీణ ప్రాంతాలకు సంబంధించినదే. అంటే కక్షిదారులు చాలా మంది నిరక్షరాస్యులే. మాతృభాష అయిన తెలుగులో మాట్లాడటం తప్ప, వ్రాయడంగాని చదవటంగాని రాని వారే. అయినా లిటిగేషన్ అంతా వారికి ఏమాత్రం అర్థంకాని ఆంగ్లంలోనే జరుగుతున్నది. కారణం ఏమిటి?

క్రిమినల్ కేసులకు సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, సివిల్ దావాలకు సంబంధించి సివిల్ ప్రొసీజర్ కోడ్ ప్రామాణిక శాసనాలు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ బ్రిటిష్ వలస పాలకులచే రూపొందించబడింది. **దిగువస్థాయి న్యాయస్థానాలలోని భాషను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాలని ఆ చట్టంలోని సెక్షన్ 272 స్పష్టం చేస్తున్నది.** ఇక సివిల్ న్యాయప్రక్రియకు సంబంధించిన నిబంధన సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని, సెక్షన్ 137లో ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించేవరకు, ఈ చట్టం అమలులోకి వచ్చు సమయమునకు అమలులో ఉన్న భాషలోనే దిగువస్థాయి న్యాయస్థానాలలో న్యాయ ప్రక్రియ కొనసాగాలని ఆ సెక్షన్‌లో పేర్కొనబడి ఉన్నది. (ఆ చట్టం కూడా బ్రిటిష్ వలస పాలకులచే 1908వ సంవత్సరంలో రూపొందించబడింది. ఆ సెక్షన్ యొక్క సారాంశం కూడా దిగువ స్థాయి న్యాయస్థానాలలో భాషను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధారించాలనే!

**నిద్రావస్థలో...**

మొత్తంమీద మనకు అర్థం అయ్యేదేమిటంటే దిగువస్థాయి న్యాయస్థానాలలో న్యాయప్రక్రియ ఏభాషలో ఉండాలో ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించాలి. **ఉత్తర భారతంతో సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలోనే స్పందించాయి.** తమ రాష్ట్రాలలోని మాతృభాషలలోనే న్యాయప్రక్రియ ఉండే విధంగా పైన ఉదహరించిన రెండు చట్టాలనూ సవరించుకున్నాయి. సివిల్ న్యాయప్రక్రియ హిందీలో ఉండేవిధంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 1970లోను, రాజస్థాన్ ప్రభుత్వం 1983లోను చట్టం చేశాయి. క్రిమినల్ ప్రొసీజర్ కూడా చాలా రాష్ట్రాలలో సవరించబడింది.

కానీ మన రాష్ట్రం మాత్రం ఈ విషయంలో ఇంకా నిద్రావస్థలోనే ఉన్నది. మాతృభాష అయిన తెలుగులో సివిల్, క్రిమినల్ న్యాయ ప్రక్రియ కొనసాగే విధంగా చట్టాన్ని తీసుకువచ్చే ప్రయత్నమే చేయలేదు. న్యాయవ్యవస్థ యెడల మన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్య మంత్రులు, న్యాయశాఖ పూర్తిగా **నిర్లక్ష్యంగా ఉండటమే న్యాయ ప్రక్రియ ఆంగ్లభాషలో కొనసాగటానికి కారణం.**

**న్యాయవాదులు ఉద్యమించాలి**

కేవలము అధికారము, తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలు తప్ప మరేమీ పట్టని రాజకీయ పార్టీలు, రాష్ట్రప్రభుత్వము న్యాయస్థానాల యెడల, న్యాయవ్యవస్థ యెడల నిర్లక్ష్యముగా ఉండటంలో ఆశ్చర్యంలేదు. కానీ, న్యాయవాదుల పాత్ర, వైఖరి మాత్రం ఆశ్చర్యం కలిగించక మానదు. దిగువస్థాయి న్యాయస్థానాలలో **న్యాయప్రక్రియ తెలుగులో ఉండేటట్లుగా చూడటంలో న్యాయవాదులు**, వారికి ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ **బార్ కౌన్సిల్ ఘోరంగా విఫల మయ్యాయి.** ఇది ఉద్దేశపూర్వకమా, యాదృచ్ఛికమా, కాకతాళీయమా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పటం కొంచెం కష్టతరమే అయినా, మాతృభాషలో న్యాయప్రక్రియపై ఇంతవరకు న్యాయవాద సంఘాలు గాని, బార్‌కౌన్సిల్‌గాని దృష్టిపెట్టక పోవటం శోచనీయం. గతం గతః అనుకుని, ఇకనైనా ఈ అంశంపై న్యాయవాదులు, బార్‌కౌన్సిల్ ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే హర్షణీయమే. దిగువస్థాయి న్యాయస్థానాలలో న్యాయప్రక్రియ కొనసాగేలా న్యాయవాదులు ఉద్యమిస్తారని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తారని ఆశిద్దాం.

(ఈ వ్యాసరచయిత ఆడ్వొకేటు. రాజ్యాంగాన్ని, అనేకచట్టాలను తెలుగులోకి అనువాదం చేశారు)

ఆర్.కె. నారాయణ్

## న్యాయమూర్తుల్ని కలవరపరిచే ఘట్టం

# "పదిహేనేళ్ళు!"

**భా**ష నేడు ఒక గంభీరమైన విషయంగా మారి అందరిని కలవరపెడుతోంది. ఈ ఆలోచన మదిలో మెదిలిన ప్రతిసారీ శాంతి కాముకులైన మన పౌరులు గొంతులో బాధను దిగమింగుకుంటున్నారు. నేను ప్రత్యేకంగా ఇంగ్లీషు భాషను ఉదాహరించి ఈ విషయాన్ని చెబుతున్నాను. ఒక సామాన్య నగర పౌరుడు నేడు భాషను ప్రశంసించగలిగే దశలో వున్నాడుగానీ స్వీకరించగలిగే స్థితిలో లేడు.

'అతడు అద్భుతమైన ఇంగ్లీషు భాషను మాట్లాడగలడు' అని ప్రజలు గొప్పలు చెప్పుకునే కాలాన్ని అధిగమించి, మనం ఇంకా ఎంతో దూరం వెళ్ళలేదనే అనుకుంటున్నాను. ఇంగ్లీషులో ఉత్తరాలు రాయగలిగి, స్కాట్, డికెన్స్ నవలలు చదివినట్టు చెప్పుకునే ఆడపిల్లను సంపూర్ణమైన స్త్రీగా భావించే వారు ఇంకా పోలేదు. ఉపాధి విషయములో కూడా ఇంగ్లీషులో అచ్చుతప్పులు లేకుండా సులభంగా ఆత్మవిశ్వాసంతోఉత్తరప్రతిని తయారు చేయగలిగిన యువకునికి ప్రాంతీయ భాషలో పాండిత్యం కలిగిన వానికంటే అవకాశాలు ఎక్కువగా వుండేవి.

"నాకు ఇంగ్లీషు వచ్చి వుంటేనా - ప్రపంచాన్ని జయించి ఉండేవాడిని" అంటూ ఇంగ్లీషు రాని చాలా మంది నిట్టూర్చేవారు.

ఇప్పటి అనుకూలమైన వాతావరణంలో ఈ విషయాలు మన జ్ఞాపకానికి రానంత మాత్రాన ఈ భావాలు మనలో అస్సలు కలగలేదని బుకాయించడం మాత్రం సబబు కాదు. అయినా ఎన్నో అనుభవాల వల్ల కలిగిన, రాజకీయమైన కారణాలు ఇంగ్లీషును మన మధ్య నుండి తరిమివేయాలని ఆదేశిస్తున్నాయి. ఈ భాషపట్ల అసహ్యాన్ని ప్రదర్శించడం, దీనిని రద్దు పరచాలని నినాదాలు చేయడంతో మొదలై ఇప్పుడు దాదాపు ఇది ఓ జాతీయ సమస్యగానూ, మన గౌరవానికి భంగం కలిగించే భాషగానూ దీనిని చూస్తున్నారు.

కానీ ఈ భాషకు మంత్రముగ్ధుల్ని చేసే మనోహరత్వమే కాక మళ్ళీ మళ్ళీ మన వద్దకు వచ్చే హఠం కూడా వున్నది. "నేనేం చేశానని నన్నింతగా ద్వేషిస్తున్నారు?" అని ప్రశ్నిస్తోంది. ఎక్కడ బలహీనపడతానో అనే భయంతో న్యాయమూర్తి వంచిన తల ఎత్తనేలేదు.

"నీవు మమ్మల్ని బాధించిన వారి భాషవు. నీ ద్వారా మా జాతిని బానిసలుగా మార్చారు. కేవలం నీ ద్వారానే మా ప్రజలను విభజించి, ఇంగ్లీషులో పాండిత్యము గలవారు ఆ భాష రాని వారిని పాలించాలేమో! అనే భ్రమను కలిగించారు. మీ కపటపూరితమైన ప్రాబల్యంతో మాలో మాకు ఎన్నో విభేదాలు తెచ్చిపెట్టారు" అన్నారు తన కఠినమైన కంఠముతో న్యాయమూర్తిగారు.

"మీరు చాలా మంచి ఇంగ్లీషును మాట్లాడు తున్నారు", బోనెక్కిన ఇంగ్లీషు భాష మెచ్చుకోలుగా అంది.

"సరే, సరే, నీ మాటలకు నేనేం పొంగి పోను" అన్నారు న్యాయాధిపతి.

మౌనంగా వుండిపోయింది ఇంగ్లీషు బాష. .

"మేమంతా ఇంగ్లీషులో ప్రవీణులమే. కానీ, అది దేనినీ నిరూపించదు. నీవు ఎవరి భాషవో తెలుసా? మమ్మల్ని రాజకీయంగా అణగదొక్కిన దానివి. నీవు మా మధ్య ఉండటానికి వీల్లేదు. నీతో మాకు అవసరం లేదు. దయచేసి వెళ్ళిపో."

"నేనెక్కడికి వెళ్ళనూ?"

"నీ స్వదేశానికి?





**"విద్యాలయాలలో పరిపాలనలో న్యాయస్థానాలలో మాతృభాషలోనే వ్యవహారాలు నడవాలి. ప్రజాస్వామ్య పటిష్టతకు ఇది అనివార్యం...**

"ఏ దేశమూ తన సొంత మాతృభాషలను విడిచిపెట్టి నిజమైన అభివృద్ధిని సాధించలేదు. ఒక భాషగా ఇంగ్లీషు భాషను నేను వ్యతిరేకించడం లేదు. కాని, మాతృభాషలయిన దేశీయ భాషలను చంపి, వాటి సమాధిపైన ఇంగ్లీషును పెంచి పోషిస్తే స్వదేశీ పదం లోని అర్థస్ఫూర్తిని మనం గౌరవించనట్టే లెక్క! ఈ కారణం వల్లనే మన ప్రజలు ఇంగ్లీషు అధికారులను గౌరవించలేక పోయారు, అలాగే ఇప్పుడూ వారు మన అధికారు లంటే కూడా గౌరవం చూపలేకపోతున్నారు. **మన సొంత గడ్డపైనే మనం విదేశీయులమై పోయామే అని ఆలోచించగలిగే విద్యా వంతులు మనమధ్య ఎదిగి రావాలి.** విచిత్రమేమంటే, మనలోని ఈ పరభాషా వ్యామోహంవల్ల ఈరోజున భార్యతో కూడా మనలోని మంచి భావాలను పంచుకోలేక పోతున్నాం."

**- మహాత్మా గాంధీ**

"నిజం చెప్పాలంటే ఇదే నా దేశం. మీరేం చేసినా నేనిక్కడే వుంటాను. మీరు ఏ స్థాయిలో, ఏ హోదాలో వుంచినా, ఒకటవ భాషగా కాని, రెండవ భాషగాకాని, చివరికి వెయ్యో భాషగా మీరు స్థానం కల్పించినా సరే నేనిక్కడే ఉంటాను. మీరు తరగతి గదుల్లోంచి నన్ను బహిష్కరించవచ్చు. కాని నేను ఉండదగ్గ ప్రదేశాన్ని నేనే వెదుక్కుంటాను. నేనీ దేశాన్ని ప్రేమిస్తున్నాను.

ఇక్కడ ....

*ఎన్నో ఎన్నెన్నో కాంతులీను ఉదయాలు చూశాను.*

*పర్వత శిఖరపు అందాలను తనివితీరా స్తుతించాను.*

*పచ్చటి పైరుల పైని చల్లటి గాలిని ముద్దాడి జాలువారు యేటి నీట మునిగి స్వర్గపు అంచులు చేరాను"* అంది భాష.

"ఇది షేక్స్పియర్ గారి అపురూపమైన కవితలో భాగం. అయినా కోర్టు వారి సమయాన్ని ఇలా వృధా చేయడం నాకిష్టం లేదు. మెదడును మోసపుచ్చు నేర్పు, చమత్కారము మాకు తెలుసు. కాని ఇంగ్లీషు సాహిత్యములోని దృష్టాంతాలను చెప్పడాన్ని నేను నిషేధిస్తున్నాను." ప్రకటించారు జడ్జీగారు.

"అయ్యా మీరెందుకు నాకు బద్ధవిరోధులుగా వున్నారు? మీరు నన్ను గెంటివేస్తున్న ఖచ్చితమైన కారణం నాకు తెలియాలి. భారత రాజ్యాంగం ప్రకారం ఇది నా హక్కుగా భావిస్తున్నాను..."

"కాని అది నీకు వర్తించదు."

"ఎందుకు వర్తించదు?"

"ఎందుకంటే నీవు భారత పౌరుడివి కాదు కాబట్టి."

"భారతీయత విషయానికొస్తే మీకంటే నేనే ఎక్కువ. మీ వయస్సు మహా వుంటే ఏ యాభయ్యో అరవయ్యో లేదా డెబ్బయో వుండొచ్చు. కాని నేను, **రెండువందల ఏళ్లుగా ఈ గడ్డమీద ఉంటున్నాను.**"

"మీరు భారతదేశం విడిచి వెళ్ళండి" అని ఇంగ్లీషు వారిని అన్నామంటే, అది వారి భాషతో సహా అని అర్థం. నిన్నింకా సహించేందుకు మాకు వేరే కారణాలక్కరలేదు. మాపై హుకుం చలాయించి, కఠినమైన నిబంధనలు ఏర్పరచి, క్రూరమైన చట్టాలను రుద్దిన వారికి చెందిన (ఇంగ్లీషు) భాషవు నువ్వు. రెండు నాల్కలవలె ఒకే పదానికి ఒకే సమయంలో రెండు అర్థాలిస్తావు."

"నన్ను క్షమించండి. కాని నిబంధనలు, శాసనసభలు, కోర్టులు అన్నింటా ఉపయోగించుటకు ఒక భాష అవసరము కదా. అది మనల్ని తప్పుదోవ పట్టించక సరియైన అర్థాన్నివ్వాలి కదా! ఇది నాకో విషయాన్ని జ్ఞాపకానికి తెస్తోంది. ఇప్పుడు న్యాయశాస్త్రములోని చట్టాలన్నీ దేశీయ భాషల్లోనే ఉన్నాయా? ఈ భాషనైనా దేశపు ప్రామాణిక భాషగా చేశారా, లేదా? నాకో రచయితకు పట్టిన గతి ఈ సందర్భంగా గుర్తుకువస్తోంది. తన ఇంగ్లీషు రచనల్ని హిందీలోకి అనువాదము చేయించి ఆ తరువాత అవి ఎందుకూ కొరగానివిగా ఎంచి మూలన పడేశాడు."

'ఎందుకని?'

"బాగా అనువాదము చెయ్యగలడనిపించిన ఒక పండితుని చేత తన రచనలన్నీ అనువదింప జేశాడు. ఆ భాషలో పాండిత్యము లేని రచయితగారు అనువాద పండితులవారు చెప్పినది తిరుగులేని సత్యముగా భావించి ఆయన చేసిన అపవాదములను అనాక్షేప ణీయములుగా తలచాడు. కానీ ఆ అనువాద ప్రతులను ఇతరులకు చూపించినపుడు, ఒక వర్గం వారు వాటినిండా సంస్కృత పదములు న్నవనియూ, మరో వర్గం వారు ఎక్కువగా ఉర్దూ పదములున్నాయనీ ఖండించారు. విషయాన్ని ఎటూ తేల్చుకోలేని రచయితగారు ఆ అనువాద ప్రతులను కనుమరుగు జేశారు. ఈకథ యొక్క నీతి ఏమనగా...."

"నువ్వీ సమస్య గురించి పట్టించుకోవలసిన అవసరం లేదు. మేము నువ్వు వెళ్లిపోవాలని కోరుతున్నామంతే."

"మీరు నన్ను ఆంగ్ల పాలకుని త్రిశూలంగానే చిత్రీకరిస్తున్నారు. కానీ నిజానికి నేను సరస్వతీ భక్తురాలిని. నేనామెకు అనుంగు చెలికత్తెగా వున్నాను."

"అవన్నీ ప్రక్కన పెట్టు. నీవు చీర ధరించి, నుదుటున కుంకుమ బొట్టు పెట్టుకుని వచ్చినా సరే మేము మాత్రం నిన్ను దేశం నుంచి వెళ్లగొట్టాలనే నిర్ణయించాం. చివరిగా నీకు **ఈదేశం వదిలి వెళ్లడానికి కేవలం పదిహేనేళ్లు గడువిస్తున్నాం.** ఆ తరువాత."

"పదిహేనేళ్లా! ఎప్పటినుండీ?" ప్రశ్నించింది బోనులో నుంచి ఇంగ్లీషు భాష

ఈ ప్రశ్నకు న్యాయమూర్తిగారు కొద్దిగా కలవరపడ్డారు.

నిశ్శబ్దం కాసేపు... చివరకు,

"ఈ విషయం మీద ఇక ఎటువంటి వాదనలూ అనుమతించ బడవు" అని ఆజ్ఞ జారీచేసి ఆ రోజుకు కోర్టును ముగించారు న్యాయాధీశులవారు!

---

**ఈ రచనకు ఆంగ్లమూలం :** సుప్రసిద్ధ జాతీయ, అంతర్జాతీయ కథా, నవలా రచయిత **కీ.శే. ఆర్.కె. నారాయణ్,**

**తెలుగు సేత : ఎస్. అహమద్ షరీఫ్.**

ఆంధ్రప్రదేశ్ అధికారభాషాసంఘం 2009లో ప్రచురించిన 'తెలుగులో న్యాయస్థానాల తీర్పులు' పుస్తకం- (సంకలనం: డా.ఎబికె.ప్రసాద్) నుండి-కృతజ్ఞతలతో.

తెలుగు
మాధ్యమం

## మాతృభాషామాధ్యమాన్ని కాపాడుకోవాలి-అమ్మభాషకోసం ఉద్యమించాలి

# ద్రావిడ విశ్వవిద్యాలయం(కుప్పం) విద్యార్థుల పూనిక



**స్వాతి**
పరిశోధక విద్యార్థిని
ద్రావిడ విశ్వవిద్యాలయం
కుప్పం.



**డా. ఈశ్వర్**
ద్రావిడ విశ్వవిద్యాలయం
కుప్పం.

**శి**శువుకు తల్లిపాలు ఎలాంటిదో విద్యార్థికి మాతృభాషలో బోధన కూడా అలాంటిదేనని రవీంద్రనాథ్ ఠాగూర్ పేర్కొన్నారు. కానీ నేటి ప్రభుత్వం తీసుకొస్తున్న జీ.ఓ 14 నిర్ణయం గూర్చి ప్రతీ తెలుగు పౌరుడు ఎంతగానో ఆలోచించి మాతృభాషా వికాసానికై, దాని పరిరక్షణకై ఉద్యమించాల్సిన సమయం ఆసన్న మైనది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తొలగించి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శిశువుకు తల్లి పాలను త్రోసిపుచ్చి ఒకేసారి ఆవకాయ అన్నంతో అన్నప్రాసం చెసే విధంగా ఉంది. ఇటువంటి నిర్ణయాలు ప్రముఖ భాషావేత్తలతో చర్చించి, పరిశీలించి అమలు చేయడం సమంజసం.

◈ మాతృభాషను ప్రాథమిక స్థాయినుండి నేర్చుకోని విద్యార్థి పరభాషను నేర్చుకోవడం ఎంతవరకు సాధ్యం? ఇతర భాషల్ని నేర్చుకోవడానికై మాతృభాష అభ్యసనం ఎంతగానో దోహద పడుతుందని, ప్రముఖ పాత్ర వహిస్తుందని ఎంతోమంది భాషావేత్తలు, మనోవైజ్ఞానిక వేత్తలు సూచించిన అభిప్రాయం.

◈ ఇరుగు పొరుగు రాష్ట్రాలు వేరే భాషలతో సంబంధం లేకుండా వారి మాతృభాషాభివృద్ధికై కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. వీటిని గమనించైనా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిర్ణయాలు తీసుకోవాలి. మన రాష్ట్రప్రభుత్వం నేడు తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా మాతృభాషా వికాసం జరుగుతుందా? క్షీణిస్తుందా? ఈ నిర్ణయం కారణంగా కలిగే ప్రయోజనాలు, అప్రయోజనాలేమిటీ? అనే విషయాన్ని ప్రభుత్వం ఎంతోమంది భాషావేత్తలతో సునిశితంగా చర్చించాలి.

◈ మాతృభాషను పరిరక్షించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. అటువంటి బాధ్యతను విస్మరించి తెలుగుతల్లిని అగౌరవపరిచేలా తీసుకున్న ఈ నిర్ణయం వెంటనే రద్దు చేయాలి.

◈ భారత రాజ్యాంగం 350 అధికరణం ప్రకారం ప్రాథమిక విద్య ఎవరికైనా మాతృభాషా మాధ్యమంలోనే చదువు చెప్పాలని చెప్పుతుండగా, రాజ్యాంగానికి విరుద్ధంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతవరకు సమంజసమూ? ప్రభుత్వం మరొకసారి పునఃపరిశీలించాలి.

**ప్రా**థమికస్థాయిలో మాతృభాషలో విద్యాబోధన వలన పిల్లలలో మానసిక వికాసం పెంపొందుతుంది. గతంలో ఉన్నత స్థానానికి వెళ్లిన వారిలో చాలామంది మాతృభాష మాధ్యమంలో చదువుకున్న వారే. నేటికాలంలో విదేశీ మోజులో పడ్డ తల్లిదండ్రులు తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమంలో చదివించి విదేశాలలో ఉద్యోగాలు చేయించి బాగా డబ్బులు సంపాదంచాలనే భావనలో ఉన్నారు. వీరి ఆశలను కార్పోరేట్ సంస్థలు అందిపుచ్చుకొని ధనార్జనే ధ్యేయంగా మాతృభాషను అధోగతి పాలు చేస్తున్నాయి. తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు రానంతవరకు ప్రభుత్వాలు పట్టించుకోవు. కనుక మేధావులు మాతృభాష మాధ్యమంపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషిచేయాలి. మనవారికి విదేశీ మోజు ఎక్కువ. కాని విదేశాల్లో చాలా దేశాలు మాతృభాషలో విద్యాబోధనకు ప్రాధాన్యత నిస్తున్నాయి. కనీసం వారిని ఆదర్శంగా తీసుకున్నా మన మాతృభాషకు న్యాయం జరుగుతుంది. శాస్త్రసాంకేతిక, వైద్య గ్రంథాలు జర్మనీ, రష్యా, చైనా వంటి దేశాలు తమ మాతృభాషల్లోకి అనువదించుకున్నాయి. కానీ మన దగ్గర ఆ పరిస్థితి లేదు. మేధావులు, విద్యారంగ పండితులు ఆ దిశగా ఆలోచిం చాలి. ప్రభుత్వాలు గతంలో శాస్త్రసాంకేతిక రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఆ రంగంలో ఉపాధి అవకాశాలు పెరిగి యువత అటువైపు దృష్టి సారించింది. అదే సందర్భంలో జీవనం యాంత్రికంగా మారిపోయింది. దీనితో సమాజంలో అనేక సమస్యలు, ఉద్రిక్తతలు ఎర్పడ్డాయి. ముఖ్యంగా అత్యాచారాలు, హత్యలు, అమ్మాయిలపై యాసిడ్ దాడులు వంటివి. ఇటువంటి సందర్భాలలో మానవీయ శాస్త్రాలు, భాషాశాస్త్రాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. దేశంలో, రాష్ట్రంలో సామాజిక వేత్తల లోటు ఏర్పడింది. రాష్ట్ర విభజన సమస్య సందర్భంలో ఇరుప్రాంతాల మధ్య ఎర్పడ్డ ఉద్రిక్తలు తొలగించడానికి ఒక్క సామాజిక వేత్త కూడ లేకపోవడం మనం కళ్ళారా చూశాం. మన సంస్కృతి అంతరించిపోకుండా కాపాడుకొవాలంటే మాతృభాష తప్పనిసరి. నేటితరానికి సంస్కృతి, నైతికవిలువలు, మానవీయ విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉంది. కనుక ఇంటర్, డిగ్రీతో పాటు ఇంజనీరింగ్, మెడిసిన్, ఎం.బి.ఎ, ఎం.సి.ఎ వంటి అన్ని రకాల కోర్సులలో తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరిచేయాలి. ప్రస్తుతం అధికారంలో ఉన్న 'తెలుగుదేశం' పార్టీ పేరులో ఉన్న తెలుగు పదికాలాల పాటు నిలవాలంటే ప్రభుత్వం మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటూ ....

# ప్రాథమిక విద్య- తెలుగు మాధ్యమం

**తెలుగు** భాష, మాతృభాష, ప్రాథమిక విద్య, తెలుగు మాధ్యమం లాంటి మరెన్నో విషయాలపై ప్రస్తుతం జరుగుతున్న చర్చలు, ధర్నాలు మొదలైన వాటిని దృష్టిలో పెట్టుకొని నా భావాలను మీ అందరితో పంచుకోవాలనే నా ఈ చిన్న ప్రయత్నం.

పూర్వం విద్యను అభ్యసించే వారికి ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలు, విషయాలు, విశ్లేషణే విద్యార్థుల ఆలోచనకు పరిధిగా వుండేది. కాని కాలక్రమేణా పాఠ్యాంశాలలో చోటు చేసుకొన్న మార్పులు, సామాజిక మార్పులు, సాంకేతికరంగ అభివృద్ధి, తల్లిదండ్రుల ఆలోచనా విధానం, విద్యార్థులలో విద్యపై మక్కువ లాంటివి - విద్యార్థుల ఆలోచనా పరిధికి అంతం లేనట్లుగా చేశాయి.

ముఖ్యంగా దినాదినాభివృద్ధి పొందుతున్న సాంకేతిక రంగం భాషపై ఎంతో ప్రభావాన్ని చూపుతోంది. విషయాలపై అవగాహన పెంపొందేందుకు తోడ్పడే సాంకేతిక పనిముట్లు (technology tools) అందుబాటులోకి రావడం ఒక రకంగా ఈ కాలపు విద్యార్థులకు విషయార్జన పట్ల అవగాహన, ఉత్సాహం పెంపొందించేలా చేశాయి. ఒక్క మీటతో కావలసిన విషయాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందుకు వారికి భాష, వ్యాకరణం లాంటివి పెద్ద అడ్డుగోడగా లేదు. మనం చెప్పేది అవతలవారికి అర్థమైతే చాలు అన్న రీతిలో ప్రస్తుతం పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా జీవితంలో ఒక భాగంగా అయిపోయిన సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్లు, ట్యాబ్‌లు మొదలైన పనిముట్లు ఆంగ్లభాషను పునాదిగా చేసుకొన్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని పొందడమే లక్ష్యంగా వుంది. **ఇది తప్పు కాదు. కాని ఇక్కడే మాతృభాష పట్ల నిర్లక్ష్య ధోరణి కనపడుతోంది/ ఏర్పడుతోంది.**

గత కొన్నేళ్ళుగా తెలుగు మాధ్యమంగా ఉన్న ప్రభుత్వ / ప్రభుత్వేతర విద్యాసంస్థల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీనికి ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాల కొరత, ప్రభుత్వాలు ప్రైవేటీకరణపై మొగ్గు చూపిస్తూ ఆంగ్ల మాధ్యమాన్ని ప్రోత్సహించడం, పి.జి. స్థాయిలో ఎక్కువగా తెలుగు మాధ్యమం లేకపోవడం, ఉద్యోగార్హతకు ఆంగ్లం తప్పనిసరి అన్న అపోహ లాంటివి కొన్ని కారణాలుగా చెప్పుకోవచ్చు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్టు, ప్రభుత్వమే ప్రభుత్వ విద్యాసంస్థల నిర్వీర్యానికి కారణమౌతోంది. దీనితో విద్యార్జనకై ప్రజలు ప్రైవేట్ విద్యాసంస్థలను (విద్యారుసుము ఎక్కువైనప్పటికీ) ఆశ్రయిస్తున్నారు / మక్కువ చూపిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాలు రెండు ఉండి కూడా, తెలుగు భాషను, మాధ్యమాన్ని తప్పనిసరి చేయలేకపోవడం మన ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోంది. ఎన్ని ఉద్యమాలు చేస్తే తెలంగాణా రాష్ట్రం ఏర్పడిందో - అదే విధంగా మాతృభాషా ఉద్యమాలు కూడా ఊపందుకోవాలి. దీనికి ప్రజల సహకారం ఎంతో అవసరం. సామాజిక, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాల సహాయంతో తెలుగు భాష, దాని ప్రాముఖ్యత మొదలైన అంశాలను ప్రజల చెంతకు తీసుకువెళ్ళాలి.

పాఠశాల స్థాయిలో తెలుగు మాధ్యమం తప్పనిసరి చేస్తూ, డిగ్రీ స్థాయి ఆపైన కనీసం ఫస్ట్ లాంగ్వేజ్ (ప్రథమ భాష), సెకండ్ లాంగ్వేజ్ (ద్వితీయ భాష) లతో సంబంధం లేకుండా తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేయటం అవసరం (ఎందుకంటే కొన్ని విషయాలలో తప్పనిసరి అని ముందుకు వెళితే కాని సాధించలేము). **విశ్వవిద్యాలయాలలో పి.జి. స్థాయిలో జరిగే పరిశోధనలు తెలుగు మాధ్యమంలో చేయడానికి వీలు కల్పించడం, తెలుగు మాధ్యమంగా విద్యనభ్యసించిన వారికి ఉద్యోగ నియామకాలలో కొంత శాతం కేటాయించటం లాంటివి చేయాలి. దీనికి రాజకీయ నాయకుల చొరవ, ప్రభుత్వాల చిత్తశుద్ధి ఎంతో అవసరం.**

చివరగా - ఇల్లు బాగుంటే ఊరు బాగుంటుంది, ఊరు బాగుంటే దేశం బాగుంటుంది అన్నట్టుగా మాతృభాషకు పునాది/బీజం ఇల్లు. ఈ కాలంలో ఎంత మంది, ఇళ్ళల్లో, తల్లితండ్రులు పిల్లలతో తెలుగు మాట్లాడుతున్నారో మనం ఆలోచనచేయాలి. ప్రస్తుతం, కొంతవరకూ హైదరాబాదులాంటి నగరాలలో తల్లితండ్రులిద్దరూ (అన్ని వర్గాలవారు) ఉద్యోగాలు (ఏదేని పని) చేయడంతో, పిల్లలతో సమయం కేటాయించలేకపోవడం తత్ఫలితంగా పిల్లల ఆలోచనా విధానం ఎక్కువగా బయట ప్రపంచంతో ముడి పడడం మాతృభాష పట్ల శ్రద్ధ తగ్గడానికి ముఖ్యమైన కారణంగా భావించాలి.

**-పి.వి.ఎస్. రామచంద్రమూర్తి**
**హైదరాబాద్ విశ్వవిద్యాలయం**



**సుకన్య**
పరిశోధక విద్యార్థిని
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

**మాతృ** భాష అన్నది తెలుగు నాట సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నం వంటిది. అటువంటి మాతృభాషను తొలగించి ఆంగ్ల భాష మాధ్యమాన్నే ప్రవేశపెట్టడం విద్యార్థులను మానసికంగా దెబ్బతీయడమే అవుతుంది. మాతృభాష లోనే విద్య కొనసాగు తున్నప్పుడే మాతృభాషను తక్కువగా చూస్తున్నారు. మాతృభాషను కాదని పరాయి భాషలో విద్యాబోధనను ప్రవేశపెట్టడం ప్రజలను నిరక్షరాస్యులను చేయడమే అవుతుంది. ఆంగ్లభాషను ప్రవేశ పెడితే అక్షరాస్యత అభివృద్ధిచెందడం సాధ్యం కాదు. మాతృభాషను కనుమరుగు చేస్తే ఆంగ్ల భాషకు ప్రాధాన్యత ఇవ్వడంతో చదువుకొన్న వారికి మాత్రమే సంభాషణ సాధ్యం అవుతుంది. ఇది తల్లీ పిల్లలకు మధ్య పెట్టే చిచ్చు లాంటిది. మాతృభాషను తప్పనిసరి చేయవలసింది పోయి

మాతృభాషను తొలగించడం మంచిదికాదు. ఒక విషయాన్ని పూర్తిగా గ్రహించాలంటే మాతృభాషలోనే సాధ్యమవుతుంది. పాఠశాలల్లోను మాతృభాషను తొలగించాలంటే ముందు మన ఇంట్లోని తల్లి దండ్రులకు కూడా ఆంగ్లం నేర్పించాల్సివుంటుంది, ఎందుకంటే పిల్లలు మాట్లాడితే తల్లి దండ్రులకు అర్థం కాదుకదా. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోవడం మంచిది. ఈ సందర్భంలోమాతృభాష కోసం చేసే పోరాటమే సరైన నిర్ణయం.



**కె. సూర్యనారాయణ**
పరిశోధక విద్యార్థి, భాషాశాస్త్ర శాఖ,
ద్రావిడ విశ్వవిద్యాలయం,కుప్పం.

**ఏ** జాతి సంస్కృతినైనా, చరిత్రనైనా చంపాలంటే ముందుగా దాని మాతృభాషను చంపితే సరిపోతుందన్నది నానుడి. ఇదే నేడు నిజమవుతున్నది. ప్రపంచ నాగరికత లోతులనుండి ఖ్యాతిని ఆర్జించిన తెలుగుకి నేడు ఆఖరిగడియలు ఆసన్నమయ్యాయి. రాజకీయాలు కావచ్చు, ఆధునికీకరణ కావచ్చు - కారణం ఏదైనా దారుణం మాత్రం జరిగిపోతున్నది. అంతరించిపోతున్న ఆదిమజాతుల భాషలమాదిరిగానే తెలుగు వెలుగూ ఆరిపోతున్నది. దీనికి ఆజ్యం పోస్తున్నది మాత్రం ప్రైవేటు స్కూల్స్, పరిపాలక భక్షకులు. ఇది ఇలాగే కొనసాగితే ముందు తరాలకు తెలుగు అక్షరమాలను మ్యూజియంలో చూసి తరించాల్సిన తరుణం రాక తప్పదు. చట్టాల చట్రాలలో అమ్మభాషను బంధించకండి. తెలుగు సొబగులను భావి తరాలకు అందించండి. దాని గుభాళింపులను పరిమళించనివ్వండి. ఆంగ్లమాధ్యమ మోజులో పిల్లలకు తల్లిపాలవంటి అమ్మనుడిని దూరం చెయ్యకండి.



**యం. రాజాకృష్ణ**
పరిశోధక విద్యార్థి, భాషాశాస్త్ర శాఖ,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

**మ**నది ప్రజాస్వామ్యదేశం. ప్రజలందరూ సమానులే. అందరికీ ఆమోదయోగ్యమైన మరియు అభివృద్ధి పధాన నడవడంలో అటు కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం తమ వంతు కార్యాచరణాన్ని నిర్వర్తిస్తున్నట్లుగా ప్రగల్బాలు పలుకుతూ తమ అవకాశ దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. నీటిలో రాతల్లా, తెలుగు రాష్ట్రాల్లో వీరి చేష్టలు తీవ్రస్థాయికి దిగజారాయని చెప్పడానికి 'ఆంగ్లమాధ్యమమే' నిదర్శనం. నేడు మాతృభాష నడ్డి విరిచి, ఆంగ్లమాధ్యమం మోజులో మూలగాలని, నడమంత్రపు సిరికోసం ఆకాశానికి నిచ్చెన వేసినట్లు ఉన్నాయి ఇప్పటి ప్రజాస్వామ్య పద్ధతులు. అందుకు మన తెలుగు రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే ఇందుకు నిదర్శనం. నేడు ఒకవైపు సాంకేతిక ఆంగ్లపదజాలం తెలుగును దహిస్తుంటే ఇప్పుడు మన ప్రభుత్వం దానికి ఆజ్యం పోసి పూర్తిగా దహనం చేస్తుంది. ఇటువంటి పతనస్థితిలో ఉన్న తెలుగును కాపాడుటకు ప్రతి ఒక్కరు నడుం బిగించి తమ వంతు కార్యాచరణకు పూనుకోవాలి. ప్రస్తుతం మాతృభాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొంటే, అదే భావి తరాలకు పురోగతి అని గుర్తించాలి. తెలుగు మాధ్యమ కార్యాచరణ, దీక్షాపటిమకు నాంది పలకాల్సిన సమయం ఆసన్నమైనది.

*లేవరా ఓ తెలుగు సోదరా! ముందుకు కదలరా!*
*నీ మాతృభాష మాధ్యమ ప్రేమబావుటను ఎగరవేయరా!*
*రొమ్ము విరిచి ముందుకు దూకరా!*
*కల్మషంలేని నీ మాతృ భాష ప్రేమముందు*
*ఈ నికృష్ట నీచ రాజకీయాల చెర ఎంతరా!*
*ఓ తెలుగు సోదరా! లేవరా ఓ తెలుగు సోదరా!*
*నువ్వు నిత్యం మాతృభాషకు కట్టు బానిసవని- నిరూపించరా!*
*నీ మాతృభాష ఉజ్వలకాంతియే నీ గమ్యంరా!*
*తెగించరా- ముందుకు దూకరా!*
*నీ తెలుగుజాతి కొరకు- నీ తనువును*
*ఓ కొవ్వొత్తిలా మలచరా ఓ తెలుగు సోదరా!*



-రహ్మానుద్దీన్ షేక్
96869 03386

# భారతీయ భాషలు - భారతదేశంలో వలగూడు నిర్వచనం

**సారాంశం:**

"భారతీయ భాషలు - భారతదేశంలో వలగూడు నిర్వచనం" అనే పేరుతో కెపిఎంజి సంస్థ ఒక పరిశోధనను జరిపింది. ఆ పరిశోధన పూర్తి పాఠం ఆంగ్లంలో bit.ly/IndInternet లంకె వద్ద చదవచ్చు. ఆ పరిశోధనలో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాం. ఎలాంటి సాంకేతికతలూ తెలీని సాధారణ వలగూడు వాడుకరులను ఎంపిక చేసి పలు అంశాల మీద వారిని అడిగిన ప్రశ్నలు, అలా వచ్చిన జవాబులు కొన్ని ఆసక్తికరమైన విషయాలను, సమాజంలో భారతీయ భాషల పట్ల ఉన్న అవగాహన-అభిమానాలను తేటతెల్లం చేసాయి. 22 ఏప్రిల్ 2017 న రూపొందించిన పరిశోధనల సారాంశ పత్రాన్ని 25 ఏప్రిల్ న అందరూ చదువుకునేందుకు వీలుగా పై లంకెలో అందుబాటులో ఉంచారు. ఆ పత్రం ప్రకారం…

భారతీయ భాషలలో ఇంటర్నెట్ వాడకం 2011, 2016 మధ్య 41% పెరిగి, 2016 సంవత్సరాంతానికి 23.4 కోట్ల మంది జనాభా వివిధ భారతీయ భాషలలో ఇంటర్నెట్‌ను వాడే పరిస్థితి వచ్చింది. ఇది భారతదేశంలో ఇంగ్లీష్‌లో ఇంటర్నెట్ వాడే జనాభా కంటే ఎక్కువ. ఇదే స్థాయిలో భారతీయ భాషలలో ఇంటర్నెట్ వాడకం పెరుగుతూ 18% వృద్ధి రేటుతో 2021 నాటికి 53.6 కోట్ల జనాభాను వాడుకరులుగా కలిగి ఉంటుందని ఒక అంచనా. కానీ ఆంగ్ల వాడకం మాత్రం ఏడాదికి కేవలం 3% వృద్ధి రేటుతో 2021 నాటికి 19.9 కోట్ల వాడుకరులు కలిగి ఉండవచ్చు. 2021 నాటికి భారతదేశంలో భారతీయ భాషలలో ఇంటర్నెట్ వాడేవారు, మొత్తం ఇంటర్నెట్ వాడేవారిలో 75% ఉంటారని తెలుస్తోంది.

ఈ పెరుగుదలకు తగ్గుతున్న ఇంటర్నెట్ ధరలు, ఇంటర్నెట్ కలిగిన ఉపకరణాలలో వృద్ధి, అవి చవకగా అందుబాటులో ఉండటం లాంటివి దోహదపడనున్నాయి. **మారుతున్న సాంకేతికత, రోజు రోజుకూ మన జీవితాల్లోకి మరింత చొచ్చుకుపోతున్న ఇంటర్నెట్, భారతీయులలో అప్రమేయంగా ఇంటర్నెట్ వాడకాన్ని తెచ్చిపెట్టింది.** నోట్ల రద్దు వల్ల పెరిగిన సాంఖ్యక కార్యకలాపాలు (డిజిటల్ ట్రాన్సాక్షన్స్), నగరీకరణ, స్మార్ట్ సిటీ, ప్రభుత్వ పథకాల కంప్యూటరీకృత పనితనం వలన మరింత మంది తెలుగు, తమిళం లాంటి భాషలు మాత్రమే (ఆంగ్లం రాని) వాడుకరులు ఇంటర్నెట్ వాడుకరులుగా మారుతున్నారు. అది అనివార్యమై పోయింది.

2021 నాటికి హిందీలో ఇంటర్నెట్ వాడే వారు ఆంగ్లంలో వాడే జనాభాను దాటిపోతారు. మరాఠీ, బంగాళీ భాషల వారూ అత్యధికంగా ఇంటర్నెట్‌ను వారి మాతృభాషలో వాడటం మొదలు పెడతారు. తమిళం, కన్నడ, తెలుగు ఇంటర్నెట్ వాడుకరులు 2016-2021 మధ్య కాలంలో ఇంటర్నెట్ వాడేవారిలో ముందంజలో ఉండబోనున్నారు.

భారతీయ భాషలలో ఇంటర్నెట్‌ను ఏ పనులకు వాడుతున్నారు అన్న విషయమై పరిశోధించాక, మూడు విభాగాలుగా వీటిని విడ కొట్టారు. 2016లో జరిగిన వాడకం, 2021 వరకు వాడబోయే అభిరుచుల ప్రకారం ఈ విభజన చేసారు. అవి - పరిపక్వత చెందిన విభాగాలు, పెరుగుదల ఉన్న విభాగాలు, కొత్తగా రూపొందుతున్న విభాగాలు.

పరిపక్వత చెందిన విభాగాలలో చాటింగ్, వీడియోలు చూడటం ప్రముఖంగా చెప్పుకోవాలి. 2016లో వీటి వాడకం అత్యధికంగా ఉంది. 90% కంటే ఎక్కువ భారతీయభాషల ఇంటర్నెట్ వాడుకరులు చాటింగ్ ఆధారిత అప్లికేషన్లను (వాట్సాప్, టెలిగ్రామ్, మెసెంజర్, గూగుల్ హ్యాంగౌట్) ఎక్కువగా వాడారు. ఆ తరువాత స్థానంలో వినోదం కోసం చూసే వీడియోలను చూపెట్టే ఆప్లున్నాయి (యూట్యూబ్, వింక్, వూట్). రాబోయే ఐదేళ్ళలో ఈ విభాగపు వాడకం మరింత పెరగనుంది.

పెరుగుదల ఉన్న విభాగంలో ఆన్లైన్ వార్తాపత్రికలు, సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లున్నాయి. 2016లో వాటి వాడకం ఒక మోస్తరుగా ఉన్నప్పటికీ, 30 కోట్ల మంది నేరుగా వాడుతున్న ఆప్లు ఈ విభాగంలో ఉన్నాయి. చాటింగ్, వీడియోలు చూడటం అనామకంగా జరిగిపోవచ్చు. సోషల్ నెట్వర్కింగ్, వార్తలు చదవటం లాంటి ఆప్‌లలో నేరుగా వాడుకరుల సంఖ్యను కొలవటం సులువు, అందువలన ఎవరు ఏ భాష వాడుతున్నది కనిపెట్టి, ఆంగ్లం కన్నా భారతీయ భాషల్లో అధికంగా వాడకం ఉందని చూపిస్తూ ఈ విభాగం అత్యంత దోహదపడుతూందని చెప్పవచ్చు. ఈ విభాగంలో వాడకం పెరగా లంటే భారతీయ భాషలలో కోట్ల పేజీల సమాచారం ఇంటర్నెట్‌కు చేరాలి.

ఇక మూడవ విభాగం 2016లో అంతగా వాడకం లేనివి. ఈ విభాగంలో సాంఖ్యక కథనాలు, సాంఖ్యక చెల్లుబాట్లు, ఆన్లైన్లో ప్రభుత్వ సేవలు, ఆన్లైన్ షాపింగ్, ఆన్లైన్ వ్యాపార ప్రకటనలు మొదలైనవి చెప్పుకోవచ్చు. 2021నాటికి నేటి ఇంటర్నెట్ వాడుకరుల కన్నా ఈ విభాగపు వాడుకరులు రెట్టింపుగా ఉండవచ్చు. 26% నుండి 33% వరకు పెరుగుదల ఉంటుంది.

**2021 నాటికి ఈ కింద చెప్పిన విధంగా పోకడలు ఉండవచ్చు**

* ఆన్లైన్ లో సృజనాత్మక రచనలు పెరుగుతాయి. కథలు, నవలలు, కవితలు వ్రాసే వారు గణనీయంగా పెరుగుతారు. ఇందుకు ముఖ్య కారణం పెరుగుతున్న ఇంటర్నెట్ చొచ్చుబాటు, భారతీయ భాషలలో అందుబాటులోకి వస్తున్న స్మార్ట్ ఫోన్లూను.
* సినిమాలు, టీవీల మీద ఆధారపడి వినోదాన్ని పొందే వారు ఇంటర్నెట్ పై వినోదం కోసం ఆధార పడటం మొదలయి, ఆంగ్లం మాట్లాడే వారు ఇంటర్నెట్‌ను అనుకూలించుకున్న నిడివి కంటే తక్కువ

సమయంలో భారతీయ భాషలకు అనువుగా ఇంటర్నెట్ ను మార్చుకుంటారు.

* ఇంటర్నెట్ దిగ్గజాలైన గూగుల్, ఫేసుబుక్, ట్విటర్ లాంటి ఇంటర్నెట్ వేదికలు విషయసమాచార సంకలినిలుగా పని చేయటం మొదలుపెడతాయి. అందువలన ఎక్కువ సమయం ఇంటర్నెట్ పై వాడే వ్యక్తుల్లో భారతీయ భాషల వారు ముందుంటారు.

* స్థానిక సమాచారం, ప్రాంతీయ విషయాలను తెలుసుకునేందుకు ఇంటర్నెట్ సులువైన మార్గమైపోవటం వలన "పక్క ఊరికి వెళితే మాంచి టిఫిను ఎక్కడ తినాలో'' లాంటి విషయాలు తెలుసుకునేందుకు జనం ఇంటర్నెట్ పై ఆధారపడతారు. ఇందువల్ల ఎక్కువ మంది ఇంటర్నెట్ వేదికపైకి వస్తారు.

* అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి సంస్థలు రెండవ స్థాయి నగరాలకు తమ బిజినెస్ ను చేరవేయాలంటే భారతీయ భాషలే ఆధారం.

* భారతీయ భాషలలో ఇంటర్నెట్ వాడే వారి అలవాటు గణాంకాలు బాగా అమ్ముడవుతాయి. వాణిజ్య సంస్థలకు, ఇంటర్నెట్ లో సమాచారాన్ని చేర్చే వారికి ఈ గణాంకాలు దిశా నిర్దేశం చేస్తాయి.

* కొత్త కొత్త సాంకేతికాల రాకతో భారతీయ భాషలలో ఇంటర్నెట్ వాడే వారి సంఖ్య మరింత పెరుగుతుంది. మాట నుండి పాఠ్యం, అనువాద సామర్థ్య పెరుగుదల జరిగే కొద్దీ మరింత మెరుగవుతుంది.

* సాంఖ్యక చెల్లుబాటు ఉపకరణాలలో భారతీయ భాషల ప్రాధాన్యత పెరుగుతుంది.

* స్థానిక భాషలలో వాణిజ్య ప్రకటనలు కూడా గణనీయంగా పెరుగుతాయి. ఎందుకంటే ఆంగ్లంతో పోల్చుకుంటే భారతీయ భాషల ప్రకటనలకే ఎక్కువ స్పందన వస్తుంది.

* చరవాణుల్లో భారతీయ భాషలకు అనుకూలత మరింత పెరుగుతుంది.

**పరిశోధన మూలాంశాలు :**

భారతదేశం 1600 మాండలికాలలో 30 భాషలను భాషకు పది లక్షల కంటే ఎక్కువ జనాభా మాట్లాడుకునే దేశం. భారత రాజ్యాంగం షెడ్యూల్ 8 తో 22 భాషలను గుర్తించింది.

ఈ పరిశోధనలో భారతీయ భాషా వాడుకరులంటే ఎవరు?

ఇక్కడ భారతీయ భాషా వాడుకరుల నిర్వచనం - పరస్పర సంవాద, ఉత్తర-ప్రత్యుత్తరాలకు ఇంగ్లిష్ కాకుండా తమ మాతృభాషను వాడటం వైపు మొగ్గు చూపే వారు.

ఇక ఆ జనాభాలో ఇంటర్నెట్ ను తమ మాతృభాషలలో వాడేందుకు మొగ్గు చూపేవారే భారతీయ భాషా ఇంటర్నెట్ వాడుకరులు.

* 2011 లో ఆంగ్లంలో ఇంటర్నెట్ వాడే వారి సంఖ్య 6.8 కోట్లు ఉంటే, భారతీయ భాషల్లో వాడే వారి సంఖ్య 4.2 కోట్లు మాత్రమే ఉండేది.

* 2016 నాటికి, అంటే నేటి పరిస్థితి - ఆంగ్ల వాడుకరుల సంఖ్య తారుమారయింది. మాతృభాషలో ఇంటర్నెట్ వాడే వారి సంఖ్య ఆంగ్లాన్ని మించిపోయి 23.4 కోట్లకు చేరుకుంది, ఆంగ్ల వాడుకరుల సంఖ్య 17.5 కోట్లు!

* 2021 కి వేస్తున్న అంచనా ప్రకారం ఆంగ్లం కన్నా వృద్ధి రేటు భారతీయ భాషలకే ఎక్కువ ఉంటుంది. అంటే ఇంటర్నెట్ కు పరిచయం చేయబడుతున్న ప్రతి 10 మందిలో 9 మంది తమ సొంత భాషలోనే ఇంటర్నెట్ వాడాలనుకుంటున్నారు.

**మరి భారతీయ భాషలలో ఇంత పెద్ద ఎత్తున ఇంటర్నెట్ ఎందుకు పెరిగింది?**

అందుకు ఎన్నో కారణాలు, వాటిలో కొన్ని :

* తగ్గిన ఇంటర్నెట్ ఛార్జీలు. సెప్టెంబర్ 2016 కి డిసెంబర్ 2016 కి మధ్య ఇంటర్నెట్ ఛార్జీలు 96% తగ్గాయి.

* పెరిగిన ఇంటర్నెట్ చొచ్చుబాటు : 52% జనాభా నేరుగా/ పరోక్షంగా ఇంటర్నెట్ వాడుతున్నారు.

* పెరిగిన స్మార్ట్?ఫోన్ వాడకం : రాబోయే ఐదేళ్ళలో 17.6 కోట్ల ఫోనులు వాడకంలోకి వస్తాయి.

* గ్రామీణ భారతదేశంలో డిజిటల్ కళకళలు : కేంద్ర ప్రభుత్వం 2400 కోట్ల పెట్టుబడితో మార్చ్ 2019 నాటికి 6 కోట్ల గ్రామీణ గృహాలకు ఇంటర్నెట్ సౌకర్యం అందించే దిశగా అడుగులు వేస్తోంది.

* ఆదాయంలోని ఖర్చు చేస్తున్న రొక్కంలో పెరుగుదల : 2022 నాటికి 55% జీతాన్ని నిత్యావసరాలపై ఖర్చు చేసే దిశగా జనం కదులుతున్నారు.

* ఇంటర్నెట్ లో పెరుగుతున్న భారతీయ భాషల సమాచారం, భారతీయ భాషలకు అనుకూలత.

ఐతే ఇన్నేళ్ళు ఇలా ఎందుకు జరుగలేదు?

* 70% భారతీయులకు ఆంగ్ల కీబోర్డ్ అయోమయంగా అనిపించింది. భారతీయ భాషలలో కీబోర్డుల అందుబాటు వారి సమస్యను తీర్చింది.

* 60% మంది భారతీయులు వారి సొంత భాషలో వర్డ్, ఫోటోషాప్, ఇంటర్నెట్, వెబ్సైట్లను వాడలేకపోయారు. అందుకు తగిన సాంకేతికాలు అందుబాటులో లేకపోవటమే కారణం. కానీ ఇవాళ భారతీయ భాషలు లేని ఉపకరణాలకు మార్కెట్ లేకుండా పోతోంది.

* 60% మంది ప్రకారం ఇంటర్నెట్ ఖరీదైన వస్తువు, అందుబాటులో ఉండటమూ దుర్లభమే. కానీ ఇవాళ అన్నిట అంతటా ఇంటర్నెట్టే!

* 30% మందికి కంప్యూటరంటే భయం. అదొక అంతుచిక్కని బ్రహ్మపదార్థం. ఇలాంటి వారిక్కూడా ఆఫీసుల్లో అవసరమై, లేదా ఇంటి వద్ద తప్పనిసరై కంప్యూటర్ వాడకం మామూలైపోయింది.

(మిగతా వివరాలు వచ్చే సంచికలో)

## స్పందనను వ్రాయండి

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి',**
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004.
ఇ-మెయిల్ : *editorammanudi@gmail.com*

-వాసిరెడ్డి నవీన్
98493 10560

# తెలుగు ఆనవాళ్ళు

అదొక అపూర్వ సన్నివేశం.

అదొక విషాద సన్నివేశం కూడా.

ఆ అపూర్వ విషాద సన్నివేశానికి నేనే ప్రత్యక్షసాక్షిని. ఆశ్చర్య మనిపించవచ్చు కానీ అపూర్వ విషాద సన్నివేశాలు ఒక్కటిగా ఉండ వచ్చునని నాకూ మొదటిసారిగా తెలిసొచ్చింది.

2015 నవంబర్ నెల. ఈ సందర్భానికి నాతోపాటు ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు, సవెం. రమేశ్, చంద్రలత వంటి రచయితలు, 'అమ్మనుడి' సంపాదకుడు డా॥సామల రమేష్‌బాబు, 'తెలుగువాణి' మేనేజింగ్ ట్రస్టీ పె.వేణుగోపాలరెడ్డి, ఆంధ్రప్రదేశ్ పత్రిక ముఖ్య సంపాదకులు కందుల రమేష్ కూడా దీనికి సాక్షులే.

ఎక్కడో లోతట్టు తమిళనాడులో, కేరళకి 20, 30 కి.మీ.ల సరిహద్దు ప్రాంతంలో కొంగునాడుగా పిలవబడే ప్రాంతంలోని ఉడుమలపేట దీనికి వేదిక. మార్టూరు సంజనాపద్మం అనే పన్నెండేళ్లపాప తను తెలుగులో రాసిన రేగడి నీడల్ల అనే కథల పుస్తకం ఆవిష్కరణ సభ సందర్భంగా జరిగిందీ సంఘటన. అంతవరకే అయితే ఇది మామూలు సంఘటనే చెప్పుకోడానికి ఏమీలేదు. కానీ...

ఒక్కసారి వెనక్కి వెళ్లి రేగడి నీడల్ల రచనకు ఉన్న సామాజిక నేపథ్యం గురించి చెప్పుకోవాలి. అంతకుముందు నాలుగేళ్ల నుంచి ప్రముఖ కథారచయిత, భాషోద్యమ కార్యకర్త సవెం. రమేశ్ తమిళ నాట తెలుగు గుబాళించే పల్లెల గురించి, మరీ ముఖ్యంగా కొంగు నాడు ప్రాంతపు (కొంగునాడు అంటే ఉత్తరాన సేలం నుండి దక్షిణాన కేరళ సరిహద్దు ప్రాంతమైన ఉడుమలపేట వరకు విస్తరించిన ప్రాంతం) పల్లెల గురించి, అక్కడివారి జీవన విధానం, ఇళ్లలో మాట్లాడే తెలుగుభాష గురించి, లక్షలాదిగా ఉన్న మాదిగ, కమ్మ ఇరు వత్తినాల్ చెట్టియార్లు, బలిజ నాయుళ్లు గురించి చాలా చెప్తూ వస్తున్నాడు. చాలాసార్లు అతిశయోక్తులు అనిపించి వినీ విననట్లుండే వాడిని. 2015 మే నెలలో కేరళలోని ఒట్టప్పాలం దగ్గర పల్లెలో ఉన్న మా బంధువుల ఇంటికి వెళ్లి తిరిగివస్తూ ఉడుమల పేటలో ఆగాను. పల్లెల్ని చూశాను. అందరినీ కలిశాను. మాట్లాడాను. వారి ఆప్యాయతకి, అనురాగానికి ముగ్ధుడనయ్యాను. అప్పుడే మార్టూరి వసంతనాయుడు కుటుంబం పరిచయం (ఆయన కూతురే కథలు రాసిన సంజనాపద్మం) అయింది. ఆ రెండ్రోజుల్లో ఓ పది పల్లెలు తిరిగాను.

అప్పుడర్థమయింది, రమేశ్ చెప్పేవి అతిశయోక్తులు కావని. అంతేకాదు, వాస్తవానికి అక్కడున్న పరిస్థితిని ఇరవై శాతం మాత్రమే చెప్తున్నాడని. ఆ క్షణం నుంచి అది నా తెలుగునేల అనిపించింది. అక్షరానికి దూరమైన వారి ఆవేదన అర్థమైంది. వారు మాట్లాడే ఆ తెలుగు కొంచెం విచిత్రంగా ఉంటుంది. ఎప్పుడో 17, 18 శతాబ్దాల్లో ఆగిపోయిన తెలుగులా అనిపించింది. పల్లెల్లో పదుల సంఖ్యలో రైతుల్ని కలిశాను. పెద్ద ఆసాములే. ఎక్కువగా కొబ్బరి తోటలు. వచ్చే ఫలసాయాన్ని పెట్టుబడిగా పెట్టి తిరుప్పూరు, కోయంబత్తూరు వంటి ప్రాంతాల్లో చిన్నా, పెద్ద పరిశ్రమలు స్థాపించుకున్నారు కొందరు. ఇళ్లలో అంతా తెలుగే మాట్లాడతారు. వీధుల్లో ఎదురు



పడితే తెలుగులోనే పలకరించుకుంటారు. తెలుగులోనే ఆలోచిస్తారు. దొరికితే తెలుగు సినిమాలే చూస్తారు. అడిగితే తెలుగువాళ్లకే ప్రత్యేక మైన తమ ఇంటి పేరు చెప్తారు, మార్టూరు, చెన్నారు(చెన్నావారుకి హ్రస్వరూపం), నీరుకొండారు అని. ఆంధ్రలో ఏ ప్రాంతం నుంచి వలస వచ్చారని అమాయకంగా అడిగితే నొచ్చుకున్నారు. కొంచెం కోపం కూడా వచ్చినట్లుంది. కృష్ణదేవరాయల కాలం నుండి మేం ఇక్కడి వాళ్లమే అన్నారు. నిజమే కావచ్చు. మన తెలుగు ఆచార వ్యవహారాలు, పద్ధతులు, పండుగలు పబ్బాల పూర్వ రూపాలన్నీ యథాతథంగా అక్కడ అమలు చేసుకుంటున్నారు. ఇంటిపేరుకో పేరంటాలు, ఆమెకో గుడి, సంవత్సరానికోసారి సంబరాలు జరుపు తారు. బిడ్డ పుట్టిన దగ్గర్నుంచి చావు వరకు అన్నీ పద్ధతి ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అన్నీ బాగానే ఉన్నాయి. కానీ అక్షరమే లేదు. తెలుగు చదవడం, రాయడం రాదు. నేర్చుకోవడానికి తమిళనాడులో ఆ ప్రాంతంలో తెలుగు బడులన్నీ నలభై ఏళ్లనాడే మూసేశారు. తాము నిత్యజీవితంలో మాట్లాడే భాషని చదవడం, రాయడం రాని వారి బాధ వర్ణనాతీతం. ముదుకుపల్లె అనే ఒక పల్లెలో ఓ పెద్దాయన్ని కలిశాను. 75 సంవత్స రాలు. పేరు మద్దినేని దొరసామి నాయుడు. అడవి ప్రాంతంలోని వివిధ చెట్లపేర్లను, పక్షుల పేర్లను చక్కటి అచ్చ తెలుగు మాటల్లో చెప్తున్నాడు. ఆ చుట్టుప్రక్కల ఇప్పుడున్న పల్లెల అసలు తెలుగు పేర్లన్నీ ఆయనకు తెలుసు. వెన్నమానుపల్లె, దీపాలపల్లి ఇట్లా. కానీ రాయడం మర్చి అర్ధ శతాబ్దం దాటింది. ఆ విషయం అడిగి, బాధనిపించదా అంటే, 'కండ్లల్లో నుండి నెత్తురు కారుతుంది సామీ, నీరు కాదు' అన్నాడు ఆయన తెలుగులో.. పైపంచెతో కళ్ళొత్తుకుంటూ. అంత పెద్దాయనా అక్షరం కోసం ఆక్రోశిస్తూ కళ్లనీళ్ళు పెట్టుకుంటే నాక్కూడా కడుపులోంచి దుఃఖం పొర్లుకొచ్చింది.

మాటల మధ్యలో రేగడి నీడల్ల పుస్తకం ఆవిష్కరణకు రమ్మని మరీ మరీ ఆహ్వానించాడు రమేశ్.

మరోసారి 2015 నవంబర్ నెలలో ఒకరిద్దరు మిత్రులతో కలిసి వెళ్లాను. దాదాపు రెండు, మూడువందల మంది తెలుగు వాళ్ళు.

వాళ్లలో రైతులున్నారు, కూలీలున్నారు, చిన్న వ్యాపారులున్నారు, పెద్ద పారిశ్రామికవేత్తలూ ఉన్నారు. వాళ్లు తెలుగు భాషలోనే బ్యానర్లు రాయించారు. నవ్వొచ్చినా వారి స్ఫూర్తికి సంతోషమేసింది. సభ మొదలయింది. నేనే అధ్యక్షుడ్ని. ఇంతలో నడవలేని ఓ పెద్దావిడని ఇద్దరు వ్యక్తులు కుర్చీలతో మోసుకొచ్చి ముందు వరసలో కూర్చో బెట్టారు. సవెం. రమేశ్ వేదికనెక్కి ఆ పెద్దావిడ గురించి పరిచయం చేశాడు. 92 సంవత్సరాల వయస్సున్న ఆవిడ పేరు నారమ్మ. అక్కడికి 15 కిలోమీటర్ల దూరంలోని గోమంగళం కొత్తూరు ఆవిడ గ్రామం. ఆ ప్రాంతంలో తెలుగు రాయడం, చదవడం వచ్చిన ఏకైక వ్యక్తి. ఆవిడ పోతే మరెవరూ లేరు; ఇప్పటి 12 సంవత్సరాల సంజనాపద్మం తప్ప. ఈ విషయం రమేశ్ సభకు వివరిస్తుండగా...

నేనీ వ్యాసం మొదట్లో చెప్పిన అపూర్వ విషాద సంఘటన అప్పుడు జరిగింది. సంజన వేదిక మీద నుంచి వడివడిగా వచ్చి పెద్దావిడ దగ్గరకి వెళ్లి పూర్తిగా వంగి తన తలను ఆవిడ పాదాలకు తాకించించింది. కాళ్లను చేతులతో తాకి కళ్లకు అద్దుకుంది. ఒక్కసారిగా సభలో హర్షధ్వానాలు. సభ మొత్తం ఉద్విగ్నభరిత మయింది. ఇప్పుడు నేను రాసినది చదివినా, ఎవరన్నా విన్నా మామూలుగానే అనిపిస్తుంది. కానీ ఆ క్షణాన్ని అనుభవించిన వారికి మాత్రమే అర్థమయ్యే అర్థవంతమైన సందర్భం అది. 92 ఏళ్ల తెలుగు అక్షరానికి అప్పుడే అర విరుస్తున్న అక్షర కుసుమం అందించిన అనురాగ నీరాజనం. ఆప్యాయతపు కౌగిలింత, అదొక అక్షరానుభూతి, అంటే ఆ ప్రాంతంలో మళ్లీ 80 ఏళ్ల తర్వాత తెలుగు అక్షరం వికసించింది. 80 ఏళ్ల చీకటి తొలిగింది. తొలిగింది అని అపూర్వం అందామా, 80 ఏళ్లపాటు అక్షరం చీకట్లో మగ్గినందుకు విషాదం లో మునిగిపోదామా!

ఇప్పటికీ ఎప్పటికీ అర్థంకాని ప్రశ్నే.

సభ ముగిసింది. మర్నాడు ఆ ప్రాంత పల్లెలు తిరిగేందుకు అందరం బయల్దేరాం. దగ్గర్లోని నాయకరాజుల కాలం నాటి చెరువులు, ఆనకట్టలు, ఇంకా వ్యవసాయ భూములకు నీళ్ళు అందిస్తూనే ఉన్నాయి. ఆ డ్యామ్ దగ్గర్లో ఓ పెద్ద మర్రిమాను, దాని చుట్టూ విగ్రహాలు. రాజుగారు, చెలికత్తెలు, భార్యలు– ఇలా వివిధ భంగిమల్లో బొమ్మలున్నాయి. వసంత్ ఆ చరిత్రను వివరిస్తున్నాడు. అది మరీ అంత పాతదేం కాదు. ఆ విగ్రహాల్లో ఉన్నది ఎద్దులప్ప నాయుడు ప్రతిమలు. దగ్గర్లోని జల్లిపల్లెలో పుట్టి, 1820–60ల మధ్య బ్రిటీష్‌వారికి సామంతుడుగా ఉంటూ తరవాతి కాలంలో వారికి ఎదురుతిరిగి బ్రిటిష్ సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టిన బుర్జుబొమ్మ ఎద్దులప్పనాయుడు సంస్థాన ప్రాంతమది. సుమారు ఆ కాలంలోనే మనందరికి బాగా తెలిసిన వీరపాండ్య కట్టబొమ్మన అనబడే గట్టిబొమ్ము వీరపాండ్య నాయుడు కూడా బ్రిటిష్‌వాళ్లకు ఎదురుతిరిగిన ధీరుడు. ఇద్దరూ కొద్ది తేడాలోనే ఉరితీతకు గురయ్యారు. వారిద్దరూ ఆ ప్రాంతపు తెలుగువారంటే ఆశ్చర్యపోవడం మా వంతైంది. అక్కడి నుండి పక్కనే ఉన్న శివాలయం వైపు కదిలాం. నడుస్తున్న దారిలో తెలిసిన వారినందరినీ తెలుగు లోనే పలకరిస్తూ మమ్ముల్ని పరిచయం చేస్తున్నాడు వసంత్. ఇదంతా చూసి ఆశ్చర్యంగా నేను, అంతా తెలుగుమయమే అన్నాను. వెంటనే రమేశ్ అందుకుని, ఇక్కడ సరే రేపు కేరళ వెళుతున్నారుకదా, మీ బంధువుల ఊరి దగ్గరలో ఒట్ట ప్పాలం అనే టౌన్‌లో కూడా ఇరువత్తినాల్ చెట్టియార్ తెలుగు



కుటుంబాలు ఉన్నట్లు సమాచారం. ప్రయత్నం చేయండి అన్నాడు. ఈసారి ఆయన మాటల్లో నమ్మకం కుదిరి, సరే అన్నాను.

తెల్లారి బయల్దేరి కేరళలోని పాలక్కాడ్ మీదుగా అక్కడికి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న వాణియంగులంకి చేరుకున్నాను. అక్కడ మా అత్తయ్య ఉంటుంది. తెల్లారి బయటికి వచ్చి ఆటో కోసం చూస్తున్నా. మనసంతా రెండు రోజుల సంఘటనలతో ముసురు కుంటోంది. తెలుగు అక్షరం చుట్టూ తిరుగుతోంది. మనసంతా అదే ఆలోచన నిండిపోయింది. ఇంతలో ఓ ఖాళీ ఆటో నన్ను దాటింది. దాని వెనక వైపు "నాయుడూస్" అని ఇంగ్లీషులో రాసి ఉంది. చూసి ఉలిక్కిపడ్డాను. ఆటో వెనక పరిగెత్తి ఆపాను. అదెక్కి ఒట్టప్పాలం పోదామని చెప్పి, అసలు విషయం అడిగాను మలయాళంలోనే. ఈ "నాయుడూస్" ఏమిటీ అని. అతనూ మలయాళంలోనే సమాధానం చెప్పాడు. తానూ ఆంధ్ర సి.ఎం. చంద్రబాబు కులమని, మా ఇండ్లల్లో అదే తెలుగు మాట్లాడతామని అన్నాడు. నెమ్మదిగా తెలుగులో మొదలు పెట్టా. వాళ్ల తాత సేలం ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డాడని చెప్పాడు. అప్పుడర్థమయింది, తమిళనాడులోని బలిజనాయుడు కులం వీరిదని. 'ఇంకా మీ కుటుంబాలున్నాయా?' అని అడిగితే, 'రెండు మూడు ఉన్నాయి, అయితే మా పక్క వీధిలో ఇరవై ముప్పై తెలుగు కుటుంబాలున్నాయి,' అని చెప్పాడు. వెతకబోయిన తీగ కాలికి తగిలింది. ఇరువత్తినాల్ చెట్టియార్ కుటుంబాలా అంటే, అవున న్నాడు. అక్కడికి తీసుకెళ్లమంటే, మరో అయిదు నిమిషాల్లో ఒట్ట ప్పాలం బస్టాండుకి వెనక ఓ ఇరుకు సందులోకి తీసుకెళ్లి ఇదే అన్నాడు. బెరుకు, సంకోచాలు ఎప్పుడో వదిలేశాను. తలుపు తట్టి ఓ ఇంట్లో ప్రవేశించా. 70 ఏళ్ల ముసలావిడ మలయాళంలో ఎవరని అడిగితే, నేను వెంటనే ఉడుములపేట తెలుగులో మాట్లాడే ప్రయత్నం చేశాను. ఆవిడ ఆశ్చర్యపోయి, మలయాళ యాస నిండిన విచిత్ర తెలుగులో మాట్లాడుతోంది. నా ఆనందానికి అంతులేదు. ఏమీ సాధించకపోయినా ఏదో తెలుసుకున్నానన్న ఆనందం అది. మీ కుటుంబాలు ఎక్కడ్నించి వచ్చాయని అడిగితే, తమ ముత్తాతలు నుంచి ఈ ఊరే అంది. పక్కింటివాళ్లను పిలిచి నాకు పరిచయం చేసింది. ఏదో తెలియని అవ్యాజమైన బంధుప్రేమ తొణికిసలాడింది. అక్షరం కలిపిన బంధం అది. ఇప్పుడు వాళ్ళు నాకు బంధువులు. ఆమధ్య కేరళ వెళ్లినప్పుడు మళ్లీ పలకరించి వచ్చా.

ఈ విషయం మా అత్త కొడుకుతో చెపితే, "ఈ సంగతి నాకు ఎప్పుడో తెలుసు. ఇరువత్తినాల్ చెట్టియార్లు మాట్లాడే తెలుగు తెలుగు అనిపించక నీతో ప్రస్తావించలేదని, వీళ్లు ఇంకా పెరిందల్‌మన్న ఊర్లోను, చాలామంది కాలికట్ సిటీలోనూ వున్నారు" అన్నాడు. మూర్ఛపోవడం నా వంతైంది.

మళ్లీ అక్కడికి ప్రయాణం పెట్టుకోవాలి.

-డా॥మధురాంతకం నరేంద్ర
98662 43659

మరపురాని వైతాళికుడు

# ఆచార్య జి.ఎన్.రెడ్డి



1988 ప్రాంతంలో, అంటే నేను వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉపన్యాసకుడిగా చేరిన కొత్తల్లో, ఒకనాడు వుదయం పది గంటల ప్రాంతంలో మా ఆర్ట్స్ బ్లాక్ వరండాలోంచీ వెళ్తూండగా అప్పుడే కారు దిగి, తెలుగుశాఖలోకి వెళ్తున్న వుపకులపతి యెదురయ్యారు. తడబడుతూ నేనోనమస్కారం చేసి, మా శాఖవైపుకు వెళ్ళి పోవడానికి ప్రయత్నిస్తూండగా ఆయన నాపేరుపెట్టి పిలవడం వినిపించింది. నేను కంగారు పడుతూనే ఆయనముందుకెళ్ళి నిల్చున్నాను. నాలోని ఆలజడిని ఆయన పట్టించుకున్నట్టులేరు. చేయిచాపి కరచాలనం చేశాక "నిన్న నీ నవలిక **మృగతృష్ణ**" చదివాను. హైదరాబాదు నుంచి రైలులో వస్తూంటే కేతువిశ్వనాథరెడ్డి దగ్గర దొరికిందది. బావుంది అలాగే రాస్తూవుండు. అభినందనలు" అని చెప్పిన ఆయన తన పని ముగిసిపోయినట్టుగా తమశాఖ వైపుకు చకచకానడచి వెళ్ళి పోయారు. నేను యింగ్లీషులో "మప్పిదాలు" అని గొణుగుకోవడం ఆయన చెవినబడివుండదు. నా దగ్గరినుంచీ ఆమాట రావాలన్న అభిలాషకూడా ఆయనకుండదు. అది జి.ఎన్.రెడ్డి గారి స్వభావం. ఆయనకు పనే ముఖ్యం, బాధ్యతలపట్లే ధ్యాస. కొత్తదనాన్ని వెతకడం లోనూ, పరిణితిని గుర్తించడంలోనూ, విజ్ఞాన సముపార్జన కోసం, కొత్తద్వారాలు తెరవడంలోనూ అయనెప్పుడూ ముందుగా వుండేవారు.

తెలుగుశాఖలో సి.పి.బ్రౌన్‌ప్రాజెక్టు అన్నదానిని స్థాపించి, దానికి పాత్రికేయుడూ, పరిశోధకుడూ ఆయిన బండి గోపాలరెడ్డిని (బంగోరె) సంచాలకుడుగా నియమించడమనే పనిని ఆయన తప్ప మరెవరు చేయగలరు? ఆ ప్రాజెక్టులో ఆ తరువాత బంగోరె చేసిన పనేమిటో చరిత్రే చెబుతుంది. 1975-79 ప్రాంతాల్లో బ్రౌన్ ప్రాజెక్టు సాధించిన విజయాలు, చేపట్టిన పనులు, పరిశోధన, బంగోరె పనితనాన్నీ, జి.ఎన్.రెడ్డిగారి పూనికనూ నిరూపిస్తాయి. ఆంధ్రగీర్వాణ ఛందంతో పాటూ బ్రౌను లేఖల్ని గూడా ప్రాజెక్టు ప్రచురించింది.

జి.ఎన్.రెడ్డి గారి ఆధ్వర్యంలో వేంకటేశ్వరా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ గొప్ప సాహిత్యపీఠంగా రూపొందింది. ఆర్ట్స్‌బ్లాక్ సమావేశ మందిరం తెలుగు సాహిత్యానికంతా వేదికగా రూపొం దింది. అక్కడ ప్రసంగించని తెలుగు రచయితలూ, కవులూ యెవరూలేరు. ప్రముఖ సాహితీవేత్తలనంతా ఆయన అతిథి ఆచార్యులుగా ఆహ్వానించారు. పుట్టపర్తి నారాయణాచార్యులనుంచి భుజంగరాయశర్మ గారినుంచీ ఆనేకమంది వారం రెండువారాల పాటూ తిరుపతికొచ్చి, వరసగా వుపన్యాసాలిచ్చేవారు. అప్పుడప్పుడే కొత్త కెరటంలా ముందుకొచ్చిన గుంటూరు శేషేంద్రశర్మగారి వుపన్యాసాల్ని ప్రతిరోజూ మధ్యాహ్నమూ, వారం రోజులపాటూ వినడం మరపురాని అనుభవం. ఆ వుపన్యాసాల భూమికతోనే శేషేంద్రశర్మగారు కవిసేన మేనిఫెస్టో రాశారు. వేమనపైన ఆరుద్ర చేసిన వుపన్యాసాలు ఆ తరువాత పుస్తక రూపంలో వచ్చాయి. దాశరధి వుపన్యాసాలు కూడా గుర్తున్నాయి.

1975-81 ప్రాంతాల్లో భాషాధ్యయన శాఖల్లోని విద్యార్థులు గూడా ప్రతిభావంతులుగా వుండేవాళ్ళు. అన్ని సమావేశాల్లో చురుకుగా పాల్గొనేవాళ్ళు. వాళ్ళ సాధనకు తగిన రీతిలో కావల్సిన బోధననూ, పరిశోధనలనూ, జి.యెన్. రెడ్డిగారు తీర్చిదిద్దేవారు. **చలం రచనల వంటి క్లిష్టమైన చర్చల నుంచీ మినీ కవితావుద్యమం వంటి అధునాతన సమకాలీన అంశాల వరకూ అన్ని అంశాలపైన సాధికారమైన సదస్సులు నిర్వహించిన ఘనత అప్పటి తెలుగుశాఖది.**

తెలుగు శాఖను తెలుగు అధ్యయన శాఖగా రూపొందించిన వారు జి.ఎన్.రెడ్డిగారే! ఇంటిపేర్లు, వూరిపేర్లు మొదలైన వాటి పుట్టుక, స్వభావాలగురించిన గొప్ప సాంఘిక పరశోధనలకు (Onamastics) ఆయన తొలిసారిగా పెద్దపీట వేశారు. భాషకూ సాహిత్యానికీ మధ్య వుండే సంబంధాల్ని గుర్తించడంతో పాటూ చరిత్ర, సంస్కృతుల కివ్వవలసిన ప్రాముఖ్యతను యిస్తూ, సాహిత్య అధ్యయనాల్ని ఆధునిక రీతులవైపుకు నడవడానికి చాలా దోహదం చేశారు. ప్రాచీన సాహిత్యగ్రంథాలకూ, ఛందస్సు, వ్యాకరణాలకు మాత్రమే పరిమితమైన విశ్వవిద్యాలయ సంప్రదాయాలకు భిన్నంగా సాహిత్యానికీ భిన్న, సాంఘిక శాస్త్రాలకూ చెందిన పరస్పర సంబంధమున్న అంశాల పరిశోధనలకు ఆయన దారిచూపారు. సాంఘిక భాషాశాస్త్రం (Socio Linguistics) వాడుకభాషగా తెలుగు, శాసనాధ్యయనం, జానపద సాహిత్యం, ద్విభాషిత్వం, మాండలికభాషలు, నిఘంటు నిర్మాణం, అనువాదం, పాత్రికేయత, సాంఘిక చరిత్ర, సాంస్కృతిక రీతులు, వ్యక్తులపేర్లు, వూర్లపేర్లు గోత్రాలు, మొదలైన అనేకరంగాల్లో విస్తృతమైన పరిశోధనలకు ప్రోత్సహించారు. ఆయన నేతృత్వంలో చిత్తూరు. కడప, అనంతపురం జిల్లాల వూర్లపేర్లనైన, అనేక కులాల్లో వుండే గోత్రాలపైన పరిశోధనలు జరిగాయి. భాషను రచయితలూ, పాత్రికేయులూ ఆధునికరిస్తూంటారని జి.ఎన్.రెడ్డిగారు నమ్మేవారు. తెలుగు భాష, ఇంగ్లీషుభాషంత హాయిగా యితరభాషలనుంచీ పదాలను అరువు తెచ్చుకోగలదని, అది దానికున్న బలంగా కూడా గుర్తించాలనీ ఆయన చెప్పేవారు.

"విదేశీ వస్తువులను బహిష్కరించినంత సులభంగా మనం యితర భాషల మాటల్ని వదిలిపెట్టడం సాధ్యంకాదు. తెలుగు యితర భాషలకంటే సులభంగా యితర భాషల్లోని పదాల్ని స్వంతం చేసుకుంటుంది. అందువల్ల శాస్త్రీయ, వైద్య, సాంకేతికాంశాలను బోధించే మాధ్యమంగా తెలుగు, హిందీ భాషతో పోటీ పడుతోంది" అన్న

ఆచార్య హల్దార్ మాటల్లో జి.ఎన్.రెడ్డిగారి కెంతో విశ్వాస ముండేది.

1928 జూలై 1వ తేదీన జి.ఎన్.రెడ్డిగారు చిత్తూరు సమీపంలోని మహాసముద్రం అనే కుగ్రామంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టారు. తెలుగులో ఎమ్మే, ఎమ్‌లిట్, పి.హెచ్డీ పట్టాను, మదరాసు విశ్వ విద్యాలయం నుంచీ పొందారు. తన పీహెచ్డీ సిద్ధాంత వ్యాసంలో ఆయన సంస్కృత, హిందుస్థానీ, ద్రావిడభాషల్లోని సమానార్థకపదాల గురించి చర్చించారు. పూతల పట్టు శ్రీరాములు రెడ్డి, రామానుజులు రావు నాయుడు, శ్రీనాం వేంకటభుజంగరాయశర్మ, రామలింగశాస్త్రి వంటివారు ఆయన గురువులు. **ఆరోజుల్లో తెలుగు పీహెచ్డీ సిద్ధాంత గ్రంథాలు కూడా యింగ్లీషులోనే రాసేవారు. జి.ఎన్.రెడ్డిగారు ఎమ్‌లిట్; పీహెచ్డీ సిద్ధాంత గ్రంథాలు యింగ్లీషులోనే రాశారు.** అయితే తాను శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధిపతి అయిన తర్వాత ఆయన సిద్ధాంత గ్రంథాలను వ్యావహారిక భాషలో రాయడానికి ప్రోత్సహించారు.

అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో అతిధి ఆచార్యులుగా వున్నప్పుడు ప్రసిద్ధ సాహితీ విమర్శకుడు ఆచార్య చేకూరి రామారావుగారూ, ప్రముఖ ఆంగ్ల పండితుడు అడపా రామకృష్ణరావు గారూ ఆయనకు స్నేహితులయ్యారు. చేకూరి రామారావుగారొకచోట రాస్తూ జి.ఎన్.రెడ్డిగారు రాసినదంతా బంగారమేనంటారు. మాడిసన్ లో వున్నప్పుడు జీ.ఎన్.రెడ్డిగారు డౌన్‌మాట్సన్‌తో కలసి తయారు చేసిన తెలుగు వాచకాలను ఆ విశ్వవిద్యాలమే ప్రచురించింది. ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు పద్ధతిలో ఆయన తెలుగు-ఇంగ్లీషు ద్విభాషల నిఘంటువును తయారుచేశారు. దాన్ని 1978లో తెలుగు అకాడమీ ప్రచురించింది. తెలుగులో ప్రప్రథమంగా నాలుగు భిన్న నిఘంటు వులను తయారుచేసిన వాడాయన. కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, కంసాలి వంటి వృత్తుల పదాల నిఘంటువునూ, గ్రామీణ వైద్యానికి సంబంధించిన నిఘంటువునూ, ఆయన సంపాదకునిగా వెలువరించారు. దాన్ని అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించింది.

జి.ఎన్.రెడ్డిగారొక అపురూపమైన మానవతావాది. 1974లో బల్గేరియాకు సాంస్కృతిక ప్రతినిధిబృందసభ్యునిగా వెళ్ళినప్పుడు ఆయన వాళ్ళకు వ్యక్తిగత స్వాతంత్రం వుండవలసినంత లేదు నిజమే! కానీ వాళ్ళకు ఆహారమూ, వుద్యోగాలూ, మొదలైన ప్రాథమిక సౌకర్యాల కొరత యేమాత్రమూ లేదు. వాళ్ళకున్న అతి తక్కువ వనరులతో మనకున్న గొప్ప వనరులను పోల్చిచూసినప్పుడు, నేను చాలా రోజులపాటు బాధతో విలవిలలాడిపోయాను. ఇంత సంపద వున్నా మన వాళ్ళెందరో బీదరికంలో అనారోగ్యంతో బాధపడుతున్నారు. రైతులకూ, గ్రామాలకూ ఆశనిపాతంలా తయారైన మన నకిలీ ప్రజాస్వామ్య బూటకంపైన విరక్తి కలిగింది. స్వార్థపరులైన దుర్మార్గ రాజకీయ నాయకులూ, వాళ్ళను పూజించే మూర్ఖ ప్రజలూ యీ దురవస్థకు కారకులు" అని తన అనుభవాల్లో రాసారు. ఆయన మాటలు స్వాతంత్ర్యం వచ్చిన అయిదారు దశాబ్దాల్లోనే భారతదేశంలో వచ్చిన మార్పుల్ని స్పష్టంగా విప్పి చూపడంతోపాటూ, యిప్పటికైనా మనమంతా ఆత్మవిమర్శ చేసుకోవల్సిన అవసరాన్ని గుర్తుచేస్తాయి.

జీఎన్‌రెడ్డిగారు యీలోకాన్ని వదలిపెట్టి దాదాపుగా రెండు దశాబ్దాలు గావస్తోంది. ఆయన వ్యక్తిత్వమూ, ఆయన రచనలూ యిప్పటికీ, యెప్పటికీ స్ఫూర్తిదాయకంగానే వుంటాయి.

# తెనుగులెంక సూక్తులు-23



*ఔచితి నెరుగని వానికి*
*నైచికి నదలించి శునికి నతు లర్పింపం*
*జూచెడు వారికి ధర్మువు*
*ద్రోచెడు వారికి నొసంగుదురె దొరతనముల్॥*

'తెనుగు లెంక' 'అభినవ తిక్కన'
**తుమ్మల సీతారామమూర్తి.**

ప్రభువుగా ఉండేవాడు ఉత్తముడై ఉండాలి. ప్రజాస్వామ్యంలో రాజులు ఉండరు కాబట్టి రాజ్యాధికారం పొంది పాలించేవారు ఉత్తములై ఉండాలి. ఎన్నికలు జరిగేవేళ తమ భవిష్యత్తు బాగుంటుందని ఎన్ని కలలో కంటూ ప్రజలు నాయకులను ఎన్నుకుంటారు. అధికారం అప్పనంగా అప్పగిస్తారు. ప్రజలు నాయకుని గుణగణాలను గుర్తించకుండా, కులమతాలకో, ధనానికో లొంగిపోయి అధికారం అప్పగిస్తే తరువాతి కాలంలో అగచాట్లు పడవలసి వస్తుంది.

ప్రభుత్వాధినేతగా ఉండదగిన నేతకు మొదటి లక్షణం ఔచిత్యం ఎరిగి ఉండడం. ఔచిత్యమంటే ఏది మంచిదో, ఏది కాదో తెలిసి ఉండడం. నాయకునికి ఏ పనిచేస్తే ప్రజలకు ఉపయోగపడుతుందో, ఏ పనిచేస్తే ప్రజలు నష్టపోతారో తెలిసి ఉండాలి. అంతేకాదు, ప్రజోపయోగ కార్యక్రమాలను నిర్వహిస్తూ, నిరుపయోగమైన కార్యక్రమాలకు ప్రజాధనం వెచ్చించకుండా ఉండాలి. కాని ఇప్పుడు ప్రభుత్వాలను పరికిస్తే కొన్ని పనులు మాత్రమే ప్రజలకు మేలు కలిగించేవి. అనేకమైన పనులు తమకు ఆదాయాన్ని అందించేవేగాని, అందరకూ ఉపయోగపడేవి కాదనేది సుస్పష్టం. ప్రజలందరికి ప్రయోజనం కలిగించేవి కాకపోయినా, ఓట్లకోసం ఒక వర్గానికి ప్రయోజనం కలిగించేవి, మిగిలిన వారికి నష్టం కలిగించేవి అయిన పనులు చేయడానికి నాయకులు వెనుకాడడంలేదు. అలాంటి వారిని ఎన్నుకోకుండా, ఔచిత్యం తెలిసిన వారిని ఎన్నుకుంటే ప్రగతి సాధ్యమవుతుంది. ప్రజలకు మేలు జరుగుతుంది.

గోవులలాగ పవిత్రమైనవారు బాధపడుతుంటే కుక్కలలాగా నాయకుల వెనుక తోకలు ఆడించుకుంటూ తిరిగేవారంతా ప్రయోజనం పొందుతారు. ధనసంపాదనమీద యావ, దౌర్జన్యం చేయాలనే తలంపు ఉన్నవారిని నాయకులుగా ఎన్నుకోకూడదు.

నాయకునికి ధర్మం తెలిసి ఉండాలి. ధర్మం తెలిసి ఉండడం మాత్రమే కాదు, అధర్మం చేయకూడదని, ధర్మాన్ని మాత్రమే ఆచరించాలనే సద్బుద్ధి ఉండాలి. ధర్మాచరణమీద అభిలాష లేనివాడు అధికారం అందుకుంటే, ఆ ప్రాంతంలో ధర్మం అడుగంటుతుంది. అరాచకం చోటుచేసుకుంటుంది. సమాజం పతనమవుతుంది. సమాజంలో అసమానతలు పెరిగి, మనిషిని మనిషే దోచుకుంటాడు. అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడతాయి. ధర్మం తెలిసినవాడు ఎంపికయితే రాజ్యం శాంతికి నిలయమౌతుంది. ప్రజలు సుఖసంతోషాలతో నిశ్చింతగా బ్రతుకుతుంటారు. కాబట్టి మనం ఎన్నుకునే వ్యక్తికి ధర్మం తెలిసి ఉండాలి. ధర్మబద్ధంగా పాలించాలనే తలపు ఉండాలి. అటువంటివారిని ఎన్నుకుంటేనే సమాజం, దేశం శాంతి సౌభాగ్యాలతో నివాసయోగ్యంగా ఉంటుంది.

అందుకనే తుమ్మలవారు "ఔచిత్యం అంటే ఏమిటో తెలియని వారికి, ఉత్తమమైన గోవులను అదలించి, కుక్కలకు నమస్సులు చేసేవారికి, ధర్మం అంటే తెలియక అధర్మాన్ని ఆచరించేవారికి పెత్తనం అప్పగించకూడదు" అన్నారు.

**-డా॥నాగభైరవ ఆదినారాయణ**
చరవాణి: 98497 99711




# 2. దేవుడు - జీవుడు

'ఎవరో ఒక వ్యక్తి ఈ చరాచర సృష్టిని ఒక చోట కూర్చొని చేస్తూ ఉంటాడు. ఈ సృష్టిని నడిపిస్తూ ఉంటాడు' అనే వాదాన్ని బుద్ధుడు అంగీకరించలేదు. అందుకే బుద్ధుణ్ణి నిరీశ్వర వాది అంటారు. మామూలు భాషలో చెప్పుకోవాలంటే "దేవుడు"లేడు అనేది బుద్ధుని సిద్ధాంతం.

అసలు దేవుడంటే ఎవరు? "దేవుడు" అనే భావం మనిషికి ఎప్పుడు? ఎందుకు? ఎలా? వచ్చింది అనేదాన్ని విశ్లేషించుకుంటే బుద్ధుడు ఎందుకు దేవుణ్ణి అంగీకరించలేదో అర్థమవుతుంది. ఈ ప్రపంచాన్ని దేవుడే సృష్టిస్తే ..దాన్లో "పరిణామం" ఉండాల్సిన పని లేదు. మన కంటికి కనిపించే ప్రతి వస్తువులో ...ప్రతి జీవిలో... ప్రతి మనిషిలో....ప్రతి సమాజంలో .... మార్పుమనకి కనిపిస్తూనే ఉంటుంది. వందేళ్ళ క్రితంనాటి వస్తువులు ఇప్పుడు లేవు. ఏభైఏళ్ళ నాటి సమాజాలు ఇప్పటికీ అలాగే మారకుండానూ లేవు. పదేళ్ళ నాటి మనమూ అలాగే లేము. నిన్న నేడు కాదు. గత క్షణం ఈక్షణం కాదు. ప్రతి విషయంలో మార్పు నిరంతరంగా వస్తూనే ఉంది. మార్పు వచ్చినకొద్దీ వాటిల్లో రానురాను నాణ్యత, పనితనం పెరుగుతూనే ఉంది.

ముప్పైఏళ్ళనాటి మనుషుల మనోసామర్థ్యం కంటే ఇప్పటి మనుషుల మనోసామర్థ్యం ఎక్కువ.

ఆముదం దీపాల పొగచూరిన కంపుతో ఉండే ఒకనాటి దేవాలయాలు ఈ రోజున డిస్కోలైట్లతో, ఫ్లెడ్‌లైట్లతో, లేజర్ కాంతులీనుతూ వెలిగిపోతున్నాయి. 50ఏళ్ళ క్రితం లేని కొత్తదేవుళ్ళు ఎందరో పుట్టుకొచ్చారు. వారికీ పాలరాతి దేవాలయాలు వచ్చేశాయి. వాటిని చూసి పురాతన రాతిదేవాలయలు తిరిగి పాలరాతి ఆలయాలుగా పునరుద్ధరించబడుతున్నాయి. ఇలా ... ప్రతి విషయం... మారుతునే ఉంది. మారనిదంటూ ఏముంది? దేవుడే కనుక ఈ సృష్టిని సృష్టించి ఉంటే దీనిలో మార్పు అనివార్యం కాకూడదు. మారుతూ ఉన్నదంటే దానిలో 'పరిణామమే ఉంది'.

ఇక మరోవిషయం, ఈ సృష్టి పూర్తిగా దేవునిదే అయితే, మనం చేసే మంచికి గానీ, చెడుకుగానీ మన బాధ్యత ఉండదు. పూర్తి బాధ్యత ఆయనదే. ఏదైనా దేవుని నిర్ణయం ప్రకారమే జరగాలి తప్ప మనం నామమాత్రమే!

**చంపేదెవడు? చచ్చేదెవడు?**

"చంపేదెవడు? చచ్చేదెవడు? అన్నీనేనే" అని దేవుడు చెప్పాడని- ఒక హంతకుడు హత్యచేసివచ్చి 'చంపింది నేనుకాదు నా నుదుటిరాత అలాఉంది. చచ్చింది వాడుకాదు. వాడి రాత ప్రకారము అలా జరిగింది. దేవుడు చేసిన దాన్ని, దేవుడు రాసిన దాన్ని అమలు చేశాను. అంతే, నా దోషం లేదు" అంటే... ఈ దేశంలో కాదు... ప్రపంచంలో ఏదేశంలోనూ అతణ్ణి 'హంతకుడు కాదు దైవ కార్యాన్ని నెరవేర్చిన వాడు' అని మెచ్చుకొంటారా?

అందుకే.... ఈ మంచీ చెడులు మనవి కాదు, దైవాధీనాలు అనుకుని వదిలేస్తే, మానవ సమాజం సర్వనాశనం అయిపోతుంది. మంచీ చెడులకు, శిక్షలకు, శిక్షణకు, నైతికతకు, నీతి నియమాలకు అర్థంలేకుండా పోతుంది.

ఇది దైవసృష్టి అని అనుకుంటే...ఈ మంచీ చెడులకు బాధ్యత దేవుడే తీసుకోవాలిగాని, మనిషికి ఏలాంటి సంబంధం ఉండ కూడదు. ఒక మనిషి పశువులా ప్రవర్తించినా, పరమ నీచంగా బ్రతికినా దానంతటికీ దేవుడే జవాబుదారీ కావాల్సి ఉంటుంది. అప్పుడు ఇక సంస్కారాలకి, నాగరికతలకి, సంస్కృతికీ విలువే వుండదు. వాటి అవసరమూ ఉండదు. నైతిక ప్రబోధాలతో పనే ఉండదు.

కానీ, తాను చేసిన మంచీ చెడులకి, నైతిక అనైతిక చర్యలకు, హింసా అహింసలకు మనిషే జవాబుదారీ కావాలి. అప్పుడే సమాజానికి నైతిక విలువలు అవసరం అవుతాయి. చెడునుండి మంచి వైపుకు సమాజం 'మరలడం' ఉంటుంది. 'మారడం' ఉంటుంది.

తాను చేసే పనులకు, మంచీ చెడులకు 'మనిషే జవాబుదారి' అని బుద్ధుడు చెప్పాడు. అందుకే 'దేవుణ్ణి' తిరస్కరించాడు.

మనం ప్రతి విషయంలోనూ రెండు గుణాల్ని చూస్తాం. ప్రతి విలువా ద్వంద్వమే. మంచీ-చెడు, హింస-అహింస, నీతి-అవినీతి, ఇలా... ఒక వేళ మనం దేవుణ్ణే సృష్టికర్తగా అంగీకరిస్తే ....ఈ 'ద్వంద్వాల్ని' అంగీకరించకూడదు. అంగీకరిస్తే 'ద్వంద్వ ప్రవృత్తిగల వాడు దేవుడెలా అవుతాడు?' అనే ప్రశ్న వెంటనే ఎదుటకొచ్చి నిలబడుతుంది?

దేవుడు మంచివాడా? చెడ్డవాడా? దుర్మార్గుడా? సన్మార్గుడా? క్రూరుడా? శాంతి స్వరూపుడా? హింసా వాదా? అహింసా వాదా? ఇదిగో ఇలాంటి విషయాల్ని తేల్చుకోవాల్సి ఉంది. మంచితో పాటు చెడుకూడ దేవుని స్వాభావిక లక్షణం అనుకుంటే..ఇక అలాంటివాడు 'దేవుడెలా అవుతాడు?' ఇలా అనేక రకాలుగా తర్కించుకొంటే 'దేవుని' విషయంలో తేల్చుకోలేని సమస్యలెన్నెన్నో వచ్చిపడతాయి.

దేవుడు అనేది 'నమ్మకం' అయితే వేరు. 'నేను నమ్మాను 'అంతే'

అనుకోవడం వేరు. కానీ దాన్ని తర్కంగా గానీ, తత్త్వంగా గానీ నిరూపించలేం. ఔనని అంగీకరించలేం.

అందుకే.... నమ్మకం నమ్మకమే! నిజం నిజమే!

బుద్ధుడు ప్రత్యక్ష ప్రమాణాన్ని నమ్మే శాస్త్రీయవాది. శాస్త్రానికి, శాస్త్రీయానికి నమ్మకంతో పనిలేదు. కాబట్టి దేవుని విషయంలో ఆయనకి ఏలాంటి నమ్మకం లేదు.

నిరూపణకి సాధ్యంకాని విషయాల్ని నెత్తికెత్తుకోవాల్సిన పనిలేదని చెప్పిన బుద్ధుడు-దేవుణ్ణి ఎలా అంగీకరిస్తాడు? నిరంతరం ఈ సృష్టి పరిణామశీలి అని ప్రబోధించిన బుద్ధుడు ఈ సృష్టిని ఎవరో ఒకరు సృష్టించాడని ఎలా విశ్వసిస్తాడు? విశ్వసించమని ఎందుకు చెప్తాడు?

అందుకే బుద్ధుడు నిరీశ్వర వాది.

శాస్త్రీయత అంటేనే ప్రయోగశీలతగలది అని. నిరూపణకి సాధ్యం అయ్యేది. నిరూపించలేనిదానిని శాస్త్రీయం అనలేం. అనకూడదు. ఏలాంటి నర్మగర్భితం, దాపరికం, గుట్టు శాస్త్రీయతలో ఉండవు. 'దాన్ని మనం ప్రశ్నించకూడదు' అనే నిబంధనలూ ఉండవు.

పరీక్షకు నిలబడడం.... పరీక్షద్వారా నిర్ధారణ చేయడం శాస్త్రీయ అంశాల్లో మొదటిది. మనం తినే అన్నమైనా, దేవునికి పెట్టే నైవేద్యమైనా... మనం వండాల్సిందే! మన పొయ్యిమీద వండాల్సిందే! మన పాత్రతో వండాల్సిందే!

**'దేవుడు' అనే భావన ఎలా కలిగిందో చూద్దాం!**

ఇది చూడాలంటే మనం 'కర్త, కర్మ' అనే రెండు విషయాల్ని చర్చించుకోవాలి. చాలా మంది కర్త, కర్మ ఒకటే అనుకుంటారు.

అవి రెండూ ఒకటి ఎలా కాదో చూద్దాం.

ప్రశ్న: రేడియో కనిపెట్టింది ఎవరు? జవాబు: మార్కొని.

ప్రశ్న: విమానం కనిపెట్టింది ఎవరు? జవాబు: రైట్ సోదరులు.

ప్రశ్న: కంప్యూటర్ కనిపెట్టింది ఎవరు? జవాబు: చార్లెస్ బాబేజ్...

ప్రశ్న: సినిమా ప్రొజెక్టర్‌ని కనిపెట్టింది ఎవరు? జవాబు: థామస్ ఆల్వా ఎడిసన్.

ఇలా చెప్పుకుంటూ పోతే..... మనం ఉపయోగిస్తున్న ప్రతి వస్తువునూ ఎవరో ఒక వ్యక్తి కనిపెట్టాడని చెప్పుకుంటాం.

మరి ఈ ప్రశ్నలు చూడండి:

ప్రశ్న: కాగితాన్ని కనిపెట్టింది ఎవరు? జవాబు: చైనావారు

ప్రశ్న: నిప్పు కనిపెట్టింది ఎవరు? జవాబు: ఆదిమానవుడు!

ఇలా... వ్యక్తులు కాకుండా చెప్పే జవాబులూ ఉంటాయి. వీటికి ఏ జాతో, ఏ దేశమో, ఏ ప్రాంతమో ఏదో ఒక దాన్ని చెప్తాం.

ఇలా వస్తువుల్ని కొత్తగా తయారు చేసిన వారు 'సృష్టికర్తలు'. ఆ వస్తువుల్ని తిరిగి తయారు చేసేవారు 'కర్తలు'

ఈ కర్తృత్వం సమూహాలకి కూడా(మనదేశంలో కులంగా) ఉంటుంది. కుమ్మర్లు కుండలు, మేదర్లు బుట్టలు, నేత పనివారు బట్టలు తయారు చేస్తారు.

మరి అలాగే అసలు ఈ వస్తువులేవీ లేని మానవ సమాజాలు, తెలియని సమాజాలు కూడా ఉన్నాయి. అవి పాతరాతి యుగపు పూర్వము సమాజాలు- ఆనాటి ఆదిమ ఆటవిక మానవులకి వస్తువుల ఉత్పత్తే తెలియదు.

కాబట్టి ఆ సమాజాల భావజాలంలో, వారి ఆలోచనల్లో 'కర్త అనేవాడు ఒకడుంటాడు' అనే ఆలోచనకు తావే ఉండదు.

అలాంటి సామాజంలోని వారికి దాహం వేసినప్పుడు ఆకు దోనెల్లోనో, ఎండిన కాయల డొప్పల్లోనో, తినిపారేసిన మనిషి పుర్రెల్లోనో నీటిని పట్టుకొని తెచ్చి తాగడమే తెలుసు. నీటి వినియోగానికి ఉపయోగించిన ఈ దోనెలు, డొప్పలు, పుర్రెడిప్పలు- ఇవేవీ మనిషి రూపొందించుకున్నవి కాదు. ప్రకృతిలో దొరికిన వాటిని ఉపయోగించుకున్నవే! ఇది ఒక సామాజిక దశ.

ఇక, దీనికంటే ఇంకా ఇంకా వెనక్కి పోతే....పశువుల్లా నీరు దొరికే స్థావరానికి పోయి నీటిని తాగడమే తెలుసు. దోనెలతో, డొప్పలతో, డిప్పలతో నీరు తెచ్చుకొని తాగడం వారికి తెలియదు. కాబట్టి వారి భావాల్లో 'కర్త'లు ఉండరు. కర్తృత్వాలు ఉండవు.

అంటే... పశుసమూహాలకు గానీ, పురాతన మానవ సమాజాలకు గానీ 'కర్త' అనే భావనే ఉండదు.

**మానవ సమాజంలో వస్తువినియోగంతోనే నాగరకత అనే విత్తనం పడింది.** అలాంటి వస్తువుల్ని 'తనకు తానుగా తయారు చేసుకోవడంలో' ఆ విత్తనం మొలకెత్తింది. అప్పుడే 'కర్తృత్వం'పుట్టుకొచ్చింది. 'కర్త'లూ పుట్టుకొచ్చారు. ఈ 'కర్తృత్వాలు' 'కర్తలు' అనే భావన నాగరక సమాజంలోనే సాధ్యపడుతుంది. అంతకు ముందున్న సమాజాల్లో సాధ్యం కాదు.

## కర్త- సృష్టికర్త

అంటే...

వస్తువుల ఉత్పత్తి ఎరిగిన సమాజాల్లోనే 'కర్తల' గురించిన ఆలోచన ఉంటుంది కాబట్టి...

కుండలు చేయడానికి ఒకడున్నట్టే....బుట్టలు నేయడానికి ఒకడున్నట్టే....కనిపించే ఈ చెట్టు చేమా, మట్టీగుట్ట, మనిషి జంతువుల్ని తయారు చేసేవాడు కూడా ఒకడుండాలి గదా? అనే ఆలోచన వస్తుంది. అలా 'సృష్టికర్త' అన్న భావన మొదలైంది.

నోటితో నీళ్ళు తాగే పశువులకు 'సృష్టికర్త' అనే భావన ఉండదు. రాదు.

డొప్పల్లో నీళ్ళు తాగిన ఆటవిక మానవునికీ 'సృష్టికర్త' అనే భావన రాదు.

కుండలు తయారు చేసుకుని, వాటితో నీటిని వినియోగించుకొన్న మానవులకే 'సృష్టికర్త' అనే భావనలు వస్తాయి. అలాంటి వారి భావజాలంలోనే 'కర్త'లు అనే భావం పుడుతుంది.

బౌద్ధం 'కర్త'ల్ని అంగీకరించదు. సృష్టికర్తనీ అంగీకరించదు.

కుండలు చేసేవాడు ఒకడున్నాడు గదా! కుండలు మంత్రాలకో, మాయలకో ఊడిపడవు గదా! 'కర్తను' అంగీకరించకపోతే ఎలా? ఎలాగంటే.....

మనం ఒకసారి ఈ వ్యాసంలో మొదటగా చెప్పుకున్న ప్రశ్న జవాబుల దగ్గరకు వెళ్దాం. అందులో ఒక ప్రశ్న చూద్దాం.

ప్రశ్న: కంప్యూటర్ కనిపెట్టింది ఎవరు?

జవాబు: చార్లెస్ బాబేజ్.

ఇది నిజంగా నిజమా? బాబేజ్ ఒక్కడే కంప్యూటర్ ఆవిష్కరణ చేశాడా? లేదు. మరి, ఆయనేం చేశాడు? ఈ వివరాలు చూద్దాం.

1833లో బాబేజ్ ఏంచేశాడంటే...'జాక్వార్డ్ పంచ్‌కార్డ్' విధానాన్ని

ఉపయోగించి, అనేక గేర్‌చక్రాల సాయంతో ఒక 'గణిత కలన యంత్రాన్ని' రూపొందించాడు, ఇది నేడు ఆధునిక కంప్యూటర్స్ వచ్చిన వందేళ్ళకు ముందు. ఒక మిషిన్‌తో 20 అంకాల సంపుటితో గణిత పరికర్మలు చేయడం మానవ చరిత్రలో అదే మొదటిసారి. కాబట్టి ఆయన కంప్యూటర్స్ సృష్టికర్తగనూ, కంప్యూటర్స్ పితామహుని గానూ చెప్తుకుంటారు. కానీ, అది కంప్యూటర్ కాదు. ఆ తర్వాత... ఆయన శిష్యురాలు అడబైరన్ దాని సామర్థ్యాన్ని 50 అంకెలకు పెంచింది. దానిలో సంకేతాలకు 'కోడ్' భాష ఉపయోగించింది. ఇన్‌పుట్, అవుట్‌పుట్ విభాగాలు రూపొందించింది. ఒక ప్రోగ్రాం తయారు చేసింది.

ఈ ప్రోగ్రాంలని హొల్లేరిత్ అనే శాస్త్రవేత్త మరింత మెరుగుపరచి, గణితకలన యంత్రానికి వేగం పెంచాడు. 1896లో ఐబిఎం సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత..

హోర్వర్డ్ అయికిన్ అనే వ్యక్తి బాబేజ్ యంత్రానికి విద్యుదయ స్కాంత వలయాలు రూపొందించాడు. ఆ తర్వాత 1937లో ఎట్నాసాఫ్ అనే శాస్త్రవేత్త విద్యుత్ వలయాలకి బదులు 'వాక్యూమ్ ట్యూబ్'లు రూపొందించాడు. ఇలా ఎలక్ట్రాన్ యంత్రం తొలిసారి రూపొందింది.

1945లో వాన్‌నూమన్ అనే శాస్త్రవేత్త బైనరీ సంఖ్యా విధానాన్ని ఉపయోగించాడు. దాన్ని మరింత మెరుగుపరచి ఎట్నాసాఫ్‌తో కలసి, బెర్రీ అనే శాస్త్రవేత్త 1946లో మొదటిసారి డిజిటల్ కంప్యూటర్ రూపొందించాడు. ఆ తర్వాత 1948లో వాక్యూమ్ ట్యూబులకు బదులు ట్రాన్సిస్టర్ పరికరాల్ని వాల్టర్, బార్డీన్, షాక్‌లీ అనే ముగ్గురు రూపొందించి కంప్యూటర్ సైజుని, ఖర్చుని తగ్గించి, వేగాన్ని పెంచారు. **ఇక 1960లో సిలికా(ఇసుక)తో తయారు చేసిన 'చిప్స్' రూపొందించడంతో కంప్యూటర్లు అన్నీ ఒక చిన్న సైజుకి వచ్చేశాయి- అనేక పనులు చేయగలుగుతున్నాయి-**

మనం ఇప్పుడు చెప్పుకున్నవన్నీ బాబేజ్ తర్వాత జరిగిన తతంగం. మరి బాబేజ్‌కి ముందు.......

1550లో జాన్ నేపియర్ కొన్ని చువ్వల్ని నిలువుగా గుచ్చి, వాటిమీద మూలలుగా అంకెలు వేసి తేలిగ్గా గణిత పరికర్మలు చేసే విధానాన్ని రూపొందించాడు. ఆ తర్వత స్కీఫెడ్ అనే వ్యక్తి 11 పూర్తి చక్రాలు, 8 అసంపూర్తి చక్రాలతో ఒక యంత్రాన్ని రూపొందించి దాని సహాయంతో గణిత ప్రక్రియలు చేశాడు.

వాటి ఆధారంగా 1642లో ఫాస్కల్ అనే శాస్త్రవేత్త చక్రాలతో గేర్‌లు తయారుచేసి అంకెలకు స్థాన విలువలు, కూడికలు, తీసివేతలు అనే రెండురకాల గణిత పరికర్మలే చేశాడు. ఒకట్ల స్థానంలో ఉన్న చక్రం పది చుట్లు తిరగ్గానే పదుల స్థానంలోని చక్రం ఒక చుట్టు తిరుగుతుంది - ఈ విధానాన్ని ఈ నాటికీ గడియారాల్లో, స్పీడో మీటర్లలో ఉపయోగిస్తున్నారు. ఫాస్కల్ యంత్రాన్ని 1673లో గాట్‌ఫీల్డ్‌లెబ్రితో అనే శాస్త్రవేత్త మరింత మెరుగుపరచి దానిలో హెచ్చవేతలు, భాగహారాలు చేయగలిగాడు.

ఆ తర్వాత ఎన్నదగిన కృషి విలియం జాక్వార్డ్‌ది. ఈయన నేతపనివాడు. తాము ఉపయోగించే మగ్గంలోని రంధ్రాలను ఉపయోగించి 1801లో అద్భుత గణన యంత్రాన్ని రూపొందించాడు. దీన్నే పంచ్ కార్డ్ అంటారు. ఇదే కంప్యూటర్ 'చిప్'కు మూలం.

ఇదీ....చాలా కొద్దిగా కంప్యూటర్ చరిత్ర.

ఇప్పుడు చెప్పండి-చార్లెస్ బాబేజ్‌తోనే కంప్యూటర్ నిర్మాణం మొదలైందా? ఆయనతోనే ఆగిపోయిందా?

అసలు కంప్యూటర్‌కి మూలం మనచేతి వ్రేళ్ళు. చైనావారి అబాకస్‌లు కూడా. ఇలా చూస్తే... దీనిలో 'ఇదే మూలం' అని తేల్చలేం...ఇన్ని కారణాలు కలిస్తేనే ఇప్పటి కంప్యూటర్ వచ్చింది. దీనికి మరిన్ని కారణాలు జోడవుతూ ఉంటాయి. అది మరింత కొత్త రూపం తీసుకుంటూ ఉంటుంది.

కాబట్టి....'కంప్యూటర్' అనే వస్తువుకి ఇతనే 'కర్త' అనే వారెవరూ ఉండరు.

అది ఒక సామూహిక కర్తృత్వం. అనేక మంది కృషి ఫలితం. ప్రతి అడుగులో మెరుగులు దిద్దుకున్న వైనం. దానికి ఒకవ్యక్తిని ఇతనే కర్త అని నిర్ధారించలేం. బుద్ధుడు చెప్పింది కూడా ఇదే. ఆయన 'కారణ సమూహమే ఒక కార్యం' అంటాడు. కాబట్టి అందులో ఏదో ఒక సిద్ధాంత కర్తకి ప్రత్యేక ప్రాధాన్యత ఉండదు. మనం కంప్యూటర్నే కాదు.. సైకిలు, కారు, టేబులు, కుర్చీ, కుండ....ఇలా దేన్ని తీసుకున్నా -వాటికి ఎవరో ఒకే ఒక వ్యక్తి 'కర్తగా' ఉండదు. అన్నీ పరిణామం చెందుతూ వచ్చినవే.

అంటే... జ్ఞానం ఏ ఒక వ్యక్తికో 'స్వంత' ఆస్తి కాదు. అది అనంత సమూహాలు అందించిన మహాఫలం. అంటే.. ఏవ్యక్తీ ఎలా కర్తకాలేడో, అలాగే సర్వజ్ఞుడూ కాలేదు.

(తరువాయి వచ్చేసంచికలో)



## ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల్లో తెలుగు పలుకులు

కేంద్ర ప్రభుత్వ పౌరవిమానయాన శాఖామాత్యులు పి. అశోక్ గజపతిరాజు ఒక ప్రకటనలో ఆంధ్ర ప్రదేశ్‌లోని ఐదు విమానాశ్రయాల్లో ఇంగ్లిష్, హిందీ తోపాటుగా తెలుగులో కూడా పబ్లిక్ అనౌన్స్‌మెంట్లు ఉంటాయని తెలిపారు.

ఫిబ్రవరి 16న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు వ్రాసిన ఒక లేఖకు స్పందిస్తూ ఈ ప్రకటనను మే 25న అధికారికంగా విడుదల చేశారు.

-చలసాని నరేంద్ర
98495 69050

# డిజిటల్ లావాదేవీల భద్రతను ప్రశ్నిస్తున్న సైబర్ దాడులు

ప్రపంచ వ్యాప్తంగా ఈ మధ్య కాలంలో వన్నాక్రై పేరుతో జరిగిన తొలి అతి పెద్ద సైబర్‌దాడితో వివిధ దేశాల్లోని పలు వ్యవస్థలు కలవరపడుతున్నాయి. 150 దేశాల్లోని మూడు లక్షల కంప్యూటర్లను ధ్వంసం చేసిన ఈ సైబర్ దాడి -డిజిటల్ సమాచారం భద్రత పట్ల- గతంలో ఎన్నడూ లేనన్ని అనుమానాలను కలిగిస్తున్నాయి.

భారతదేశంలో దీని ప్రభావం లేనప్పటికీ సాఫ్ట్‌వేర్ సంస్థలు, వివిధ కంపెనీలు, నెట్ యూజర్లు కొంత ఆందోళనలో ఉన్నారు. డెబిట్, క్రెడిట్ కార్డులతోపాటు ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ తదితర అందుబాటులో ఉన్న సేవలను ఉపయోగించు కుంటున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది.

ఇంటర్‌నెట్‌తో జరిగే లావాదేవీల విషయంలో సైబర్ చీటర్లు అనేకరకాల మోసాలకు పాల్పడుతున్నారు. **ప్రపంచాన్ని వణికించిన సైబర్ దాడికి పాల్పడింది ఉత్తర కొరియా గూఢచార సంస్థ ఆర్జీబీకి అనుబంధంగా పనిచేస్తున్న యూనిట్-180 అనే ప్రత్యేక విభాగం అని స్పష్టం అవుతున్నది.** ఈ విభాగం కేవలం ఆర్థిక నెట్‌వర్క్‌లే లక్ష్యంగా పలు సంవత్సరాలుగా ఇటువంటి దాడులకు పాల్పడు తున్నట్లు తెలుస్తున్నది.

అమెరికా, దక్షిణ కొరియాతోపాటు మరో డజన్ ఇతర దేశాల్లోని ఆర్థిక నెట్‌వర్క్‌పై యూనిట్-180 గత కొన్నేండ్లలో పలుమార్లు సైబర్ దాడులకు పాల్పడినట్లు కూడా భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఇటువంటి సమయంలో పెద్ద నోట్ల రద్దు తర్వాత నగదురహిత లేదా డిజిటల్ లావాదేవీల గురించి ప్రధాని నరేంద్ర మోడీ జరుపు తున్న విస్తృత ప్రచారం గురించి పునరాలోచించవలసిన అవసరం ఏర్పడింది.

ఒక ప్రక్క సైబర్ భద్రత ఆందోళన కలిగిస్తూ ఉంటే, అసలు దేశంలో డిజిటల్ లావాదేవీలకు అనుకూల పరిస్థితులు ఉన్నాయా? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ ఏడాది అంబేద్కర్ జయంతి సందర్భంగా భీమ్ యాప్‌ను ఆధార్‌కు అనుసంధానించిన ప్రధాని- స్మార్ట్ ఫోన్లతో వేలిముద్రల ఆధారంగా కూడా లావాదేవీలు జరపవచ్చునంటూ ప్రకటించారు.

దేశంలో 55,000 గ్రామాలకు ఇప్పటివరకూ మొబైల్ కనెక్టివిటీ లేదు. అంటే సెల్‌ఫోన్లకు సిగ్నల్స్ అందుబాటులోకి రాలేదు. ఈ గ్రామాలకు కనెక్టివిటీ ఇవ్వడం ద్వారా తమకు ఆర్థికంగా గిట్టుబాటు కాదని భావించిన కంపెనీలు అందుకు ఆసక్తి చూపడంలేదు. మన దేశంలో ప్రపంచస్థాయి వైఫై సేవలు అందుబాటులోకి రావడానికి 80 లక్షల హాట్‌స్పాట్స్ అవసరమన్నది నిపుణుల అంచనా. ఇప్పుడు మనకున్న హాట్‌స్పాట్స్ సంఖ్య 31 వేలు మాత్రమే.

అంతరాయం లేకుండా డిజిటల్ లావాదేవీలు జరిపేందుకు వ్యాపారులకు లేదా వ్యాపార సంస్థలకు హైస్పీడ్ నెట్‌వర్క్ అవసరం. అందుకు అవసరమైన అదనపు స్పెక్ట్రాన్ని సమకూర్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. ఇవి సాంకేతికంగా మనకున్న లోటుపాట్లకు సంబంధించిన అంశాలు.

మరోవైపు సాంకేతిక అక్షరాస్యత తక్కువగా ఉన్న దేశంలో సామాన్యుడి ఖాతాలోని సొమ్ముకు భద్రత కల్పించే యంత్రాంగం కూడా ఉండాలి. అదే సైబర్ సెక్యూరిటీ. సైబర్ దాడులతో పెద్దపెద్ద సంస్థలే విలవిలలాడుతున్న దుస్థితి. ఇక సామాన్య ఆన్‌లైన్ వినియోగ దారుడికి సైబర్ సెక్యూరిటీ ఇప్పట్లో ఎంతవరకు సాధ్యమన్నదీ ఆలోచించాలి. ఇప్పటికే తమ బ్యాంక్ ఖాతాల్లోని సొమ్ము మాయమై పోతున్నదంటూ గగ్గోలు పెడుతున్న ఉదంతాలు ఎక్కువయ్యాయి.

**సైబర్ సెక్యూరిటీపై దృష్టి సారించాలంటూ గతేడాది ఆగస్టులోనే దేశ రక్షణ, నిఘా వర్గాలకు చెందిన 80 మంది నిపుణుల బృందం ప్రధానికి విజ్ఞప్తి చేసింది.** మన సైబర్ సెక్యూరిటీ ఎంతో బలహీనంగా ఉన్నదని వారు ఆ సందర్భంగా ప్రధానికి గుర్తు చేశారు. దేశంలోని నాలుగు చోట్ల సైబర్ సెక్యూరిటీ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని వారు సూచించారు.

ప్రధానికి నివేదిక ఇచ్చిన బృందంలో ఐబీ మాజీ చీఫ్ పిసి హల్దార్, నావీ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్‌ప్రకాశ్, వైమానిక దళం మాజీ చీఫ్ పివి నాయక్ ఉన్నారు. అణుదాడి నియంత్రణ కోసం నెట్‌వర్క్ రీతిలోనే సైబర్ సెక్యూరిటీ కోసం నెట్‌వర్క్ రూపొందించు కోవాలని వారు ప్రధానికి సూచించారు.

ఇంటర్‌నెట్ వినియోగదారుల సంఖ్యలో చైనా తర్వాత భారతదేశం రెండో స్థానంలో ఉంది. కానీ వేగవంత సేవల తీరులో మాత్రం వెనుకబడి పోయింది. ఈలోపాన్ని అధిగమించి అత్యంత వేగంగా సేవ లందించేలా ఇస్రో మూడు ఉపగ్రహాలను ప్రయోగించ నున్నది. అవన్నీ అందుబాటులో రావడానికి మరో రెండేళ్లకు పైగా పడుతుంది.

ఇంటర్‌నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం భారతదేశంలో ఇంటర్‌నెట్ వినియోగిస్తున్నవారి సంఖ్య 2016 డిసెంబర్‌లో 43కోట్ల 20లక్షలు. వచ్చే జూన్‌కల్లా ఈ సంఖ్య 45కోట్ల నుంచి 46.5కోట్ల వరకు చేరుకోవచ్చుని అంచనా.

స్పీడ్ విషయంలో భారత్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్‌నెట్ కనెక్టివిటీ స్పీడ్ జాబితాలో భారత్ 105వ స్థానంలో ఉన్నట్లు అమెరికాలోని ఒక క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్ నివేదిక పేర్కొంది. ఇంటర్‌నెట్ వేగంలో ఇండియా.. దక్షిణకొరియా (26.3 ఎంబీపీఎస్), హాంకాంగ్ (20 ఎంబీపీఎస్), శ్రీలంక (6 ఎంబీపీఎస్), వియత్నాం (6.3 ఎంబీపీఎస్), చైనా (5.7 ఎంబీపీఎస్) కన్నా వెనుకబడి ఉంది.

మన ఆర్థిక సంస్థలు అమలు చేస్తున్న డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం అత్యాధునికం కాదని స్పష్టం అవుతున్నది. **సైబర్ దాడి జరుగగానే దేశంలో అన్ని బ్యాంక్‌ల ఏటీఎమ్‌లను మూసి వేయవలసి రావడం గమనార్హం. సాంకేతిక భద్రత పర్యవేక్షణ, నిఘాల విషయంలో మనమెంతో వెనుకబడి ఉన్నాం.**

ఇప్పటికే సోషల్ మీడియాను ఆసరాగా చేసుకొని ఎన్నో మోసాలు, నేరాలు జరుగుతున్నాయి. వాటి పరిశోధన అగమ్య గోచరంగా ఉంటుంది. ఆన్‌లైన్ మోసాలకు అంతు లేకుండా పోతున్నది. వీటి నియంత్రణ కోసం పటిష్టమైన వ్యవస్థ లేనే లేదు. అందుకని డిజిటల్ చెల్లింపుల వ్యాప్తి పట్ల మొండిగా వ్యవహరించ కుండా, ఆచరణలో ఎదురు కాగల సమస్యల గురించి అప్రమత్తతతో మెలుగవలసిన అవసరం ఉంది.

–మందరపు హైమవతి
94410 62732

# కళింగాంధ్ర కథకుని కథా కథనకౌశలం



ఇక్ష్వాకు యుగమైనా ఇంటర్‌నెట్ యుగమైనా మనసమాజంలో తొలగి పోనివి వైరుధ్యాలు. 'సర్వేజనా సుఖినో భవంతు' అంటారు కానీ ఆ సర్వజనుల్లో తక్కువ కులాలవాళ్ళు, ఆడ వాళ్ళు, గిరిజనులు, ఆదివాసీలు ఉండరు. ధనవంతుల కొక న్యాయం, దరిద్రులకొక న్యాయం. ప్రశ్నించడం, ధిక్కరించడం కొన్ని వర్గాలకు నిషేదం. రోజంతా చెమటోడ్చినా ఫలం దక్కదు కొందరికి. చెమట చిరునామా తెలీక పోయినా కాలుమీద కాలు వేసికొని ఊరిమీద పెత్తనం చేసే పెత్తందారులు కొందరు. క్రూరమృగాలు ఆకలివేస్తే వేటాడతాయి. పామైనా తన జోలికి రాకపోతే పడగైనా ఎత్తదు. కానీ మనిషి మాత్రం ఆకలితో నిమిత్తం లేకుండా తోటి మనిషిని చంపుకు తింటాడు. బడుగుల, ఆడబడుచుల శరీరాలను ఫలహారం చేస్తాడు.

ఇవన్నీ డా॥ చింతకింది శ్రీనివాసరావుగారి కథా వస్తువులు. అణగారిన ప్రజల ఆర్తిని, వారి జీవితాల్లోని వేదనను పట్టుకొన్న రచయిత. ఉత్తరాంధ్ర మాండలికంలో తనదైన ఒక శైలిని సృష్టించు కొన్న కథకుడు.

పూర్వం సెప్టిక్ దొడ్లు వుండేవి కావు. పాకీవాళ్ళు వచ్చి పాకీ దొడ్డిని శుభ్రం చేసేవారు. పెంటపాలెం కామందు తాతబాబు వాళ్ళింట్లో పాకీ పని చేసే పైడయ్యకు ఒకసారి సుస్తీ చేస్తుంది. ఒక రోజు తన బదులు కొడుకును పనిలోకి పంపిస్తాడు. దొడ్లో మట్టి పొయ్య మంటే యజమాని ఒప్పుకోడు. పొయ్యకపోతే పనిచెయ్యనని ఇంటికి తిరిగి వచ్చేస్తాడు దాలప్ప. మళ్ళీ యజమాని తాటిచెట్లు కొట్టడానికి తండ్రికి బదులుగా వెళ్ళి మాటకు మాట అంటాడు. యజమానికి పిచ్చికోపం వచ్చి చావబాదుతాడు. చావబోతూ దాలప్ప తన కులంవాళ్ళ దగ్గర మాట తీసుకొంటాడు. ఒక నెల రోజుల దాకా పనిచెయ్యద్దంటాడు. అందరూ సరే నంటారు. దాలప్ప చచ్చిపో తాడు. పాకీ దొడ్లు శుభ్రం చెయ్యక పోవడం వలన పదిరోజులకే ఊరంతా గబ్బెత్తి పోతుంది. ఎవరెన్ని చెప్పినా మాటమీద నిలబడ తారు. చివరకు కలెక్టరు వస్తాడు. అందరికి సెప్టిక్ దొడ్లు కట్టిస్తాడు. పాకీవాళ్ళకు పాకీదొడ్లు శుభ్రం చేసే దరిద్రంవదిలి పోతుంది. అప్పటినుంచి ప్రతి ఏడు భోగిపండుగ రోజు **'దాలప్ప తీర్థం'** జరుపు కొంటారు. పెంటపాలెం పేరు దాలప్ప పెంటపాలెంగా మారుతుంది.

ఈ కథలో దాలప్ప వ్యక్తిత్వం గొప్పది. కామందు దెబ్బలతో చంపేస్తున్నా ఆపని చెయ్యడానికి ఇష్టపడడు. ఆత్మాభిమానాన్ని కోల్పోడు. తన ప్రాణత్యాగంతో తన కులస్థులను ఒక మాటమీదకు తీసుకువచ్చి తరతరాల నుంచి వచ్చిన పాకీపని లేకుండా చేస్తాడు. కులస్థుల హృదయాల్లోనే కాదు పాఠకుల హృదయాల్లోనూ చిరస్థానం పొందుతాడు.

తాటిపర్తిలో పిల్లల్ని కనాలంటే ఆడవాళ్ళు కాన్పుల దిబ్బమీదకు వెళ్ళాల్సిందే. అక్కడ వైద్య సదుపాయాలేమీ వుండవు. ఆయుష్షుంటే తల్లీ పిల్ల బతికి కిందకి వస్తారు. లేకపోతే లేదు. ప్రభుత్వం అక్కడ ఆరోగ్య కేంద్రం కట్టాలనుకొని పనులు ప్రారంభిస్తుంది. ఆ సందర్భం లో కాంట్రాక్టరు పదిహేనేళ్ళ బంగారమ్మను పాడుచేస్తాడు. ఆగ్రహిం చిన ఊరి వాళ్ళందరూ ఆ నిర్మాణాలను ధ్వంసం చేస్తారు. కలెక్టరు వచ్చి 'చట్టాన్ని చేతిలోకి తీసుకోగూడదు, బంగారమ్మకు ఉద్యోగం ఇప్పిస్తాం, నష్టపరిహారం ఇస్తాం' అంటాడు. అప్పుడు బంగారమ్మ తల్లి వరహాలమ్మ 'మాదిబ్బ కొందరి ఆడోళ్ళ ప్రాణాలే తీసింది. కానీ నువ్వుకట్టిస్తున్న ఆరోగ్య కేంద్రం ఆడోళ్ళ మానం తియ్యడం మొదలె ట్టింది. ఆడోళ్ళకి ప్రాణం ఎక్కువా? మానం ఎక్కువా?' అని అడుగు తుంది. ఈ మాటలకి కలెక్టరు కళ్ళలో నీళ్ళు తిరుగుతాయి. మనం అనుకొంటున్న ప్రగతి పథకాలు నిజంగా ప్రగతి పథకాలు కావా? మనం ఏదో చేయబోతే మరేదో అయిపోతుందా..” అని అనేక సందేహాలు ఆయన మనసులో మెదులుతాయి. పాఠకుల మనస్సులో అదే సందేహాలు మెదిలి మనసులు కకావికలమైపోతాయి. ఈ **'కాన్పులదిబ్బ'** కథ చదివాక.

ఇలాటిదే మరోకథ **'ఘోరం'.** అంకురపాలెంలో 14 ఏళ్ళ వెంకట రత్నంపై అత్యాచారం జరుగుతుంది. ఆ పిల్ల తల్లిదండ్రులు పోలీసు రిపోర్టు ఇస్తారు. ఆ సందర్భంలో ప్రశ్నలపేరిట, పరీక్షలపేరిట పోలీసులు, డాక్టర్లు మరోసారి అత్యాచారం చేస్తారు. పరాకాష్టకు చెందిన ఈ హింసను అక్షరబద్ధం చేస్తుంది ఈ కథ.

గొప్ప కులాలవాళ్ళకు తక్కువ కులాలంటే ఎప్పుడూ చిన్నచూపే. వాళ్ళలో తమకు మించిన ప్రతిభవుంటే సహించలేరు. కుట్రలు పన్నో, కుతంత్రాలు పన్నో వాళ్ళ విద్యను నాశనం చేస్తారు. అప్పుడు ఏకల వ్యుని బొటనవేలు తెగ్గొట్టారు. ఇప్పుడూ అంతే. **'మైనం'** కథలోని ఇతివృత్తం ఇదే. మాదిగలు వాయించే డప్పు కారణంగా ఆ ఊరికి పేరొచ్చింది. ఊరిపెద్దలు మాదిగపెద్ద మూలయ్యతో బిళ్ళ పందెం వేస్తారు. డప్పుమీద వెండి రూపాయిని మైనంతో అతికించి అతణ్ణి ఓడిస్తారు. జీవితంలో డప్పు ముట్టుకోకూడ దంటారు. పెద్దకులాల అహంకారాన్ని, దాష్టీకాన్ని కళ్ళకు కడుతుంది ఈ కథ.

తనను లొంగ దీసుకొని అనుభవించాలనుకొని వేధిస్తున్న మహే శ్వర్రావుకి లొంగకుండా తేనెటీగలతో కుట్టించి పీడ విరగడ చేసికొన్న దానాలు కథ **'మూడుగుర్రాలు మూడు అయిదులు.'**

ఈ కథలన్నీ చోడవరానికీ నెల్లిమర్లకీ మధ్యలో కళింగాంధ్రలో ప్రజలు చెప్పుకొంటున్న కథలు. రచయితకు ఆడవాళ్ళపట్ల అపురూప గౌరవం, పీడితుల పట్ల పక్షపాతం. ఈ రెండుగుణాలు ఆయన చేత **'వికర్ణ', 'అదిగో ద్వారక'** నవలలు రాయించాయి. ఈ రెండు భారత కథలే. సంప్రదాయ ఇతిహాసాలను ఆధునిక దృష్టితో పరిశీలించి, పరిశోధించి రాసినవి ఈ రెండు నవలలు.

భారతంలో వికర్ణుడు అందరికీ తెలిసినవాడే. గంజాయి వనంలో









తులసి మొక్క లాంటివాడు. దుష్టులైన అన్నదమ్ముల మధ్య స్వచ్ఛంగా ముత్యంలా మెరిసినవాడు. జూదంలో పాండవులు ఓడిపోయినపుడు దుర్యోధనుడు ద్రౌపదిని అవమానించాలనుకొంటాడు. దుశ్శాసనుణ్ణి పిలచి ద్రౌపది వస్త్రాపహరణం చేయమంటాడు. హృదయవిదారకమైన ఆ సమయంలో భీష్మద్రోణాది కురువృద్ధులు ఏమీ మాటలాడరు. అప్పుడు వికర్ణుడు లేచి 'ఇది అన్యాయం' అని ప్రతిఘటిస్తాడు. ఇది వికర్ణుని వైశిష్ట్యం. వికర్ణుని జననం నుంచి మరణం వరకు ఈ నవల అతనిలోని విశిష్టగుణాలను ఎరుకపరుస్తుంది.

ఈనాడు వావివరుసల్లేకుండా స్త్రీలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. నిర్భయపై జరిగిన అత్యాచారం దేశాన్నంతటినీ ప్రభంజనంలా కదిలించింది. ప్రభుత్వం నిర్భయ చట్టం చేసినా అత్యాచారాలు కొనసాగుతునే వున్నాయి. ఆడవాళ్ళని గౌరవిస్తూ, ఇలాటి అన్యాయాలు జరుగుతున్నపుడు ప్రతిఘటించే వికర్ణులు లాటివారు ఈ సమాజానికి ప్రస్తుతం కావాలి.

'అదిగో ద్వారక' నవలా ఇతివృత్తం కూడ భారతంలోని ఇతివృత్తమే. కృష్ణుని అష్టభార్యల్లో ఒక భార్య జాంబవతి. జాంబవంతుని కూతురు. వనచరి, గిరికన్య. ఆమె కొడుకు సాంబుడు. సాంబుడికి కుష్టువ్యాధి వస్తే వినాయకవ్రతం చేసి పోగొట్టుకుంటాడని కథ వుంది.

కృష్ణుడు సత్యభామను, మిగిలిన భార్యలను చూసినట్లుగా జాంబవతిని చూడడు. సాంబుణ్ణి కూడ హీనంగా చూస్తాడు. మహర్షులతో సాంబుడు అబద్ధాలాడడం, వారికి కోపంవచ్చి యాదవకులంలో ముసలం పుడుతుందని శపించడం, ఇవన్నీ భారతంలోని యధార్థ గాధలే. ఈ కథనే ఒక ఆధునిక దృక్పథంలో గిరిజనుల పరంగా చెప్తారు రచయిత. భారతంలో ఆనాటి కొన్ని ప్రదేశాలకు స్వయంగా వెళ్ళి పరిశీలించారు. ఈ పుస్తకం చదువుతుంటే కన్నడంలో భైరప్ప రాసిన పర్వ గుర్తుకు వస్తుంది. రాజులు ఎంత అణగ దొక్కినా, గిరిజనులు ధైర్యపరాక్రమాలతో వారిని ఎదుర్కొని వారి సొంత రాజ్యాన్ని ఏర్పరచుకొని బలపరచుకోవడాన్ని చక్కగా విశదీకరిస్తారు రచయిత ఈ నవలలో.

రచయిత **సాక్షి** దినపత్రికలో సీనియర్ రిపోర్టరు. సాక్షి ఫేమిలీ పేజీలో వచ్చిన కథనాలు **'అలివేణీ ఆణిముత్యమా'.** ఒక్కొక్కసారి మామూలు మనుషులే గొప్పపనులు చేస్తారు. విద్యారంగంలో, కళారంగంలో సేవారంగంలో, రక్షణరంగంలో వివిధ రంగాల్లో స్త్రీలు సాధించిన విజయాల గాధలివి. రేర్ అడ్మిరల్ మనీషా, గిరిజన భాషలకు లిపి తయారు చేస్తున్న ప్రసన్నశ్రీ, నాటకాల్లో పురుష పాత్రధారిణి కె.మంగా దేవి, అవయవదానాన్ని ఒక ఉద్యమంగా చేసి పయనిస్తున్న గూడూరి సీతామహాలక్ష్మి, సైకిళ్ళు బాగుచేసే వరలక్ష్మి వీరందరి స్ఫూర్తి కథనాలు ఇవి. ఆడపిల్లలు అన్ని ఆంక్షల్ని దాటి తమకు నచ్చిన రంగంలో కృషిచేస్తే తమతో పోటీపడగల వారెవ్వరూ లేరని చాటి చెప్పిన వనితల విజయగాథలివి.

మొత్తంమీద డా॥ చింతక్రింది శ్రీనివాసరావుగారి కథైనా, నవలైనా, ఫీచరైనా, ప్రతి అక్షరంలో రచయిత ముద్ర కనిపిస్తుంది. కథా కథన శైలి వీరిది. సరళమైన శైలి, సజీవమైన భాష. పాఠకులను ఎక్కడా ఆపకుండా చదివింపచేస్తాయి. చిరకాలం వెంటాడుతాయి. అ

---

క వి త

## మిన్న ఏది

తెలుగు గజల్

-కరణం కళ్యాణ్ కృష్ణకుమార్.
98484 28978

కనులపొరలు తొలగిస్తే అమ్మనుడికి మిన్న ఏది
మనసుపెట్టి తరచిచూడు మాతృనుడికి మిన్న ఏది

అమ్మనోట పుట్టెనురా క్షరముకాని తెలుగుభాష
ఆదరించు గుణగణాల పుట్టింటికి మిన్న ఏది

ఇలలోనే విద్వత్తుకు దిక్సూచియె తల్లిభాష
ఈలవేసి గోలచేయు పసివానికి మిన్న ఏది

ఉజ్వలమై అజ్ఞానం తరిమియు అమ్మభాష
ఊపిరితో ఊరినట్టి తెలుగునుడికి మిన్న ఏది

ఎందుకనో పరభాషకు పల్లకీల పట్టమిచట
ఏటిగట్టు జాబిలమ్మ జనగీతికి మిన్న ఏది

ఐశ్వర్యం కడవరకూ అక్షరమే సొంతభాష
ఒదిగిఒదిగి ఎదుగునట్టి తెలుగమ్మికి మిన్నఏది

ఓరిమితో తరచి చూడు కూరిమియే సొంతభాష
ఔరౌరా తేనె తెలుగు వర్ణానికి మిన్న ఏది

అంతమంటు ఎరుగనిదీ పురాతనపు పట్టుగొమ్మ
అలవోకగ పలుకులూరు తెలుగుసిరికి మిన్న ఏది

నిఖిలజగము పొందు సొత్తు అమ్మకదా సిరికృష్ణా...!
లెస్సయైన భాషలలో మనదు నుడికి మిన్న ఏది...?

- పసల భీమన్న
94901 23276

# మీకు తెలిసిన ఓ కథ నా మాటల్లో

"భారతదేశంలో అవినీతి గురించి మాట్లాడ్డం మన ట్రైంవేస్ట్." సరిగ్గా ఇదే వాక్యం నా మనస్సుకు తట్టింది.

ఆ రోజు ఉదయం 7 గంటలు : 'ఈనాడు' వార్తా పత్రిక చదువు తున్నాను. ముందు రోజు నుండి నా ఆరోగ్యం బాగా లేదు. కళ్ళు తిరిగే జబ్బు వచ్చింది. కనీసం 10 రోజులు బయటకు వెళ్లవద్దని న్యూరో డాక్టర్ చెప్పాడు. ఉచితంగా మాత్రం కాదండోయ్. వైద్య పరీక్షలు చేసీ, మందులు ఇచ్చీ 500 రూపాయలు ఫీజు తీసుకునే ఆ పని చేసాడు. నాకు వడదెబ్బ తగలవచ్చునని ఆయన జాగ్రత్తలు చెప్పాడు. నేను 10 రోజులు ఇంటిలో ఉండిపోవాలి. తప్పదు. అప్పుడు తట్టింది ఈ కథ వ్రాయాలని. నిజంగా ఈ కథ ఆంధ్ర ప్రదేశ్‌లో జరిగినట్లు నాకు చెప్పింది నా మిత్రుడే లెండి.

ఈ కథ నాకు నచ్చింది. డబ్బు సంపాదించడానికి సులువైన పద్ధతి ఈ కథ ద్వారా తెలిసింది. ఇది అందరికీ సాధ్యం కాదండోయ్! కాస్త ఉన్నత పదవుల్లో ఉన్నవారికీ, రాజకీయ నాయకులతో స్నేహసంబంధాలు ఉన్నవారికి మాత్రమే ఇది సాధ్యం. వాళ్ళు ఎవరు, వారి పేర్లు ఏమిటి? అని ఆరా తీయకండి. నేను దొరికిపోతాను. ఎన్‌కౌంటర్ అయిపోతాను. నా మంచి భార్యకు మంచి భర్త లేకుండా పోతాడు. అంతేగా మరి?

"హల్లో ఏమిటి ఇలాగ వచ్చారు? ఊరకరారు పెద్దలు" అంటూ మంత్రిగారు బాబారావును పలకరించారు, ఆహ్వానిస్తూ, ఆ పలకరింపులో ఆత్మీయతతో పాటు అవినీతి కూడా ధ్వనించింది బాబారావు చెవిలో. రకరకాల కాలేజీలున్న ఓ ధనిక ఆసామి బాబారావు. ఇద్దరూ మంచి స్నేహితులని అక్కడున్నవారు గ్రహించారు.

"మనం లోపలికెళ్ళి మాట్లాడుకుందాం." అంటూ బాబారావు మంత్రిగారి రహస్య సమావేశ గదికి దారితీశాడు.

అవినీతి పనులు రహస్యంగానే జరుగుతాయి మరి.

"అలాగే" అంటూ మంత్రిగారు లేచారు. అక్కడున్నవాళ్ళు లేవ బోయారు. వారిని కూర్చోమని మంత్రిగారు బాబారావు వెనకాలే రహస్య సమావేశ గదిలోకి ప్రవేశించారు.

ఇది ఇంతవరకూ కథా ప్రారంభం. ఇలాంటి అవినీతి కథలు ఇలాగే చాలా పకడ్బందీగా జరుగుతాయి.

"వెంటనే సంగతి చెప్పు బాబారావు. నాకు చాలా పనులున్నాయి. వచ్చినవారి కథలూ, సమస్యలూ విని, వారిని కూడా సంతోష పెట్టాలిగా," మంత్రిగారు సెలవిచ్చారు.

"ఓకే, ఓకే అసలు పాయింటుకు వచ్చేస్తాను." అంటూ మొదలె ట్టాడు బాబారావు.

"వచ్చే ఎన్నికలకు నా వంతు ఓ కోటి రూపాయలు మీకు బహుమతిగా ఇస్తానని ఇప్పుడే హామీ ఇస్తున్నాను. అయితే అందుకు మీ సహకారం కావాలి. దయచేసి నా మాట కాదనకండి." విన యంగా విన్నవించుకున్నాడు అవినీతి కుట్రలో ఆరితేరిన బాబారావు. ఇదివరలో కూడా ఇలాంటి అవినీతి అక్రమ సంపాదన మార్గంలో ఇద్దరూ ఆరితేరిన ఘనులై ఉంటారని పాఠకులు ఈపాటికే గ్రహించి ఉంటారు.

ఇది ప్రైవేటు కాలేజీల కథ. కార్పొరేటు సెక్టారు కథ, ప్రజా ప్రతినిధులు, వారి ఏజెంట్లు డబ్బు సంపాదించే కథ. నాకు ఇదివరలో ఇలాంటి కథలు జరుగుతాయని తెలియదు. ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు మింగుతారనీ, ప్రజాప్రతినిధులు కూడా లంచావతారాలని తెలుసు. కానీ, డబ్బు ఎలా సంపాదిస్తారో, ఆ పద్ధతులేమిటో, ఆ కుట్రలేమిటో నాకు తెలియదు. నా మిత్రుడు చెప్పబట్టి, నాకు అర్థమయ్యి, దీనిని కథగా మీకు చెప్తున్నాను. విన్న కథను విన్నట్లు మీకు చెప్పాలనే ఆకాంక్ష వల్ల ఈ కథను నా శైలిలో చెప్తున్నాను. అలా వ్రాయడానికి సమయం, సందర్భం కలిసొచ్చాయి. ఇవి ఈ కథ వ్రాయడానికి బాహ్యకారణం. నా మిత్రుడూ బాహ్య కారణమే. అంతర్గతకారణం ఏమిటంటే - నాకు ఈ కథ వ్రాయాలనే తృష్ణ నాలోని కథకుడి తాపత్రయం. బాహ్యకారణాలవల్లా, అంతర్గత కారణం వల్లా ఈ కథ వ్రాయడమనే సంఘటన జరిగింది. ఈ మూడింటిలో ఏ కారణం లోపించినా ఈ కథ వ్రాసే సంఘటన జరిగేది కాదు.

మళ్ళీ కథ సాగిద్దాం-

"ఏమీ లేదు మంత్రిగారూ! మీకూ, నాకూ ఉన్న మంచి మానవ సంబంధం, అదే ఆర్థిక సంబంధం మీకు తెలిసిందే. మా ప్రైవేటు ఇంజనీరింగు కాలేజీలకు మీరు ప్రతి సంవత్సరం వంద సీట్లు కేటాయిస్తారు గదా. అలాగే వచ్చే సంవత్సరానికి కూడా వంద సీట్లు కేటాయిస్తారు. ఈ కేటాయింపు గురించి పత్రికల్లో చదువుకుంటాం."

"ఇదంతా నాకెందుకు చెపుతావు? అసలు విషయానికి రావయ్యా మొగడా"

"అలాగే సర్. మా సంఘం ఉంది కదా! అదే ఇంజనీరింగు కాలేజీల ప్రైవేటు సంస్థ. అది మా కార్పొరేటు కాలేజీల హక్కులు సాధించుకొని, వాటిని కాపాడుకొనే అసోసియేషన్. దానికి నేను అధ్యక్షుణ్ణని మీకు తెలుసు."

"అవున్లేవయ్యా! తెలుసు. సుత్తి ఆపి అసలు కథకు రావయ్యా బాబూ, అవతల నాకు మంత్రిమండలి సమావేశం ఉంది కూడా. ఆలస్యంగా వెళ్ళితే ముఖ్యమంత్రి కోప్పడతాడు. చెప్పు తొందరగా" మంత్రిగారు అసహనంగా తొందరపెట్టారు బాబా రావును.

"నేను మా సభ్యులతో మాట్లాడి, మీకు కోటి రూపాయలు వచ్చేలా పథకం వేసి, వారిని ఒప్పించి, మీ ఋణం తీర్చుకుంటాను. ఇదంతా రహస్యంగా చేస్తాను."

"అదెలాగయ్యా? ఇందులో నా ప్రమేయం ఏమిటి?"

"మీ ప్రమేయం ఇప్పుడు కాదు. ముందు నా ప్లాను మీరు ఓకే చేయాలి. చివరగా కోర్టులో న్యాయం జరుగుతుంది. న్యాయం విద్యార్థులకూ, వారి తల్లిదండ్రులకూ, ఆయా కాలేజీలకు కూడా జరుగుతుంది. చివరగా మీకూ, నాకూ కూడా న్యాయం జరుగుతుంది.

అందరూ సంతోషించే న్యాయం ఇది."

"ఓకే, ఇప్పుడు చెప్పు అసలు కథ." మంత్రిగారి ఆజ్ఞ.

"మేం మాకు కేటాయించిన ఇంజనీరింగ్ వందసీట్లను ముందుగా నియమ నిబంధనల ప్రకారం నింపుకుంటాం. తర్వాత ఎక్స్ట్రా అంటే అదనంగా ఇంకో ఇరవై సీట్లు కూడా నింపుకుంటాం. అలా నింపుకోవడానికి మీ అనుమతి కోరతాం. మీ అనుమతి వస్తుందనీ, రాబోతుందనీ ప్రజల్ని నమ్మిస్తాం. అది మా పనే సుమండీ."

"నో నో, అలా కుదరదు. నాకు చెడ్డ పేరు వస్తుంది. మీరు బాగానే ఉంటారు. వచ్చే ఎన్నికలలో నా సీటు "గోవిందా" అవుతుంది." అని మంత్రిగారు చిరాకు పడినట్లు నటించి, అభ్యంతరం చెప్పారు.

"కోర్టు ద్వారా న్యాయం జరుగుతుంది కాబట్టి మీకు చెడ్డ పేరు రాదు. పైగా ఆ ఇరవై సీట్లు అదనంగా ఇచ్చేరు కాబట్టి వచ్చే ఎన్నికలలో మీకు ప్రజలు బ్రహ్మరథం పట్టి, మిమ్మల్ని గెలిపించు కుంటారు." బాబారావు తెలివిగా చెప్పాడు. డైలాగ్ కొనసాగించాడు.

"ఇది ఎలాగంటే ఉదాహరణకి, ఇప్పుడు పట్టణాల్లో, నగరాల్లో ధనికులు భవన నిర్మాణ రూల్స్‌కి వ్యతిరేకంగా బిల్డింగులు కట్టు కుంటారు. తర్వాత ఒక చట్టం వస్తుంది. దాని ప్రకారం అలాంటి బిల్డింగులు కట్టిన యజమానులకు జర్మానా వేసి, ఫైల్ మూసేస్తారు. కోర్టులు ఆ జుర్మానాని తగ్గించి గానీ, ఇంకా కొంచెం పెంచి గానీ న్యాయంగా తీర్పుచెప్పి, న్యాయం చేస్తాయి. ఎందుకంటే కట్టిన బిల్డింగులు పడగొట్టడం హేతుబద్ధం కాదు కదా. మరల కట్టాలంటే సిమ్మెంటు, ఇసుక వగైరా వేస్టు ఎందుకు చేయాలి? కనుక న్యాయ మూర్తి ఆ న్యాయవైఖరితో న్యాయం చేస్తాడు. జుర్మానా వేసి, ప్రభు త్వాన్ని మందలించి, తన కర్తవ్యం న్యాయంగా నిర్వహిస్తాడు. ఇది మీకు తెలియడానికి ఉదాహరణగా మాత్రమే చెప్పాను. అలాగే మా అదనపు 20 సీట్లు అన్యాయం అని చెప్పి మా అందరికి కోర్టులు జుర్మానా వేస్తాయి. మీరు అలాంటి చట్టం చేస్తారు. ప్రభుత్వం తరుఫున మీ ప్రాసిక్యూటర్ వాదించి, అందరికీ న్యాయం జరిగేలా ఫైన్ వేయమంటాడు. వేస్తారు."

ఇంకొక విషయం కూడా బాబారావు చెప్పుకొచ్చాడు. "మా కరస్పాండెంట్లు కూడా తమ విద్యార్థులకు న్యాయం జరగాలని కోర్టుల్లో వాదిస్తారు తమ న్యాయవాదుల ద్వారా. అప్పటికి కోర్టు తీర్పు రెండు – మూడు వాయిదాలు పడి ఆలస్యం జరుగుతుంది. విద్యార్థుల విలువైన ఏడాది కాలం వ్యర్థం కారాదని న్యాయసూత్రం వల్లిస్తారు. విద్యార్థులకు అన్యాయం జరిగితే విద్యార్థి సంఘాలు రెచ్చిపోతాయి. ఉద్యమిస్తాయి. ఆ ఫలితాలు భయంకరంగా ఉంటాయి. అందుకు ఉదాహరణలు వల్లిస్తారు. ప్రభుత్వం చచ్చినట్లు దిగి వస్తుంది. చట్టం చేస్తుంది." బాబారావు ఇలా చిన్న లెక్చరు దంచేసాడు, ఇంకా ఏం దంచాడంటే,–

"కోర్టులను న్యాయం చేయమని, పరిస్థితిని చక్కదిద్దమని కోరుతాం. అవసరం అయితే క్షమించమనీ కోరుతాం. ప్రభుత్వం కూడా తాత్సారం చేసినందుకూ, సకాలంలో స్పందించనందుకు క్షమాపణ చెప్పుకుంటుంది. అందుకు పాలనాపరమైన కారణాలను చెప్పుకుంటుంది. ఈ కారణాలు హేతుబద్ధంగా లేవని కోర్టు భావిస్తుంది. కాని న్యాయం జరగాలనీ, ముందు ముందు ఇలాంటి



పరిస్థితి రాకూడదని, తప్పుచేసిన కాలేజీలకు జుర్మానా వేస్తూ తీర్పు చెబుతుంది. దాంతో సుఖాంతం అవుతుంది" అని బాబారావు ముగించాడు.

మంత్రిగార్కి బాబారావు ప్లాను చాలా బాగా నచ్చింది. తనకు మచ్చరాకుండా, అదనపు సీట్లు వ్యతిరేకిస్తూ పత్రికా ప్రకటనలు ఇవ్వాలనుకున్నారు మంత్రివర్యులు.

ఈ ప్రభుత్వంలో డబ్బుతో ఏ పనైనా సాధ్యమే. ధనికులకు ఖచ్చితంగా న్యాయం జరగాలి, జరుగుతుంది. ఇది ధనికవర్గ ప్రభుత్వమే కదా! పైకి మాత్రం మాది బీదల పార్టీ అని చెప్పు కుంటారు. అది వేరే విషయం.

ఈ కథ రాస్తుంటే నా స్నేహితుడు ఇంకో జరిగిన కథ విన మన్నాడు.

"ఉండరా మిత్రమా! ఈ కథ ముగించనియ్యి" అన్నాను.

"అలా కాదు మిత్రమా! ఈ కథ కూడా ఇప్పుడు నీవు వ్రాస్తున్న దానికి సమానమైన కొత్త అవినీతి కథ." అన్నాడు మిత్రుడు.

"మొదలుపెట్టు, వింటాను. బాగుంటే రెండు కథలు ఒకటిగా అల్లి, పత్రికలకు పంపుదాం." అని చెప్పాను. కథ మొదలుపెట్టాడు. పూర్తిగా విన్నాను. నాకు నచ్చింది. ఆ కథను నా కథాశైలిలో వ్రాస్తున్నాను. మీరూ చదివి ఆనందించండి.

ఇది బి.ఇడి. కాలేజీల అవినీతి కథ. అది ఒక మేజరు పంచా యితి గ్రామం. దానిపేరు చెప్పను. చెప్పితే ఎన్‌కౌంటర్ అయిపోతా నని భయం. అక్కడ అయిదు బి.ఇడి.కాలేజీలున్నాయి. అన్నీ ప్రైవేటు కాలేజీలే. అప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో బి.ఇడి. కాలేజీలు అవసరానికి మించి ఉన్నాయి. అయినా ప్రభుత్వం అడిగిన వాళ్ళకు ఇష్టారాజ్యంగా బి.ఇడి. కాలేజీలు పెట్టుకోవడానికి అనుమతులిచ్చేసింది, తాంబూలా లిచ్చేసాను, తన్నుకు చావండి అంటూ.

ఎవరికి ఏమి ముట్టాలో ఆ సొమ్ము అందిందన్నమాట. ఇంత

వరకూ బాగానే ఉంది. ఇప్పుడు అసలు కథ ప్రారంభం. ప్రభుత్వం తరఫున అధికారులు ఆయా కాలేజీలకు గుర్తింపు ఇవ్వడానికి ఆమ్యామ్యాలు మెక్కి అన్నీ రూల్సు ప్రకారం ఉన్నాయని రిపోర్టులు సమర్పించారు. అసలు కొన్ని కాలేజీలకు లెక్చరర్లు లేరు. తరగతి గదులు లేవు. లైబ్రరీ లేదు. అసలు బిల్డింగే లేదు. ఇంకా ఉండవలసిన ఏవేవో లేవు. ఒక్కోలెక్చరరు పేరు రెండు మూడు కాలేజీల్లో ఉంటుంది. డొనేషన్లు తీసుకోకూడదని రూలు ఉంటుంది. కానీ వాళ్ళు ఆ పేరుతో తీసుకోరు. కాని బిల్డింగులకు సహాయ నిధి పేరుతో చందా ఇవ్వాలంటారు. ఇస్తారు కూడా. సీటు కావాలిగా. ఇలా రూల్సుకు గండి కొడతారు. సహాయ నిధికి ఇష్టపడి ఇచ్చినట్లు మాయ.

ఇక ఈ కాలేజీల్లో చేరే విద్యార్థుల సంగతి వినాలి – ఒక్కో బి.ఇడి. కాలేజికి అనుమతిచ్చిన బి.ఇడి. విద్యార్థుల సంఖ్య 80. ఈ సంఖ్య కాలేజీల ప్రకారం మారవచ్చు లేండి. ఈ 80 మందిలో అధిక సంఖ్యాకులు ఒరిస్సావారూ, బెంగాలీలు. ఆంధ్రులు మాత్రం 10 లేక 20 మంది చేరతారు. దానికి చాల కారణాలు ఉంటాయి. అందులో ఒక కారణం, బి.ఇడి పాసైన వారికి ఉద్యోగాలు లేవు. టి.టి.సి. వారికి మాత్రం ఉద్యోగాలు దండిగా ఉన్నాయి. ఇతర రాష్ట్రాల్లో బి.ఇడి. కాలేజీలు తక్కువ. బి.ఇడి. చదివిన వారికి ఉద్యోగాలెక్కువ. బి.ఇడి. ఫీజులు కూడా అక్కడ ఎక్కువ. కనుక, ఏజెంట్ల ద్వారా ఇతర రాష్ట్రాలవారు మన కాలేజీల్లో చేరుతున్నారు. ఉభయులకు లాభసాటిబేరం కదా!

ఇక్కడే ఇంకో రహస్యం చెప్పాలి. చేరినవారు, తరగతిలో హాజరు కాకపోయినా హాజరు వేసేస్తారు. అంటే బి.ఇడి.కాలేజీలో చేరి హాజరు వేయించుకొంటూ ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటారన్నమాట. ఆంధ్రలో బి.ఇడి. కోర్సు నడిచే పద్ధతి ఇది. అన్ని చోట్ల కాదండోయ్. అత్యధిక బి.ఇడి. కాలేజీల సంగతి ఇది.

ఇక బి.ఇడి. పరీక్షల బాగోతం చూద్దాం. – అది కూడా ఓ పెద్ద కథ. అంతా మాస్ కాపీయింగ్, చూచి వ్రాత పరీక్షలే. ఎవరి రేటు వారిదే. దోపిడీ రాజ్యంలో అవినీతి సంపాదనే. లాభార్జన ధ్యేయమే. కొన్ని కాలేజీలు మాత్రం సక్రమంగా పరీక్షలు నడుపుతా యండోయ్. వాటి లక్ష్యం సేవ చెయ్యడం, న్యాయ సంపాదన. వాటిని మెచ్చుకోవాలి. తప్పకుండా.

"ఆ అధికారి గుర్తింపు కొరకు సంతకం పెట్టాలంటే అతనికి లక్ష ఇవ్వాలి. క్రిందటి సంవత్సరం ముప్పైవేలు ఇచ్చాం. నేను లక్ష చచ్చినా ఇవ్వను. ఎందుకివ్వాలి? నా కాలేజీకి గుర్తింపు రూల్సు ప్రకారం అన్ని హంగులూ ఉన్నాయి." ఇలాగ ఒక భర్త తన భార్యతో అన్నాడు. గుర్తింపు సిఫార్సు చేసే అధికారి రేటు లక్షట, విన్నారా?

" ఈ వ్యవస్థలో ఇవన్నీ మామూలేనండి. ఒక లక్ష వాడి మొహాన్ని కొడితే మనకు లాభం ఎంతండి?" సూటిగా భార్య ప్రశ్న. లాభనష్టాల లెక్కలే అన్నీ డబ్బు సంపాదనే ధ్యేయం మరి.

"నాలుగు లక్షలు" సూటిగా భర్త జవాబు.

ఇది సంవత్సరానికి ఒక్కో కాలేజీ నుండి ఖర్చులు పోగా నికర లాభం.

"అయితే ఇవ్వవలసిందేనండి. మనది కార్పొరేటు సెక్టార్. ప్రైవేటు కాలేజీ. లాభాలకోసమే కదండి, మనం కాలేజీలు పెట్టింది?" అని తెలివైన భార్య భర్తను ఒప్పించింది. షరా మామూలే. రెండు బి.ఇడి. కాలేజీలు, రెండు పేర్లతో తెచ్చుకుంది. పైగా ఇది అవినీతి పద్ధతి కాదట. తమను తప్పు పట్టరాదట. ఆమె ఈ వ్యవస్థనే తప్పుపట్టాలంటుంది. ఎవరైనా తన వాదన తప్పంటే, ఆమె వాళ్ళ మీద విరుచుకు పడుతుంది. ఎలాగో వినండి.

"కార్పొరేటు సెక్టార్‌లో ఇది మామూలే. లేకపోతే కాలేజీలు మూసుకొని, కోర్టులు చుట్టూ తిరగాలి. మనకింకేమీ పని లేదా ఏమిటి? మనం ఉన్నది పెట్టుబడిదారీ వ్యవస్థలో, దోపిడీ విధానాల ద్వారా లాభాలు సంపాదించుకోవాలి. పెట్టుబడిని పెంచుకోవాలి, ఇంకా ఇంకా ధనికులం కావాలి. మనం బాగుపడ్డమే మన లక్ష్యం. చివరగా ఆ డబ్బుతో ఎమ్.ఎల్.ఏ. అయిపోవాలి." అని చిన్న లెక్చరు దంచేసింది. దోపిడీ ఆర్థిక శాస్త్రం తెలిసిన వ్యక్తి ఆ భార్యామణి. తెలిసిందా?

పెట్టుబడిదారీ వ్యవస్థలో దోపిడీ మార్గాలు రకరకాలుగా ఉంటా యనీ, దోపిడీకి గురయ్యే వర్గాల్లో చైతన్యం కలిగించి, దోపిడీ లేని మంచి సమాజం కోసం ఉద్యమించాలని మార్క్సిజం చెబుతుంది. అది ఇంకా ఏమి చెబుతుందంటే – "పెట్టుబడి లక్ష్యం లాభార్జనే కనుక దేశం ఏమైపోతే మనకేం, ఎవరెలా నాశనం అయితే మనకేం అని దోపిడీదారులు ఆలోచిస్తారు." శ్రమదోపిడీ వ్యవస్థ అన్ని సమస్యలకూ మూల కారణం అని మార్క్సిజం చెబుతుంది.

ఇప్పుడు ఇంకో రకం దోపిడీ మార్గం గురించి – ఓ బి.ఇడి. కాలేజి ప్రిన్సిపాల్ పరీక్ష పేపరు జిరాక్స్ తీయించి, ఆ కాపీలు అమ్ముకొని, సుమారు ఒక లక్ష వరకు సంపాదించాడట. ఇది వార్తాపత్రికల్లో వస్తే ప్రభుత్వం దర్యాప్తు అధికారిని నియమించింది. ఆయన ఆ ప్రిన్సిపాల్ నుండి కావలసినంత డబ్బు దండుకుని, అసలు కాపీయింగ్ జరగలేదని, జిరాక్స్ ప్రశ్నాపత్రం సంగతి అబద్ధం అని ప్రభుత్వానికి రిపోర్టు పంపాడు. అంతేకాదు, ఆ అవినీతి అధికారి మరల పరీక్షలు జరగకుండా బి.ఇడి. విద్యార్థులకు సేవ చేసానని గొప్పగా చెప్పుకున్నాడు. ఇది నిజంగా జరిగింది. నాకు కూడా ఆ అధికారి ముప్పైవేలు లంచం తీసుకొని ఆ అవినీతి ప్రిన్సిపాల్‌ను రక్షించినట్లు తెలిసింది. ఇలాంటివి జరుగుతాయని మార్క్సిజం ఎప్పుడో చెప్పింది. నేను కూడా జరిగిన సంగతి ఒకటి కథగా చెబుతాను. జ్ఞానోదయం కోసం చదవాలి. తప్పదు.

శ్రీకాకుళం ప్రాంతంలో ఓ ఎమ్.ఎల్.ఏ. కూతురు ఏమంటుం దంటే, ఎమ్.ఎల్.ఏ. అంటే ఓట్లు కొనుక్కొనేవాడు. ప్రజలంటే ఓట్లు అమ్ముకొనేవాళ్ళు. ఈ నిర్వచనాలు ఆమె వివరించింది. అందుకే ఆ అమ్మాయి తన తండ్రి ఎమ్మెల్యే అయితే ప్రజాసేవ చేయక్కర్లేదని వాదిస్తుంది, తన సహవిద్యార్థులతో. అది విని, ఓ బాటసారి ఆమెను నిలదీసి అడిగాడు–

"అదేమిటమ్మా! అలాగంటావు? పైగా నీవు పదవ తరగతి చదువుతున్నావు?" అని. ఆమె జవాబు వింటే, మనం ఆశ్చర్యపోతాం–

"మా నాన్న ప్రజలకు డబ్బిచ్చి ఓట్లు కొనుక్కొని, నెగ్గి, ఎమ్.ఎల్.ఏ. అయ్యాడు. అవునా? కనుక సేవ చేయమని అడిగే హక్కు ప్రజలకు ఎందుకుంటుంది? ప్రజాసేవ చేయాల్సిన పని మా నాన్నకు ఎందుకుంటుంది? చెప్పండి. తిరిగి మనల్నే ప్రశ్నిస్తుంది, ఆ అమ్మాయి.

"ప్రజలు ఓట్లు అమ్ముకున్నారు కదా! వారికి డబ్బు ముట్టింది కదా! దాంతో ఆ ఎక్కౌంట్ క్లోజ్. ప్రజాసేవ చేయమని అడిగే హక్కు ప్రజలకు ఇంకెందుకుంటుంది? చెప్పండి." అని తిరిగి మనల్నే ఇంకో

ప్రశ్న వేస్తుంది. ఆ పిల్ల చెప్పింది తార్కికంగా, సరిగ్గానే చెప్పినట్లు అనిపించింది కదా! అదండి మన ప్రజాస్వామ్యం, పదవ తరగతి అమ్మాయి అర్థం చేసుకున్నది.

"ఇలా అవినీతి కథలతో పేజీలు పెరిగిపోతున్నాయి. కనుక వాటిని ఆపి, ఆ మొదటి కథను ముగించు." నా మిత్రుని సలహా. నిజమే. పాఠకులు చిన్న కథలు మాత్రమే చదువుతారు. "సరే. అలాగే చేద్దాం." మిగిలిన కథ చదవండి–

కోర్టులు తీర్పులు ఇవ్వడం ఆలస్యంగా చేస్తే, న్యాయం జరగనట్లే. ఇది అందరికీ తెలిసిందే. కాని ఇక్కడ ఆలస్యం చేయడం వల్ల ప్రజలకు న్యాయం జరిగింది. సుఖాంతం అయింది. ఎలాగో చూద్దాం–

ఇరవై అదనపు సీట్లు నింపిన కాలేజీలకు కోర్టు జుర్మానా విధించి, న్యాయం చేసింది. అదనపు సీట్లు పొందిన విద్యార్థుల చదువు అదే కాలేజీలో కొనసాగాలని తీర్పు చెప్పింది. ఆయా కాలేజీలు సంతోషంగా జుర్మానా కట్టి, కోర్టులకూ, మంత్రిగారికి కృతజ్ఞతలు చెప్పుకొన్నాయి. అంతా సవ్యంగా, ప్లాను ప్రకారం జరిగినందుకు బాబారావు ఎక్కువగా సంతోషించాడు.

ముగింపుగా నాలుగు మాటలు చెప్పాలి – ఎవరి వాటా వారికి ముట్టింది. బాబారావు వాటా, మంత్రిగారి వాటా ముట్టాయి. ధనిక విద్యార్థులకు అదనంగా సీట్లు దొరికాయి. ఇవి వారి వాటా. ఎవరెవరికి ఎంత ముట్టాలో, వాళ్ళందరకూ బాబారావు న్యాయంగా ముట్టచెప్పాడు. ఈ డబ్బు, ప్లాను ప్రకారం బాబారావు కాలేజీ కరస్పాండెంట్ల నుండి ముందుగా వసూలు చేసిందే. ఇప్పుడు ఆ డబ్బు ఎక్కౌంటు వివరాలు మనకెందుకు లెండి. మనకు కావలసిందీ, మనం తెల్సుకోవాల్సిందీ అవినీతి కథ. అది మనకు తెలిసింది. చాలు. కథాశీర్షిక ప్రకారం ఓ కథ బదులు మూడు కథలు చెప్పాను. కనుక పాఠకులు కూడా సాహిత్యానందాన్ని పొంది ఉంటారు.

భారతదేశంలో అవినీతి కొత్త రూపాల్లో చెలామణీ అవుతున్నది. ఇక్కడ డబ్బుకే విలువ. మానవ విలువలకు విలువ వుండదు. ఎక్కడైనా వర్గ సమాజంలో మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలే. ఈ ఆర్థిక సూత్రం మనకూ సరిపోతుంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, భారతదేశం అర్ధభూస్వామ్య వ్యవస్థ, అర్థపెట్టుబడిదారీ వ్యవస్థలతో సతమతమవుతున్నది. ఇది నేను చెప్పడం కాదు, మార్క్సిజం చెప్పింది. దోపిడీకి గురయ్యే బీద వర్గానికి, ముఖ్యంగా కార్మిక వర్గానికి చెప్పింది. ఈ దోపిడీ నుండి బయటపడమనీ, తమ సంకెళ్ళను తామే ప్రయత్నపూర్వకంగా, సంఘటితంగా తెంపుకోవాలని చెప్పింది. లేకపోతే ఈ దోపిడీ వ్యవస్థ ఇలాగే ఎప్పుడూ కొనసాగుతుందని కూడా చెప్పింది.

ఇక ఈ కథ ముగింపు–

నా చిన్నతనం నుండి ఈ వ్యవస్థ బాగోతం చూస్తున్నాను. ఇప్పుడు నా వయస్సు 78 సంవత్సరాలు. **ఈమధ్య నేను మార్క్సిజం చదివితే, ఈ దుర్భర దోపిడీ వ్యవస్థకూ, మన సమస్యలకూ మూలకారణం తెలిసింది. ఇంతవరకూ మనం నీడతో యుద్ధం చేస్తున్నాం అని గ్రహించాను.**

"మార్క్సిజమే తెలియకపోతే పుట్టినవాళ్ళం పుట్టినట్టే ఉంటాం," అని రంగనాయకమ్మగారి పుస్తకం చదివిన తర్వాతనే ఆ విషయం అర్థమయ్యింది.

(రంగనాయకమ్మగారి పుస్తకం పేరు – "మార్క్సిజమే తెలియక పోతే పుట్టినవాళ్ళం పుట్టినట్టే ఉంటాం," ఆమెకు నా కృతజ్ఞతలు)

## అందరికీ ఆదర్శం బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు




అమ్మనుడి మే సంచికలో ఒక ప్రధానవ్యాసంగా ప్రచురితమైన "సంఘ సంస్కరణ రంగంలో స్ఫూర్తిమూర్తిత్రయం" వ్యాసాన్నిచదివి విశాఖపట్నంలోని సమైక్యభారతి, ప్రజాస్పందన సంస్థలబాధ్యులు శ్రీ సి.ఎస్.రావు, శ్రీ పి.కన్నయ్య విశాఖ పట్నంలో రఘుపతి వెంకట రత్నం నాయుడు గారి వర్ధంతి సభను మే 26న విశాఖ పట్నంలో నిర్వహించారు. దానికి ప్రధాన వక్తగా ఆ వ్యాసరచయిత సన్నిధానం నరసింహశర్మగారిని విశాఖపట్నానికి ఆహ్వా నించారు. ఆ సభలో శ్రీ శర్మ మాట్లాడుతూ బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు గారు ఆత్మకథను రాసుకోకపోవడం జాతికి తీరని నష్టం. దానివలన ఎన్నో అమూల్య మైన, చారిత్రక, సామాజిక సంఘటనలు అందు బాటులో లేకుండా పోయాయి" అని అన్నారు.

ఆ సభకు ప్రజాస్పందన అధ్యక్షులు సి.ఎస్.రావు అధ్యక్షత వహించారు. సన్నిధానం తన ప్రసంగంలో "తనకన్నా ఎంతో ముందుగా తెలుగునాట సంస్కరణోద్యమాలకు ఆద్యులైన స్వామినీని ముద్దు నరసింహనాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి మహనీయుల స్ఫూర్తితో ఎంతో విలువైన సంస్కరణ కార్యక్ర మాలు నిర్వహించిన వెంకటరత్నం నాయుడుగారిని తెలుగువారేకాదు .. భారతీయులందరూ గౌరవించవలసి ఉంది." అన్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, గుడిపాటి వెంకటచలం, ముట్నూరు కృష్ణారావు, నాళం కృష్ణారావు, భోగరాజు పట్టాభిసీతారామయ్యపంతులు వంటి ఎందరో ప్రసిద్ధులు రఘుపతి వెంకటరత్నం నాయుడి శిష్యులని తెలియజేశారు. ఆయనవంటి నిష్కళంక చరిత్ర కలిగిన మహనీయులు అరుదుగా ఉంటారని నివాళులర్పించారు. తెలుగు రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత తెలుగు భాషాభిమానం తగ్గిపోయింది. తెలుగుభాషను పరిరక్షించలేని తెలుగుప్రభుత్వాలు మనకెందుకు? అని ప్రశ్నించారు. తెలుగుభాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు డా॥ సామల రమేష్‌బాబు సూచన మేరకు తాను బ్రహ్మర్షి జీవితచరిత్రను రాయనున్నట్లు ప్రకటించారు. వాణిజ్యపన్నుల శాఖ డిప్యూటి కమీషనర్ టి.శివశంకర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సాహిత్యవేత్త డి.వి.సూర్యారావు, జి.వి.ఎం.సి.ఇంజనీర్ కిల్లాన దిలీప్, జాగృతి వేదిక అధ్యక్షురాలు జవ్వాది లక్ష్మి మున్నగువారు పాల్గొన్న ఈ సభకు కోరుకొండ రంగారావు స్వాగతం పలికారు.

**–బి.వి.అప్పారావు.**

కవిత

# వారిని అంచులదాకా నడవనివ్వండి...

- డాక్టర్ కత్తి పద్మారావు
9849741695

**అం**తస్సంబంధమైన
అంశాలన్నీ ఈనాడు చర్చలో ఉన్నాయి
ఇది ఒక చర్చా యుగం
స్వేచ్ఛ కోసమే పోరాటం
పక్షులు ఎప్పుడో ఈ స్వేచ్ఛను సాధించాయి
మహాగమనాన్ని కొనసాగిస్తున్నాయి
అవును! మార్పుకు, మలుపుకు
గుర్తింపు లేదా! అనేదే ప్రశ్న
వారు కొవ్వొత్తులను వెలిగిస్తూ పోతున్నారు
తమ గుండె దివ్వెలను
వెలిగించుకోవడం మరచారా!
తమను తాము వెలిగించుకోవాలంటే
తమకు తాము అర్థం కావడమే!
ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక సమాజం
అన్నిటికి మూలం మళ్ళీ నీవే
ఆ యువతుల ప్రశ్నలు సహజమైనవే కదా!
వారి ప్రశ్నలకు సమాధానం చెప్పండి!
ఆ జాజితీగ ఆ పెద్దచెట్టును
అల్లుకున్నంత మాత్రాన
అది ఆధారితం కాదు కదా!
ముందు వారిని గుర్తించండి!
వారి మాటల్లో ఆధునికత ఉంది
వారి మాటల్లో కదలిక ఉంది
ఆ నదులు కొండల్ని తొలుచుకొని ప్రవహిస్తున్నాయి
ఆ చెరువులు ఎండిపోతున్నాయి
తామరతూళ్ళు ఎండుచేపల వాసనొస్తున్నాయి
ప్రవహించే నది సూర్యునికి ఎదురీదుతోంది
విశాలమైన సముద్రంలో
సూర్యుడు జలకాలాడుతున్నాడు
గెలాక్సీలో నక్షత్రాలన్నీ వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి
ఆ అమ్మాయి పెదాలకు రంగులు వేసుకుంది
మాటల్లో సువాసన లేదు
మాటలు పాతవి, రంగులు కొత్తవి
అవును! మాటలు మనిషినే కాదు
ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయి
మాటల్లో జీవం ఉండాలంటే
మాటల్లో సత్యాన్ని పలకాలి
మాటలకు లింగ భేదం లేదు
అవి పనస తొనల్లా అంగిటిని తాకుతాయి
ఇప్పుడెందుకో తల్లిమాట బిడ్డకు నచ్చటం లేదు
పాకం కుదరని అరెసెల్లా
మాటలు మధ్యలోనే విరిగిపోతున్నాయి
యువతులు సమకాలీనతను అనుభవిస్తున్నారు
తమతో ఉన్న క్షణాన్ని బ్రతికిస్తున్నారు
జీవితం అంటే ఏమిటి? అనివారు ప్రశ్నించడాన్ని
మీరు ఎందుకు సహించలేరు?
కోరికలకూ ఓ హద్దు ఉంది
అలసిపోయేంత కోరికలెందుకు?
సూరుణ్ణి చూడలేనంత
అలసత్వానికి భవిష్యత్తు ఉందా!
అద్దంలో చూసుకోవడం వేరు
అద్దం చూపించడం వేరు
ఆ బ్యూటీపార్లర్లలో
నీ రూపురేఖలు తీర్చిదిద్దేవారు
నీ మనస్సును శిల్పించలేరు
సున్నితమైనవి, సహజమైనవి
మీ రవలోకించకుండానే మీలో పాతబడిపోతున్నాయి
సౌందర్యం ఎక్కడుంది! స్వేచ్ఛలో ఉంది
స్వేచ్ఛ భావాల్లోనా, ఆలోచనల్లోనా,
స్వేచ్ఛ విస్తృతికా, కుదింపుకా!
ఒకరిని మరొకరు ఒత్తిడి చేయటం
ఒకరి జీవితాన్ని మరొకరు నిర్దేశించటం
ఒకరి దారిని మరొకరు చూపించడం
అదనపు బాధ్యత కాదా!
మీరు నడవడం నేర్పండి
మీరు వారి బదులు నడవకండి!
నిజమే పక్షులే మనకు గురువులు
నదుల ప్రవాహమే మనకు దిక్సూచి
**ఇది ప్రశ్నల యుగం**
**ప్రతి ప్రశ్న వెనుక ఓ పెద్ద జీవితం ఉంది**
**అందుకే వారిని గుర్తించండి!**
వారిని నడవనివ్వండి!
వారు అంచులదాకా నడిస్తే
అక్కడ విజయగీతాలు పాడతారు
కొత్త చూపే జ్ఞాన స్రవంతికి మార్గం.

## మాతృభాషపై మక్కువతో...



మాతృభాషపై ఉన్న ఇష్టమే నన్ను ఆసెట్ ఫలితాల్లో తెలుగులో రెండోర్యాంకు సాధించేలా చేసిందని..మధురవాడ వైయస్ఆర్ నగర్‌కు చెందిన **దేవరకొండ ప్రవీణ్‌కుమార్** పేర్కొన్నాడు. ప్రవీణ్ బాపట్లలో జిల్లెళ్ళమూడి మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలలో అయిదేళ్ళ బి.ఎ.ఓరియంటల్ లాంగ్వేజ్ చదివాడు. తర్వాత తాటికొండ గోగినేని కనకయ్య తెలుగుపండిట్ శిక్షణ విభాగంలో 2015-16 విద్యాసంవత్సరంలో తెలుగుపండిట్ శిక్షణపొంది ప్రథమస్థానం సాధించాడు. తల్లిదండ్రులు దేవరకొండ సత్యవాణి, సాయిరమణల ప్రోత్సాహంతో తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటేందుకు కృషి చేస్తానని, ఎం.ఎ.తెలుగు పూర్తిచేసి, డిగ్రీ కళాశాల ఆచార్యునిగా స్థిరపడాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నాడు. (ఈనాడు వార్త)

-పుప్పల నరసింహం
సెల్ : 99857 81799

# తొలి విమానాన్ని తయారు చేసిన సుబ్బరాయశాస్త్రికి ఏమిచ్చి రుణం తీర్చుకుందాం?

**సు**బ్బరాయ శాస్త్రి....పదహారణాల తెలుగువాడు. తొలి విమానానికి రూపకల్పన చేశారు.

అందుకుగాను ఆయనకు ఎన్నో అవార్డులు అందాలి. కనీసం భారత దేశంలోని అత్యున్నత పౌరపురస్కారమైనా దక్కాలి. కాని బ్రిటీషు పాలకుల కారణంగా అంతటి విశిష్ట వ్యక్తి గూర్చి ఎవరికీ తెలియకుండా పోయింది. చరిత్రలో ఆయన అనామకుడిగా మిగిలిపోవడం విషాదం.

గొప్ప ప్రతిభావంతుల, జ్ఞానవంతుల, మేధోసంపన్నుల జీవితాలు ఇలా విస్మృతిలోకి జారుకోవడం ఒకప్పుడు అర్థం చేసుకోవచ్చు, కాని అన్నివిధాలా అభివృద్ధి సాధిస్తున్న ఈ సమయంలో పండిత సుబ్బరాయశాస్త్రిలాంటి ఉద్దండుడిని విస్మరించడం విడ్డూరమే.

1866 సంవత్సరంలో అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలో భాగమైన ప్రస్తుతం కర్నాటకలో ఉన్న మాండ్యా జిల్లా సరిహద్దు ప్రాంతంలో సుబ్బారాయశాస్త్రి జన్మించారు. సంప్రదాయ కుటుంబంలో పుట్టి సంస్కృతం, ఇతర శాస్త్రాలు చదువుకుని బొంబాయి (ముంబయ్) వెళ్లారు.

ముంబయ్‌లోని చీరాబజార్‌లో 1864 సంవత్సరంలో జన్మించిన శివ్‌కర్ బాపూజీ తల్పడేతో సుబ్బరాయశాస్త్రికి స్నేహం ఏర్పడింది. ఇద్దరి ఆలోచనలు, అభిరుచులు దాదాపు ఒకే రకంగా ఉండటంతో వారి స్నేహం మరింత బలపడింది.

అప్పటికే దేశంలో స్వామి వివేకానంద ఆలోచనలు, భావనలు, పునరుజ్జీవన కార్యక్రమాలు ఊపందుకుంటున్నాయి. శతాబ్దాలుగా సుషుప్తావస్థలో ఉన్న ఆలోచనలు, భావాలకు 'కందెన'లా సమాజంలో అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిచిన భారతదేశ ఔన్నత్యం తిరిగి నెలకొల్పాలన్న తపన చాలా మందిలో కనిపించసాగింది.

అలాంటి సమయంలో సుబ్బరాయశాస్త్రి, శివకర్ బాపూజీల దృష్టి భరద్వాజ మహర్షికి చెందిన వైమానిక శాస్త్రంపై పడింది. అది సంస్కృత గ్రంథం. శాస్త్రి, శివకర్‌లకు సంస్కృతం కరతలామలకం. దాంతో ఆ గ్రంథాన్ని ఆమూలంగ అధ్యయనం చేశారు. తమ బుద్ధి పదునెక్కింది. ఆ శాస్త్రం ఆధారంగా విమానం తయారు చేయాలని సంకల్పించి, 15 సంవత్సరాలు పరిశోధనలు చేశారు. భరద్వాజ మహర్షి హృదయాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి అహరహం కష్టపడ్డారు. తమ కాలపు ధాతువులను, లోహాలను సేకరించారు. డిజైన్లు తయారు చేశారు. శివ్‌కర్ ఇంట్లోనే విమానాన్ని సిద్ధంచేశారు. అంతా అనుకున్న పద్ధతిలో కొనసాగుతోంది. మానవ రహిత విమానాన్ని ఎగరేసేందుకు అవసరమైన 'రిమోట్'ను సైతం తయారు చేశారు. వివిధ ఇంధనాలను 'ఇగ్నైట్' చేయడానికి రిమోట్ సైతం ఊహించినట్టుగానే తయారైంది.

తాము తయారు చేసిన విమానాన్ని 1895 సంవత్సరంలో ఎగరేసేందుకు నిర్ణయించారు. బొంబాయిలోని జుహిచౌపాటి బీచ్‌కు సామాగ్రిని తరలించారు. అప్పటికే ఈ ప్రయోగ విషయం చాలా మంది ప్రముఖులకు, ప్రజలకు తెలిసింది. ఆ వినూత్న లోహ విహంగాన్ని తిలకించడానికి చాలామంది హాజరయ్యారు. వారిలో ఆనాటి బొంబయ్ హైకోర్టు జడ్జి మహదేవ్ గోవింద్‌రనడే, బరోడా మహరాజు సాయాజీరావు గైక్వాడ్ తదితరులు ఉన్నారు.

పదిహేను సంవత్సరాలు శ్రమించి రూపొందించిన ఆ




MAHARSHI BHARADWAAJA'S
VYMAANIKA-SHAASTRA
OR
SCIENCE OF AERONAUTICS

Part of his unknown work
"YANTRA SARVASVA"
or
"ALL ABOUT MACHINES"

as revealed to venerable
Pandit SUBBARAYA SASTRY
and recorded in hand-written
Sanskrit Manuscript Form

translated into English by
G. R. JOSYER, M.A., Hons., F.R.E.S., M.R.S.L.
Founder Director,
INTERNATIONAL ACADEMY OF SANSKRIT RESEARCH.

Printed at the
CORONATION PRESS, MYSORE 4. INDIA.

విమానం అందరి సమక్షంలో ఎగిరింది. హర్షధ్వానాలు, కేరింతలు, కొత్తశకానికి నాంది పలికిన ఇద్దరు పండితుల శ్రమ ఫలాన్ని ఆస్వాదిస్తూ అందరూ జయజయ ధ్వానాలు చేస్తుండగా ఆ విమానం 1500 అడుగుల ఎత్తుకు వెళ్ళింది. 37 సెకన్లు గాలిలో తిరిగింది. సురక్షితంగా రిమోట్ ద్వారా ఆ విమానాన్ని కిందకు దింపారు. ఇది చరిత్ర. అపురూప ఆధునిక వైమానిక చరిత్రకు నాంది. ఆనాటి సమాజం కలలో కూడా ఊహించని అద్భుత లోహ విహంగ విన్యాసం చూసి జడ్జి రణడే, బరోడా రాజు గైక్వాడ్ అభినందనలు తెలిపారు. అపురూప వ్యక్తులుగా చూశారు.

కాని బ్రిటీషు పాలకులు ఇందుకు భిన్నంగా వ్యవహరించారు. వారిని ఇబ్బందులకు గురిచేశారు. లాఠీలకు పనికల్పించారు. కేసులు పెట్టారు. స్థానికుడు శివ్‌కర్ బాపూజి తల్పడేను జైల్లోకి తోశారు. చిత్రహింసలకు గురిచేశారు. వేధించారు. వేధింపులు నిత్యకృత్య మయ్యాయి.

ఒకప్పుడు భూమి గుండ్రంగా ఉన్నదన్నందుకు మతంపై ఆధార పడిన పాలకులు ఎలా స్పందించి చిత్రహింసలు పెట్టారో అంతకన్న ఘోరంగా భరద్వాజ మహర్షి సిద్ధాంతం, సూత్రీకరణల ఆధారంగా విమానం గాలిలో ఎగురుతుందని నిరూపించినందుకు ఆ ఇరువురి పట్ల బ్రిటీషు పాలకులు క్రూరంగా ప్రవర్తించారు. స్థానికుడైన శివ్‌కర్ బాపూజీపై ఆ పైశాచికత్వాన్ని మరింత ఎక్కువ ప్రదర్శించారు.

విమానం ఎగురవేత విజయవంతమైనా, ప్రముఖులు, ప్రజలు అభినందనలు తెలిపినా, తదుపరి కార్యక్రమాలకు అవసరమైన ధనం ఇస్తామని ప్రకటించినా, అండగా నిలుస్తామని చెప్పినా బ్రిటీషు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ముందు అవన్నీ ఆచరణలోకి రాలేక పోయాయి. ఆశించిన మద్దతు, గుర్తింపు, గౌరవం లభించలేదు. పైగా కేసులు..... వేధింపులు, అవమానాలు చుట్టుముట్టాయి.

ఈ సమయంలోనే బ్రిటీషువారికి చెందిన ర్యాలీకంపెనీ ప్రతి నిధులు శివ్‌కర్ బాపూజీని లోపాయికారిగా సంప్రదించి, తాము సహకరిస్తామని, ఆదుకుంటామని, తోడ్పడుతామని నమ్మించి ఆ విమాన డిజైన్లను, డ్రాయింగులను, వివరాలను తీసుకెళ్ళారు. తెల్లని వన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు...అని నమ్మే శివకర్ బాపూజీని 'తెల్లవాళ్ళు' ఇట్టే దగా చేశారు..... మోసంచేశారు. ప్రభుత్వం వారిది, అధికారులు వారి మనుషులు, కేసులున్నాయి. ఈ చక్రవ్యూహంలో చిక్కుకున్న శివ్‌కర్ వద్ద ఆ డిజైన్లు, డ్రాయింగ్‌లు, సమాచారం, లోహాలు, ఇంధనం వివరాలు పట్టుకెళ్ళడం పెద్ద కష్టం కాలేదు.

అదిగో అలా బ్రిటీషు కంపెనీ దగాచేసి, మోసపూరితంగా కుట్ర పన్ని ఆధునిక విమాన తయారీ పద్ధతులను తస్కరించి అమెరికాకు చేర్చారు. అవి అక్కడి రైట్‌బ్రదర్స్ చేతికి చిక్కాయి. వాటి ఆధారంగా రైట్‌బ్రదర్స్ విమానాన్ని తయారు చేసి 1903 సంవత్సరంలో అమెరికా లోని కరోలినా రాష్ట్ర సముద్రతీరంలో ఎగురవేశారు. ఆ విమానం కేవలం 120 అడుగుల ఎత్తుకు ఎగిరి 12 సెకన్లు మాత్రమే గాలిలో తిరిగింది. అనంతరం కూలింది. రిమోట్ లేకుండా ఆ ప్రయోగం చేశారు.

**శాస్త్రి, శివ్‌కర్‌ల ప్రయోగం తరువాత ఎనిమిది సంవత్సరాలకు ఈ ప్రయోగం పూర్తిచేసి రైట్ బ్రదర్స్ పేటెంట్ పొందారు. దాంతో వారి పేరనే తొలివిమానం తయారీ, ఎగురవేత...నమోదు అయ్యింది. ఇప్పటికీ ప్రపంచమంతటా పాఠ్యపుస్తకాల్లో విమానయాన రంగ సమాచారంలో రైట్ బ్రదర్స్ పేరు వినిపిస్తుందిగాని సుబ్బరాయశాస్త్రి, శివ్‌కర్ బాపూజీలపేర్లు కానరావు. వినపడవు. ఇదంతా పేటెంట్‌కున్న మహిమ.**

ఇటు ముంబయ్‌లో శివ్‌కర్ బాపూజీ ఆర్థికంగా, మానసికంగా కృంగిపోయి, అనారోగ్యంపాలై మతిస్థిమితం కోల్పోయి 1916లో మరణించారు. సుబ్బరాయశాస్త్రి సంగతి తెలియకుండా పోయింది. కాని 1930 సంవత్సరంలో జర్మనీలో నాజీలు సుబ్బరాయ శాస్త్రి, శివ్‌కర్‌బాపూజీల ఇతర డ్రాయింగుల ఆధారంగా గంట(బెల్) ఆకారపు విమానాలను, ఫ్లైయింగ్ మిషన్లను తయారు చేసి యుద్ధ అవసరాలకు వాడుకున్నారు. వాటికీ పేటెంట్ హక్కులు మన భారతీయులవి కావు. ఇది ఇలా ఉంటే 1973 సంవత్సరంలో వైమానిక శాస్త్రం పేర సుబ్బరాయ శాస్త్రిగారి పుస్తకం(ఆంగ్లంలో) ప్రచురితమైంది.

**భారతీయ మేధ ఆవిష్కరణలు ఆధునిక కాలంలో ఎలా తస్కరింప బడ్డాయో రికార్డులే చూపుతున్నాయి. అయినా మిన్నకుండటం ఏమేరకు సమంజసం?....ఈ ప్రశ్న ప్రస్తుత పాలకుల్లో కలగాలి. తొలి విమానాన్ని తయారు చేసి ప్రపంచానికి విప్లవాత్మక భరద్వాజుడి సూత్రీకరణలు సంస్కృతం నుంచి స్థానిక భాషల్లో పొందుపరచి ఆకాశంలో అపురూపమైన భారతీయ జండాలా విమానాన్ని ఎగుర వేసిన ఆ ఇద్దరు ప్రతిభావంతుల, మేధో సంపన్నుల స్మారకార్థం ఏం చేస్తే బాగుంటుందో తెలుగు-మరాఠీ ప్రజలు సూచిస్తే బాగుంటుంది. .... వందేమాతరం!**

## ఇకపై సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాదులోని శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా పేరు మార్చనున్నట్టు తెలంగాణ గృహ మంత్రిత్వ శాఖ మంత్రి నాయిని నరసింహారెడ్డి తెలిపారు.

-బద్రి కూర్మారావు
97047 98643

# జానపదకళలను, సాహిత్యాన్ని పరిరక్షించాలి

జానపదమనగా పల్లె. పల్లెప్రజలమధ్యన స్వతస్సిద్ధముగా పుట్టిన కళలే జానపదకళలు. ఇంగ్లీషులో వీటిని 'ఫోక్‌లోర్' అంటారు. హిందీలో లోక్‌గీత్ అని లోక్ సంస్కృతి అని అంటారు. జానపదకళలు, సామిత్యం ప్రపంచవ్యాప్తముగా ఉన్నాయి. ఆసియా, ఆఫ్రికా లాంటి ఖండాలలో ఈనాటికీ ఇవి సజీవంగా ఉన్నాయి. అమెరికాలో ప్రతిఏడాది పదివేల మంది కళాకారులతో జానపద కళాజాతం నిర్వహిస్తుంటారు. మనది వ్యవసాయక దేశమగుటచే అనేక వృత్తుల తోపాటు జానపదకళలు కూడా ఆవిర్భావించాయి. మహారాష్ట్రలో తమాషా, లావనీ, గుజరాత్‌లో దాండియా, రాజస్థాన్‌లో కాళబేలి, పంజాబ్‌లో భాంగ్రా, అస్సాంలో బిహూ, కేరళలో కధాక్కాళి, కర్ణాటక లో యక్షగానం వంటి కళలు ఉదాహరణ మాత్రమే. ఇలా అనేక రాష్ట్రాలలో అనేక జానపద కళలతోపాటు ఎంతో జ్ఞానపద సాహిత్యం ఉన్నాయి.

ఇక తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాతోపాటు, సరి హద్దు ప్రాంతాల్లో తోలుబొమ్మలాట, యక్షగానం, వీధి నాటకం, ఒగ్గుకథ, చిందుభాగవతం, గొల్లసుద్దులు, కురవంజి, తప్పెటగుళ్లు, జముకులు కథ, హరికథ, బుర్రకథ, పగటివేషాలు, కోలాటం, చెక్కభజనలు, పులివేషాలు, గరగలనృత్యం, భామాకలాపం, గారడీ విద్యలు, డప్పునృత్యం, గంగిరెద్దులాట, బుడిగెజంగాల కథలు, దాసరి పాటలు, హరిదాసుల పాటలు, పాములాటలు, రుంజవాయిద్యం, కొమ్ముదాసరి, పిచ్చుకగుంట్లు, మందెచ్చులు, పొడపోతలవారు, బుట్ట బొమ్మలు వంటి వందకు పైగా కళారూపాలతోపాటు థింసా, గొండు, కోయ వంటి గిరిజన నృత్యాలు ఎన్నోవున్నాయి.

ఇక తెలుగువారి జానపదసాహిత్యానికి వస్తే పిల్లల పాటలు, లాలిపాటలు, జోలపాటలు, స్త్రీలపాటలు, ఉడుపుల పాటలు, కోతల పాటలు, పెళ్లిపాటలు, సువ్విపాటలు, తిరగలి పాటలు, నలుగు పాటలు, బతుకమ్మ పాటలు, గౌరమ్మ పాటలు వంటి ఎంతో స్త్రీల జానపద సాహిత్యం ఉంది. వీటితోపాటు భారతం, రామాయణం, భాగవతంనకు సంబందించిన ఎన్నో పాటలున్నాయి. అలాగే చారిత్రక కధాగేయాలు ఉన్నాయి. ఇదంతా ప్రజలకు సంబంధించిన మౌఖిక సాహిత్యం.

అయితే ప్రస్తుతం ఈ జానపదకళల్లో కొన్ని అంతరించిపోగా మరికొన్ని కొన ఊపిరితో బతికియున్నాయి. అలాగే ఎంతో జానపద సాహిత్యం కనుమరుగై పోయింది. ఈ కళలపై ఆధారపడి జీవించే లక్షలాది మంది కళాకారుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. కొంతమంది వృత్తులను వదిలి కూలీలుగా మారగా, మరికొంత మంది బిక్షగాళ్లుగా మారి మనకు ప్రయాణాలలో తారసపడుతుంటారు. సినిమాలు, టి.వి.లు రాకముందు నిరక్షరాస్యులకు ఈ కళాకారులు భారతజాతికి భారత రామాయణ, భాగవత కధలతో పాటు వీర గాథలు, చారిత్రిక గాథలు వినిపిస్తూ విజ్ఞానాన్ని వినోదాన్ని అందించారు. అసలు నేటి సంగీత సాధనాలకు జానపద సంగీత సాధనాలే మూలమనే సంగతి మరువరాదు.

ఫ్రెంచి విప్లవ కాలంలోను, సాంస్కృతిక ఉద్యమాలలోనూ, రష్యా విప్లవములోనూ, భక్తి ఉద్యమంలోనూ, స్వాతంత్ర్య ఉద్యమంలోనూ ఈ జానపద కళలు, పాటలు ఎంతో పాత్రపోషించాయి. వామపక్ష పార్టీల ఉద్యమాలకు ఈ పాటలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఒక విధముగా హిందూమత ప్రచారానికి పరోక్షంగా ఈ కళలు తోడ్పడ్డాయి.

ఈ జానపద బాణీలను ఉపయోగించి సినిమా పాటలలో జాన పదాలను చొప్పించారు. అయితే సినిమా, టి.వి కంప్యూటర్ సెల్‌ఫోన్ వంటి ఆధునిక సాధనాల రాకతో ఎన్నో జానపద కళలు కనుమరుగై పోగా, ఎంతో జానపద సాహిత్యం కాలగర్భంలో కలిసిపోయింది. ఒకనాడు ప్రజలు, ప్రభువులు కాపాడిన ఈ కళాకారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉదాహరణకు తెలుగు సంస్కృతి చెప్పగానే గుర్తువచ్చేది గంగిరెద్దుల వారి సంస్కృతి. కాని నేడు గంగిరెద్దుల వంటి సాంస్కృతిక కులాల పరిస్థితి ఎలా ఉంది? మన సంస్కృతిలో భాగమైన ఈ కళలు, సాహిత్యాన్ని కాపాడడానికి మనము, మన ప్రభుత్వాలు ఏమాత్రం స్పందిస్తున్నాయి? తెలుగు భాషతోపాటు ఇతర మాతృభాషలే కనుమరుగైపోతున్న ప్రస్తుత కాలంలో ప్రస్తుత తరానికి ఈ కళలు, సాహిత్యంగూర్చి తెలియజేయవలసిన బాధ్యత మనది. కాబట్టి ఈ కళలు, సాహిత్యం, పరిరక్షణకు ప్రభుత్వంతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, దేవాలయాలు కృషిచేయవలసి ఉంది.

**అందుకు**

- జానపదకళలను, సాహిత్యాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాలి.
- జిల్లాలవారీగా కళలు, కళాకారులపై సర్వేజరిపించి కళాకారులును గుర్తించి వారికి ఫించను సౌకర్యాలు కల్పించాలి.
- పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులకు ఈ కళలను పరిచ యం చేయాలి. జానపద కళాశాలలను, అకాడమి నెలకొల్పాలి.
- ఆశ్రిత కులాలకు, సంచార జాతులకు, వృత్తి కళాకారులకు, ప్రత్యేక పథకాలను ప్రకటించాలి. తిరుమల తిరుపతి దేవస్థానము, శ్రీశైలం, రాజరాజేశ్వరి దేవస్థానం, సింహాచలం, అన్నవరం, వంటి దేవాలయాలతో పాటు ఆదాయాన్నిచ్చే గ్రామ దేవతల గుడులు ఈ కళలను దత్తత తీసుకొని ప్రోత్సహించాలి.
- ఆధునిక సాధనాల ద్వారా ఈ కళలు సాహిత్యాన్ని భద్రపరిచి, భావి తరాలకు అందించి ఈ కళలకు వారసులను తయారు చేయాలి.
- సాంస్కృతికశాఖ ఈ కళలను, కళాకారులను బ్రతికింప జేయ డానికి కృషి చేయాలి.

-పవన్ సంతోష్
9640656411

# భాషాసేవ - వికీపీడియా

**తెలుగు భాషాభివృద్ధి అన్న మాట ఇటీవలి కాలంలో చాలా ప్రాచుర్యంలోకి వచ్చింది, అలానే భాషాసేవ అన్న పదబంధం కూడా మంచి ప్రచారం నోచుకుంది. అయితే ఈమాట తలచుకోగానే చాలమంది తలపులోకి వచ్చే విషయం అమ్మా నాన్న అనే బదులు పిల్లలు డాడీ అనడం, ఒక్క పదం ఆంగ్లం రాకుండా తెలుగు మాట్లాడ లేక పోవడం లాంటివి. ఇంకాస్త అవగాహన ఉన్నవారికి అయితే బోధన మాధ్యమంగా తెలుగుకి ఉన్న స్థానం కోల్పోతూండడం కూడా గుర్తొస్తుంది. అయితే భాషాభివృద్ధి విషయంలో మరెన్నో కోణాలు ఉన్నాయి. భాషాసేవ అంటే కొన్ని కవితలో, కథలో రాయడానికి మించి -మరెంతో ఉంది.**

### భాషా సరస్వతి బహు ముఖాలు

వాడుక భాషగా తెలుగుకు వస్తున్న సమస్యలపై జనంలో విస్తృత అవగాహన ఉంది. అలానే పాలన భాషగా తెలుగును నిలబెట్టాలంటూ తీర్పులు తెలుగులో చెప్పడం, ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడం చూశాం. ఇక బోధన భాషగా తెలుగును నిలబెట్టేందుకూ ప్రయత్నాలు జరుగు తున్నాయి. సాహిత్య భాషగా తెలుగు దృశ్యమాధ్యమాలైన సినిమా, సీరియళ్లు వంటి వాటి ద్వారా వెలుగులీనుతోంది. అయితే వీటన్నిటికీ మూలస్తంభంలా ఉండాల్సిన విజ్ఞాన భాష అనే ముఖం, పరిశోధన భాష అనే ముఖం వెలతెలా పోతున్నాయి. దురదృష్టవశాత్తు తెలుగు భాషాభిమానుల్లో ఎందరికో ఈ ప్రధానమైన సమస్య చేరకపోవడం అన్నది దీనిపై జరుగుతున్న కృషిలో వారు భాగం అయ్యే వీలూ ఇవ్వడం లేదు. ఒక జబ్బు గురించో, ఒక అంతర్జాతీయంగా ప్రఖ్యాతి పొందిన సినిమా గురించి, ఒక సామాజిక శాస్త్ర సిద్ధాంతం గురించి, ఒక గణిత శాస్త్రజ్ఞుడి కృషి గురించి, అంతవరకూ దేనికి మన తెలుగు సినిమాల గురించో, గ్రామాల గురించో దేని గురించైనా నిష్పాక్షికంగా, సరైన ఆధారాలు, మూలాల మీద ఆధారపడి అభివృద్ధి చేసిన సమాచారం చాలా తక్కువ. అందులోనూ అందుబాటులో ఉన్నది మరీ తక్కువ.

### తెలుగు వికీపీడియా కృషి

ఇటువంటి స్థితిగతుల్లో అంతర్జాలంలో స్వేచ్ఛగా ఎవరైనా పంచుకోగలిగిన, ఎవరైనా అభివృద్ధి చేయగలిగిన విజ్ఞాన సర్వస్వం అయిన తెలుగు వికీపీడియా ఈ సమస్యకు ఒక చక్కని పరిష్కారం. గ్రామం గురించి, ప్రముఖుల గురించి, సినిమాల గురించి మొదలు కొని చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానాలు, మతం ఇలా ఒకటేమిటి సర్వ విజ్ఞానం తెలుగులో అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం. అయితే విశేషం ఏమిటంటే ఇందులో లభించే సమస్త సమాచారం హాయిగా, వికీపీడియా నుండి తీసుకున్న విషయం రాసి ఎవరి నుంచీ ముందస్తు అనుమతి అక్కరలేకుండా ఎవరైనా, ఎందుకైనా వాడుకోవచ్చు. అలానే దీన్ని వికీపీడియన్లే రూపొందించే మార్గదర్శకాలు, పాలసీలు అనుసరించి ఎవరైనా అభివృద్ధి చెయ్యొచ్చు.

వికీపీడియాను మీరూ అభివృద్ధి చెయ్యొచ్చు:

తెలుగు వికీపీడియా అన్ని విధాలా మనందరి ఆస్తి. దాన్ని అభివృద్ధి చేయడం ద్వారా భావి తెలుగు విజ్ఞాన విప్లవంలో భాగం అయ్యే అవకాశం మనందరికీ ఉంటుంది.

ఇందుకు ముందుగా తెలుగు వికీపీడియా (*te.wikipedia.org*) కి వెళ్లి కుడివైపు పైన ఉండే ఖాతా సృష్టించు అన్న బటన్ నొక్కి మీ ఖాతా సృష్టించుకోండి. ఆపైన ఏదైనా మీకు నచ్చిన అంశంపై వ్యాసం ఉందో లేదో కుడివైపే పైన ఉండే సెర్చ్ బాక్స్‌లో వెతికి చూడండి. హైదరాబాద్ అన్న నగరంపై వ్యాసం కావాలంటే హైదరాబాద్ అన్న పదమే కాకుండా హైదరాబాదు, హైదరాబాద్ అని ఆ పదాన్ని ఎన్నిరకాలుగా రాయొచ్చో అన్ని రకాలుగా వెతకండి. ఒకవేళ ఇప్పటికే దానిమీద వ్యాసం ఉంటే, చదివి మీరు ఏదైనా కొత్త అంశం రాయ గలిగితే సవరించండి అని వ్యాసం పైన ఉండే బటన్ నొక్కి మీరు ఆ విషయం ఏ పుస్తకం లేదా వ్యాసంలో చదివారో దాన్ని రిఫరెన్సుగా ఇస్తూ రాయండి. ఒకవేళ మీరు అనుకున్న అంశం మీద వ్యాసం లేకుంటే, అది విజ్ఞాన సర్వస్వంలో ఉండకూడనిది (అంటే మీరు రాసిన కథలు, కవితలు కానీ, మీ గురించో, మీ ఇంట్లో వాళ్ళ గురించో కానీ, వగైరాలు) కాకుంటే వెతికినప్పుడు వ్యాసం రాకుండా మీరు కోరుకుంటున్న వ్యాసం లేదని ఎర్ర లింకులో వస్తుంది. ఆ ఎర్ర లింక్ నొక్కి ప్రారంభించెయ్యండి. మీరు ఏ విషయం రాసినా కూడా నిష్పాక్షికం అయింది, మీరు సొంతంగా కనిపెట్టింది, విజ్ఞాన సర్వస్వానికి పనికిరానిది కాకూడదు. మిగిలిన విషయాల్లో అనుమా నాలు వస్తే, తోటి వికీపీడియన్లు సాయం చేస్తారు.

### వ్యాసాలు రాయడమే కాదు, మరెంతో చెయ్యొచ్చు

పుస్తకం, పత్రిక, వెబ్‌సైట్ వంటివి చదివి విజ్ఞాన సర్వస్వ వ్యాసంగా మలచడం, ఇప్పటికే ఉన్నదాంట్లో మరింత సమాచారం చేర్చడం ఉత్సాహభరితమైన పనే. కానీ కొందరికి వేరే పనులపై ఆసక్తి ఉండొచ్చు. అలాంటి వారు అక్షర దోషాలు వెతికి వ్యాసాలు సరిద్దడం, తాము తీసిన ఫోటోలను వికీమీడియా కామన్స్ (Wikimedia Commons) లో ఎక్కించి సంబంధిత వ్యాసంలో చేర్చడం, కావాలని ఎవరైనా తప్పుడు సమాచారం చేరుస్తూంటే గమనించి సరిదిద్దడం (ఇందుకు వికీపీడియా వెబ్‌సైట్‌లోఎడమవైపు బార్లో కనిపించే ఇటీవల మార్పులు అన్న బటన్ ఉపయోగపడుతుంది) ఇలా ఎన్నెన్నో చెయ్యొచ్చు. ఒక రాజ్యం నిర్మించినట్టో, ఒక ఉద్యమం నడిపించినట్టో సాగుతుంది కనుక తెలుగు వికీపీడియాలో ఎవరికి సాధ్యమయ్యే పని వారికి ఉంటూనే ఉంటుంది. కాబట్టి ఇదే ఆహ్వానం *te.wikipedia.org* కి రండి అక్కడ కలుద్దాం. అన్నట్టు సెర్చ్ బాక్స్ లో వాడుకరి: *pavansanthosh.s* అని వెతికితే నా వాడుకరి పేజీ వస్తుంది. ఉంటానండి.

పుస్తక సమీక్ష




- సన్నిధానం నరసింహశర్మ
9292055531

తెలంగాణా సమరక్షేత్రాలలో

# కవి 'మిత్ర' కైతల కవాతు

పాటకు పట్టం కట్టిన పోతుగడ్డ తెలంగాణ, నిరంకుశ పాలకుల వల్ల ప్రజో ద్యమ వ్యతిరేకులయిన ఏలికల వల్ల, ఆధిపత్య దుర్గుణాలు జీర్ణించుకున్న వారి వల్ల, శ్రామిక, కర్షక జనాలను అణచి వేతలకు పాల్పడే వారివల్ల వివిధ సమరాలకు కేంద్ర స్థానమయింది. ఆ సమరాలు అనేక కవుల కలాల గళాలు సైనికులయ్యాయి. ఆ కవుల్లో ప్రజాకవి 'మిత్ర'పాత్ర విస్తృతమైనదీ, అనేక భూమికల్ని కలిగివున్నది. ఆయన 'కైతలకదారు' యీ పొత్తం.

'తెలంగాణా సమాజాన్ని ఏకత్రాటిపై తేవడంలో పాట ఉద్యమ నాయకుడిగా ఉండి పాత్ర నిర్వర్తించింది' అంటారు మిత్ర. కొన్ని కబ్బాలకి పీఠికలు కేవలం అలంకార ప్రాయాలుగా ఉంటాయి. కాని వీటిలోని పీఠికలు ఆలోచనాత్మక పేటికలు అని పాఠకులు ఒప్పుకొనేలా కవచ ధారణల్లో వున్నాయి. ఆచార్య జయధీరులు 'వచనకవి, వ్యాసకర్త చేరని, దూరని చోటుకి ప్రజాకవి మాత్రమే ప్రవేశించగలడు, జనసందోహంలోకి పాట పాస్‌పోర్టు వంటిది' అంటూ కవిత్వం, కాల్పనికత, బయటి, లోపలి కైతలు వంటి వెన్నో శాస్త్రీయంగా చర్చించారు. కె.డి-కూర దేవీందర్-ఉరఫ్ అమర్-ఉరఫ్ మిత్ర వెరసి జనశక్తి, పార్టీ' అంటూ 'గతంలో చాలావరకూ చెవులతో విన్నవే, కళాత్మక విన్యాసాలతో రంగస్థలంపై చూపినవే. గడచిన మూడున్నర దశాబ్దాల చరిత్రని ఈ కవితలద్వారా కళ్ళతో చూడబోతున్నాం' అనేది సరైన బేరీజు వేయడమే, శ్రీ కె.శ్రీనివాస్' తెలంగాణ ఉద్యమం కేవల భావోద్వేగ అంశంకాదని అది లక్ష్యంగా పెట్టుకున్న అనేక భౌతిక విజయాలను సాధించి తీరవలసిందే' అని తెలంగాణావాదులు సీరియస్‌గా భావించిన అంశాన్ని ప్రస్తక్తి చేశారు.

మిత్ర రచనల్లో 'ప్రాంతీయ వాదుల, సామాజిక న్యాయం లక్ష్యం కలిసి కొత్త వ్యక్తీకరణలు అందించాయనే,' శ్రీనివాస్ లోచూపు ఈ కవిత్వ పరనానుభూతుల్లో చూడగలుగుతాం.

డా॥నలిమెల భాస్కర్ 'కథంతొక్కిన పథం' పీఠికలో మిత్రగారి సృజనాత్మకతలోని అసలు సిసలు కవితాంశాలను చాలా ప్రాకృతికంగా చెప్పారు. డా॥సి.కాశీం - 'మిత్ర' తెలం'గానం'లోని కైత ఉటంకింపులు ఎక్కడెక్కడకో తీసుకువెళ్ళి కవి చేతులెత్తి నమస్కరింపజేస్తాయి. స్కైబాబ- 'నిజాని'క ఇవాళ మళ్ళీ మనువాదం హిందూత్వ సర్పం వెయ్యి తలలుగా మనల్ని కాటేయడానికి సిద్ధమయింది. ముందుముందు ఎంతో ప్రమాదాన్ని ఎదుర్కొనబోతున్న వాతావరణం ఆవరించింది.... ఈ సందర్భంలో మన ముందుకు వస్తున్న మిత్రపాటలు ఒక మంచి మార్గదర్శనం చేస్తా'యని ఆశించారు. తన ఆటతో, పాటతో రెండు తెలుగు రాష్ట్రాల్లో లెక్కలేనంత మంది అభిమానులుగల విమలక్క 'తెలంగాణ కోసం పోరాడిన వాళ్ళను సైతం వెనక్కు నెట్టుతున్న పరిస్థితుల్లో ప్రశ్నించే పాటలు ఆగిపోవద్దు, గొంతులు మూగపోవద్దు' అని పిలుపునిస్తూ ఈ కైతల కవాతు గతానికి సమీక్ష, వర్తమాన వాస్తవం, భవిష్యత్‌కి కొనసాగింపుగా మళ్ళీ ప్రజల్లోకి తెస్తున్నాం' అన్నారు. అంతేకాక నవతెలంగాణ ఉద్యమం నిర్మాణంలోనూ ఈ పుస్తకం కూడా ఒకానొక పాటల ఆయుధం కావా'లని' ఆకాంక్షిం చుదాం. రమణజీవి వేసిన ముఖచిత్రం అద్భుతం. లోపలిచిత్రాలు బాగున్నాయి.

చరిత్ర గానం, విముక్తిగీతం, సాంస్కృతిక జనరాగం, ఉద్యమ చరిత్రలో ధూంధాం, ఉద్యమపదం, మైనార్టీలగీతాలు, వనరులకోసం దరువులు, ఆవేద ఆగ్రహగీతం, రెంతాంగపల్లివి, గిరిజనగీతం, స్త్రీవిముక్తిబాట, శ్రమరాగం, కలం-గళంకోసం రాగాల్లో కుల హక్కులు, సామాజిక నవ తెలంగాణం, అమరులపై అజరామరబాణి, హిందీ అనువాద పాటలు, వచనకవితాగానం నృత్యరూపగానాలు అనే పందొమ్మిది శీర్షికలలో ప్రవహించిన మిత్రకవితలు ఇన్ని కలిసి పెద్ద సంపుటంగా వేసిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విప్ల వాక్షరాలా అభినందనీయం.

రైతన్న బలిపై పాటలో 'బలిరబలిరబలిరా/రైతుఎలాబలిరా/బలిరబలిర/ కూలరెన్నికెలా ఉరిరా/... ఆ విత్తనాల భారం/ పురుగు మందు ఘోరం/ పెట్టుబడులు పెరిగీ/గిట్టుబాటు తరిగీ.../... సర్వస్వం దోసిడై' ఉన్న సందర్భాన రైతురాజ్యానికి బాటలు వేయాలని ప్రబోధిస్తారు.

మాల మాదిగల సమస్యలపై, గిరిజన, బహుజన సమస్యలపై - సమయ సందర్భ ఉద్యమకారుల కవితలు మిత్రా ఆయా సమస్యల నివేదికల సారాంశాలకు కవితారూప కల్పనలు చేశారు. ఏ అంశంపై కొంతైనా దాని సమస్యో, చరిత్రో అంతర్జ్వాలై బహిర్గతమవుతుంది.

కొన్ని పాటల్లో వచనధోరణి వుండడం ఆయా అంశాలు ప్రజలకు పాటబలకడానికే. తొంభైశాతం పాటల్లో అటు కవిత్వమూ ఇటూ ఉద్యమ ప్రబోధమూ రెండూ పడుగు పేకలై అతుక్కుపోయాయి. భౌగోళిక తెలంగాణ నుండి నవతెలంగాణాదాకా పయనం ఆపొద్దు, పోరాట మాపొద్దు అంటారు మిత్ర.

'సామాజిక న్యాయపోరు జెండాపట్టరో/ తెలంగాణ సాధనకు దండూ గట్టరో/ సీమాంధ్ర అగ్రకుల భూస్వాములతో/ ప్రాంతీయ ప్రజాస్వామ్య పందె మెయ్యరో అంటూ సర్వకుల ప్రజలనూ పాటల ద్వారా చైతన్య పరుస్తారు. సహజమైన ఉద్రేకం, ఆలోచనాధోరణుల్లో సంయమనం, నేలకూలిన తెలంగాణ వీరుల, ప్రముఖుల, సామాన్య జనాల్లో సమిధల కీర్తిగానం, ఇంత విస్తృతంగా ఉన్న బృహత్తరమైన పాటల పేటిక మిత్రదే అని శ్లాఘించేలా ఉంది.-తెలంగాణా మందికి చెందిన ఈ గీతావళి.

ఓట్లు దొబ్బుటకు తెలంగాణ పాట/ సీట్లనెక్కినంక తైతక్కలాట అని పాలకుల్ని విమర్శిస్తారు.

ఈ తెలంగాణా ప్రజోద్యమ కవి రెండు తెలుగు రాష్ట్రాలూ సభ్యతతో ఉండాలని కోరుకునే విశాల భావాల్ని పాటల్లో విత్తనాల్లా నాటుతారు. 'ఎక్కడున్న మన తెలుగు ప్రజలు/ కలసివుందాము రా తమ్ముడా?/ కలత బెంగ వదులు చెల్లెలా? తెలంగాణాతో తేడేమీ రాదు/ తెలుగు రాష్ట్రాలతో బలమేమిపోదు/ అంటూ.... పొట్ట తిప్పల కోసం పదుతున్న గోస/ కట్టుగుంచగలు మాట్లాడే భాష' అనడం భాషాపరమైన సమైక్యతను సదాశయంగా ప్రకటించడమే.

తెలంగాణా సర్వసమర క్షేత్రాలలో ఇది మిత్రగారి కైతల కవాతు! ఈ పుస్తకంలోని పాటల్లో అగ్నికణాలున్నాయి. అన్ని ఆకాంక్షలూ ఉన్నాయి. ప్రజాకవి మిత్ర స్థానం సమున్నతమైనది.

**(కైతల కవాతు**-తెలంగాణా జనవిముక్తి గీతాలు, రచన: మిత్ర. 490 పుటలు. వెల.రూ200లు. ప్రతులకు సహచర బుక్‌మార్క్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాదు, నవోదయా బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాదు, మైత్రి బుక్‌హౌస్, విజయవాడ).

వ్యంగ్య రచన

-డా॥వేదగిరి రాంబాబు
9391343916

# తెలుగుభాష కావాలా? బంగారు భవిష్యత్తు కావాలా?

రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాక, మిగతా రాష్ట్రాలలో కూడా తెలుగు మాట్లాడేవాళ్ళు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో కథానికా సదస్సులు నిర్వహించిన తర్వాత కథానికల గురించి ఎన్ని విషయాలు తెలిసాయోకానీ, చిన్నప్పటినుంచి తెలిసిన ఓ బాలసాహిత్య కథ పదేపదే గుర్తుకు రాసాగింది.

ఆ కథ – అనగనగా ఒకరాజు ఆ రాజుకి ఏడుగురు కొడుకులు, వేటకి వెళ్ళి ఏడుచేపలు తెచ్చారు.

అన్ని సదస్సులలోనూ రచయితలూ, రచయిత్రులే పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కొన్ని కొన్ని సభలలో వీళ్ళ తాలూకు బంధువులు మిత్రులు కూడా హాజరయ్యారు కానీ, ఏ సభలోనూ పాఠకులు కనిపించలేదు. దాంతో ఓ సభకి హాజరైన ఓ సీనియర్ రచయితని "కథానికలు చక్కగా రాయగలిగిన మీలాంటివారు రాయడం మానేయడం వల్లే పాఠకులు దూరమయ్యారేమో!" అన్నాను.

"పత్రికలలో ఈ తరంవాళ్ళు చాలామంది అశ్లీలపదాల్ని జోరుగా కలుపుకుంటూ రాసే రాతల మధ్య, నాలాంటివాళ్ళు రాసే కథానికల్ని వద్దనుకున్నా అంతే! పాఠకుల్ని మేమెందుకు దూరం చేసుకుంటాం. అయినా నాకన్నా ఇదే ప్రశ్న ఈతరం రచయిత నడిగితే తెలుస్తుం దేమో!" అన్నాడాయన నావంక చిరాగ్గా చూస్తూ.

"ఈ తరం రచయితా! ఈ తరం రచయితా! నువ్వు అశ్లీల పదాలతో మలిన సాహిత్యాన్నెందుకు సృష్టిస్తున్నావ్? అందుకే పాఠకులు సాహిత్యం దరిచేరకుండా పారిపోతున్నారా?" ఈ తరం రచయిత నడిగాను.

"సంపాదకులు అలాంటి రచనలను వేస్తున్నారు కాబట్టే అలాంటి రచనలు చేస్తున్నారు" చటుక్కున అన్నాడు ఈతరం రచయిత. సంపాదకుల దగ్గరకు వెళ్ళాను. "సంపాదకులూ! సంపాదకులూ అలాంటి రచనల్నే ఎందుకు వేస్తున్నారు?"

"పాఠకులు అవే కావాలని కోరుకుంటున్నారు కాబట్టి!" అంతకన్నా చటుక్కున అన్నాడు సంపాదకుడు.

జవాబు దొరకక అప్పటినుంచి ఎక్కడైనా ఓ పాఠకుడైనా కనిపిస్తాడేమోనని ప్రతిసభలో వెదకసాగాను.

నా అజ్ఞానానికి, అచ్చెరువందిన ఓ రచయితగాని ఓ రచయిత "పిచ్చివాడా! రచయితలున్న చోట పాఠకుల్ని వెదుకుతావెందుకు? ఈ సాహితీ సభలన్నీ, నేతి బీరకాయలే! సాహిత్యముంటే కదా ఈసభలో పాఠకులుండడానికి!" అన్నాడు ఫెళ్ళున నవ్వేస్తూ.

"మరి..." అర్థంగాక అయోమయంగా బుర్రగోక్కుంటున్న నాతో ఆయన మళ్ళీ ఇలా అన్నాడు "ముందు ముందు సాహిత్యసభలలో మేము కూడా కనిపించం" అని.

"అదేమిటి?" నాలో అయోమయం ఎక్కువైంది.

"సాహిత్యముంటేకదా రచయితలు, పాఠకులు కనిపించ డానికి..."

"నువ్వు రచయితవి కావా" అని ఆశ్చర్యంగా నేనడిగిన ప్రశ్నకి ఆ రచయితే "అయ్యా బాబూ! అందుకే నీకు భూత భవిష్యత్ వర్తమానాలు చెప్పగల్గుతున్నాను" అన్నాడు గీతని బోధించే కృష్ణుడిలా!

"అదేమిటి!"

"ఇంక నువ్వు ఆశ్చర్యపోవడం మానేయ్! అసలు విషయం చెబుతాను. నేను రచయితనే అనుకుంటుంటే నా రచనలే కాదు నేనూ కాలగర్భంలో కలసిపోతాను." ఆ భయంతోనే ప్రచురణకర్తనై నా రచనలన్నీ నేను గ్రంథాలుగా తెస్తున్నాను. తెచ్చిన గ్రంథాల్ని మరి అమ్ముకోవాలిగా అందుకని పుస్తక విక్రేత నవ్వుతున్నాను! ఇన్ని రూపాలెత్తాల్సిన నేను, రచయితను నేను... సాహితీవేత్తననుకుంటూ సభలకి ఇంకా ఎలా రాగల్ను?"

రచయిత అడిగిన ప్రశ్నకు నేను నిజంగానే అవాక్కయ్యాను.

"నిజమే! ఇన్ని పనుల మధ్య రచయిత తన రచనలు రాసుకుం టూనే ఎలా ఉండగలడు? తాను సాహిత్యసృష్టి చేస్తున్న భాష గురించి ఎలా ఆలోచించగలడు?" ప్రస్తుతమున్న స్థితి తెలీకుండా ఎంత అమాయకంగా ఆలోచిస్తున్నాను అనిపించింది నాకు.

నిజమే కదా! నాల్గు డబ్బులు రావాలి. నాల్గు కాలాల పాటు పేరుండాలి... అని ఆశించే రచయిత వ్యాపారధోరణిలో ఆలోచించ గలడుగాని భాష, విలువలు, పాఠకుడు అంటూ ఎక్కడ ఆలోచించ గలడు?

ఇలా క్రమంగా సాహితీవేత్తలు తెలుగుభాషని పట్టించుకోని పరిస్థితులు...ఆ విషయాన్ని ఖండించని పాఠకులు... యథాప్రజా తథారాజా అన్నట్లు క్రమంగా ప్రభుత్వమూ మరచిపోయింది తెలుగు భాషని!

అందుకే పుట్టినప్పటినుంచి పాఠశాలకి వెళ్ళేవరకూ మూడేళ్ళు ముప్పుతిప్పలుపడి నేర్చుకున్న తెలుగుభాషని నువ్వు చదువుకోవడానికి పనికి రాదంది! ఈ తెలుగు మాధ్యమంలో మీ భవిష్యత్తు శూన్య మంటూ బంగారు భవిష్యత్తుకోసం ఆంగ్ల మాధ్యమమే మేలని చెవినిల్లు పెట్టుకుని పోరాడడమే కాకుండా మనకి స్వాతంత్ర్యం వచ్చినా భావ, భాషలలో స్వాతంత్ర్యం రాకపోవడంతో భవిష్యత్తుకి ఆ ఆంగ్లేయుల భాషే మేలన్నది!

ఆంగ్ల భాషకింద పడి నలిగిపోతున్న తెలుగుభాష ఆక్రందనలు వినిపిస్తాయేమో వినిపించుకోకండి. వినిపించుకున్నారో వెనుకబడి పోతారు. ప్రజలకు, ప్రభుత్వానికి పట్టని తెలుగుభాష ఆక్రందనలను విని 'అయ్యో' అన్నారంటే ఆ తర్వాత మిమ్మల్ని చూసి 'అయ్యో' అనేవాళ్ళే ఉండరు. జాగ్రత్త! ఓ సాహితీవేత్త ఇలా అన్నాడని మీరెవరికైనా చెప్పారంటే మీ పిల్లలకు ఆంగ్లమాధ్యమంలో చదవడానికి సీటు దొరకనంత ఒట్టు! తెలుగుభాష కావాలో బంగారు భవిష్యత్తు కావాలో తేల్చుకోండి. **ఇది నా మాట కాదు – మన మంత్రివర్యుల మాట! తెలుసా?**

ఇది కేవలం తెలుగు సాహితీవేత్తలకే కాదు తెలుగుభాష ద్వారా సేవలందించడానికి ప్రయత్నించే పాత్రికేయులకు, మాధ్యమ మిత్రులకు, చలనచిత్ర సాంకేతిక నిపుణులకు, నటులకు– అందరికీ స్టాట్యుటరీ వార్నింగ్! తెలుగుభాషని వాడి భవిష్యత్తుని శూన్యం చేసుకోకండి. తెలుగుకు దూరంగా ఉండండి – మీ జీవనాన్ని నందనవనం చేసుకోండి! ఇదీ నేటి నినాదం!?

-వెంకటేష్ కందుల

# తూర్పు చాళుక్యులు

**తూ**ర్పు చాళుక్యులనే వేంగి చాళుక్యులు అని అనేవారు. బాదామి చాళుక్యుల్లో ప్రముఖుడైన రెండో పులకేశి తీరాంధ్ర దేశంపై దాడి చేసి పిష్టపుర (ప్రస్తుత పిఠాపురము, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్), కునాల యుద్ధాల్లో విజయం సాధించాడు. సోదరుడైన కుబ్జ విష్ణువర్ధనుడిని రాజప్రతినిధిగా నియమించాడు. క్రీ.శ. 616 నుంచి రాజప్రతినిధిగా కొనసాగిన కుబ్జ విష్ణువర్ధనుడు క్రీ.శ. 624 నుంచి రెండో పులకేశి అనుమతితో స్వతంత్రుడయ్యాడు, ఇతడి వారసులు 28మంది రాజులు తూర్పు చాళుక్యులుగా ప్రసిద్ధులై నాలుగున్నర శతాబ్దాల పాటు (624 AD to 1076 AD) తీరాంధ్ర దేశాన్ని పాలించారు, తూర్పు చాళుక్యుల పాలన తెలుగువారికి గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రసాదించింది. వీరి రాజధాని వేంగి (ప్రస్తుత పెద్ద వేగి గ్రామము, పచ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్)

**కుబ్జ విషవర్ధనుడు :**

విశాఖపట్నం నుంచి గుంటూరు వరకు ఉన్న ప్రాంతాన్ని పాలించాడు. వన, స్థల, జల, గిరి లాంటి విషమదుర్గాలను జయించి, సమర్థుడిగా పేరు పొందాడు. అందువల్ల ఇతడికి "విషమసిద్ధి" అనే బిరుదు వచ్చింది. ఇతడి భార్య అయ్యణ మహాదేవి బెజవాడలో కవరూరి గణ జైనుల కోసం నెడుంబ బసది నిర్మించింది. ఈ జైనశాఖ ప్రధాన కేంద్రం గుజరాత్‌లో ఉండేది. కుబ్జ విష్ణువర్ధనుడికి "మకరధ్వజుడు" అనే బిరుదు కూడా ఉంది.

**గుణగ విజయాదిత్యుడు:** (848AD -90)

ఇతడు ప్రముఖుడైన తూర్పు చాళుక్య రాజు. బిరుదారకపోలు (బిక్కవోలు) అనే పట్టణాన్ని, అక్కడ చంద్రశేఖరాలయాన్ని నిర్మించాడు. ఆద్దంకి శిలాశాసనం, సీసలి తామ్రాశాసనం; సాతులూరు, గుంటూరు మచిలీపట్నం శాసనాలను చేయించాడు

చాళుక్య భీముడు; ఇతడు దేవాలయ నిర్మాణంలో లలిత కళాపోషణలో ఆసక్తి చూపారు. సామర్లకోట సమీపంలో చాళుక్య భీమవరం అనే కొత్త పట్టణాన్ని, అందులో భీమేశ్వరాలయాన్ని నిర్మించాడు. గోదావరి తీరంలోని ద్రాక్షారామంలో భీమేశ్వరాలయాన్ని నిర్మించాడు. భీముడి సామంతుడైన ఛాత్రపదు బెజవాడలో ఇంద్ర కీలాద్రి పర్వతం దగ్గర పార్థేశ్వర దేవాలయాన్ని నిర్మించాడు. సమస్త గాంధర్వ విద్యా కోవిదురాలు ఐన చెల్లవ్వ భీముని ఆస్థానంలో ఉండేవారు. అత్తిలి గ్రామాన్ని ఆమెకు దానం చేశాడని అత్తిలి శాసనం ద్వారా తెలుస్తోంది. ఆమె తండ్రి మల్లప్ప సంగీతంలో తుంబురుడి లాంటివాడిగా ప్రసిద్ధి చెందాడు.

**చాళుక్య రాజ రాజ నరేంద్రుడు (1022-61):**

రాజమహేంద్రవరము ఇతడి రాజధాని. ఆంధ్ర మహా భారత మహా కవి నన్నయ్య ఇతని ఆస్థాన కవి. ఇతడి బంగారు నాణేలు మధ్యలో వరాహము చుట్టూ శ్రీ రా జ రా జ స లేదా శ్రీ దే వ శ్రీ రా జ శ్రీ అనే ప్రాచీన తెలుగు అక్షరాలు పంచ్ (Punch Mark) చేయబడి ఉండును రాజేంద్రుడు (రాజేంద్ర కులోత్తుంగుడు) ఇతని కుమారుడు.

**రాజేంద్ర కులోత్తుంగుడు (క్రీ.శ.1070 నుండి క్రీ.శ.1118):**

చోళ రాజరాజు 1 కి మనుమడు(కూతురు కొడుకు ) ,చోళ రాజేంద్రునికి అల్లుడు (ఇతని తల్లి, భార్య చోళరాజు కుమార్తెలే) సైన్యముతో రాజమహేంద్రవరమును విడిచివెళ్ళి చోళ సింహాసనాన్ని అధిష్టించాడు. ఇచట అతడు గవర్నర్‌లను నియమించాడు.

తూర్పు చాళుక్యుల వరాహ (పంది) చిహ్నాన్ని(గుర్తుని) తమ బంగారు నాణాలపైన ముద్రించి చలామణి చేయడం వలన, వాటికి అప్పటినుండి వరాహ అని పేరు వచ్చింది. కాల క్రమములో దక్షిణ భారతదేశంలో పెద్ద బంగారు నాణాలకు వరహాలు అనేపేరు కొనసాగింది.






ఇవి నేను సేకరించిన తూర్పు చాళుక్యుల నాణెములు

ఈ సామ్రాజ్య స్థాపకుడు కుబ్జ విషవర్ధనుడు విడుదల చేసిన వెండి & ముడి (శుద్ధి చేయని) రాగి కలిపిన నాణాలపైన ఇతని బిరుదు శ్రీ విశమసిద్ధి అని 7 వ శతాబ్దపు బ్రహ్మీ తెలుగు లిపిలో కుడి వైపుకు తిరిగి ఉన్న సింహం పైభాగాన వ్రాసి ఉండును. ఈ నాణెముల వెనుక దీపపు స్తంభాల మధ్యలో శ్రీవత్స/ పెద్ద దీపపు స్థంభము చిహ్నం ఉంటుంది. వీటి బరువు 3.486 గ్రాములు మరియు 2.606 గ్రాములు.

# "తెలుగు భాషకు ప్రాచీన హోదా-విహంగ వీక్షణం"



*"ప్రతి భాషా ఒక దేవాలయం. ఆ భాషను మాట్లాడే వారి ఆత్మలు అందులో ప్రతిష్ఠించబడతాయి."*

-అమెరికన్ రచయిత.
ఆలివర్ వెండెల్ హోమ్.

తేదీ:08-08-2016న మద్రాసు ఉన్నత న్యాయస్థానంలో మాన్యులైన ప్రధాన న్యాయమూర్తి శ్రీ సంజయ్ కిషన్ కౌల్ మరియు మాన్యులైన న్యాయమూర్తి శ్రీ ఆర్. మహదేవన్‌లు "తమిళం, సంస్కృతం మాత్రమే కాదు - తెలుగు, కన్నడం, మలయాళం, ఒడియా భాషలు కూడా విశిష్ట భాషలే" అంటూ తీర్పును యిస్తూ- చివరగా, పైన పేర్కొన్న అమెరికన్ రచయిత యొక్క వ్యాఖ్యను ఉటంకించారు. న్యాయస్థానాలకు భాష(ల) గురించి ఉన్నటువంటి గౌరవ భావంలో ఆవగింజంతయినాలేని మన ప్రభుత్వాలను, రాజకీయ పార్టీలను ఎంత విమర్శించినా కంఠశోషే తప్ప ప్రయోజనం లేదు. ఈ విషయం వాస్తవం అని ఋజువు చేస్తుంది "తెలుగు భాషకు ప్రాచీనహోదా- విహంగ వీక్షణం" పుస్తకం.

తమిళభాషకు తేదీ 25 నవంబరు 2005 న కేంద్ర ప్రభుత్వం ప్రాచీన హోదా యివ్వటంతో వెంటనే తెలుగునాట స్పందన ప్రారంభం అయింది. దాని ఫలితంగా తెలుగునాట మాత్రమే కాకుండా ప్రపంచం నలుమూలలా వున్న తెలుగువారి అభిప్రాయాన్ని ఎలా కూడ గట్టిందీ, రాష్ట్రంలోని భాషా సాహిత్య సంస్థలు అన్ని సమావేశా లలోను తెలుగుకు ప్రాచీనహోదా గురించి, ఎలా గొంతెత్తినదీ సుదీర్ఘంగా ఈ పుస్తకంలో వివరించబడింది. 'తెలుగు' కు ప్రాచీనత కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయం అకడమిక్ సెనేట్ తీర్మానం చేయటం; డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చొరవతో రాష్ట్రానికి చెందిన 42 మంది పార్లమెంట్ సభ్యులు అప్పటి ప్రధాన మంత్రిని కలిసి తగిన ఆధారాలు, నివేదనలు ఇవ్వడం , అలాగే అధికార భాషా సంఘం అధ్యక్షులు డా.ఎబికె ప్రసాద్ అటు ప్రధానమంత్రికి, యు.పి.ఏ చైర్‌పర్సన్‌కు రాసిన లేఖల అసలు పాఠాలు(Texts) ఇందులో చేర్చబడ్డాయి. అంతేకాకుండా దీనికి సంబంధించిన న్యాయ పోరాటంలో ప్రసాద్‌గారు స్వయం ప్రతివాదిగా ప్రతి ప్రమాణ పత్రం దాఖలు చేయటం, ఆ ప్రమాణ పత్రం ఎక్సలెంట్(Excellent) అని కర్ణాటక ప్రభుత్వం తరపున న్యాయవాది ప్రశంసించటం, దానికి స్పందిస్తూ అది ఒక డి.లిట్ థీసిస్ వంటిదని డా. తూమాటి సంజీవరావు సమాధానం చెప్పిన విషయం, ఆసక్తికరంగా అనిపి స్తుంది. **తమిళానికి దక్కిన ప్రాచీన హోదా ఇతర భాషలకు రాకుండా చూసేందుకు తమిళ రాజకీయ ప్రముఖులు ఎన్ని విధాలుగా ప్రయత్నం చేసారో తెలుసుకుంటే ఆశ్చర్యంకలుగక మానదు.** ఎట్టకేలకు 31.10. 2008 తేదీన (నవంబరు 1న రాష్ట్రావతరణ దినోత్సవ కానుకగా) కేంద్ర ప్రభుత్వం తెలుగు, కన్నడ భాషలకు ప్రాచీన హోదా ఇచ్చింది. అయితే అప్పటికే ఈ అంశం మద్రాసు హైకోర్టులో వివాదంలో ఉన్నందున, ఆ వ్యాజ్యంపై వెలువడే తీర్పుకు లోబడి ఈ ఆదేశాలు అమలవుతాయని ప్రకటించబడింది. ఈ వివరాలన్నీ సూక్ష్మంగా, సూటిగా చక్కగా వివరించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు డా.జె. చెన్నయ్య "తెలుగు భాషకు ప్రాచీనహోదా- విహంగ వీక్షణం" అన్న మొదటి వ్యాసంలో.

ఇక "నడుస్తున్న చరిత్ర(ఇప్పుడు'అమ్మనుడి') పత్రిక కృషి" వ్యాసంలో ప్రముఖ సంపాదకులు, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు డా. సామల రమేష్‌బాబు ప్రాచీన భాష తెలుగుకు గుర్తింపు కోసం జరిగిన ఉద్యమంలో పత్రిక ద్వారా జరిగిన కృషిని సమూలంగా ఉదహరించారు. 1999 నాటికే తమిళనాడులోని తెలుగువారి భాషా సాంస్కృతిక సమస్యలపై స్పందిస్తూ, తెలుగువారిలో స్వాభిమాన ఉద్యమానికి తోడుగా ఉన్న 'నడుస్తున్న చరిత్ర' పత్రిక ద్రవిడ పార్టీలు తమిళమే ప్రాచీనమని చేసిన ప్రచారాన్ని గమనించి, వాస్తవాల లోతుల్లోకి వెళ్లింది. 2003 జులై సంచికలో సాక్షాత్తు సుబ్రమణియన్ మలయాండి అనే తమిళ పురావస్తు నిపుణుడు 'తెలుగే ప్రాచీనం' అని వ్రాసిన సైద్ధాంతిక వ్యాసాన్ని తెలుగులోకి అనువదించి ప్రచురించింది. అప్పటి నుండీ ఈ అంశం పైన వ్యాసాలను ప్రచురిస్తూనే ఉంది. అదే విధంగా నవంబరు 2005 లో తమిళభాషకు ప్రాచీన హోదా వెలువడిన వెంటనే- డిసెంబరు2004 సంచికలోనే ఆచార్య కస్తూరి విశ్వనాథం గారి "ఇంతకూ ప్రాచీన భాష అంటే ఏమిటి?" అనే వ్యాసాన్ని ప్రచురించింది.

ఆ విధంగానే ఈ విషయమై తెలుగు భాషోద్యమసమాఖ్య చేసిన కృషినీ, కేంద్రంతో జరిపిన ఉత్తరాల/ నివేదికల వివరాలను, సమాఖ్య తరపున సంస్థాపక - ఉపాధ్యక్షులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ కేంద్రంలోని మంత్రివర్యులతో కలిసిన వివరాలు, సమాఖ్య నిర్వహించిన నిరాహారదీక్షల గురించి, సమగ్రంగా తన వ్యాసంలో పేర్కొన్నారు.

ఈ పుస్తకంలో 3వ వ్యాసాన్ని 'తెలుగు భాషకు ప్రాచీనహోదా - న్యాయ పోరాటం' పేరున బహుభాషా పరమ పట్టభద్రులు చెన్నపురి తెలుగువాణి కార్యదర్శి శ్రీ తూమాటి సంజీవరావు అత్యంత ఆసక్తికరంగా తెలుగుకి ప్రాచీనహోదా గురించి జరుగుతున్న సాధన క్రమంలో ఎదురైన న్యాయపరమైన అడ్డంకులను వాటిని ఎలా ప్రతిఘటించిందీ సోదాహరణంగా వివరించారు.

మద్రాసులోని 'చెన్నపురి తెలుగు వాణి' శ్రీ తిరునగరి భాస్కర్ సంపాదకత్వంలో ప్రచురించిన ఈ పుస్తకం తెలుగు భాషాభిమానులందరు తప్పక చదువదగింది.

'తెలుగు భాషకు ప్రాచీన హోదా- విహంగ వీక్షణం' ప్రచురణ- చెన్నపురి తెలుగువాణి, పేజీలు;: 192, వెల- రు.120/- ప్రతులకు- 1. టి. భాస్కర్ అధ్యక్షులు, 15/37 రాజమంగళం మొదటి వీధి, విల్లివాకం, చెన్నై -600049, సెల్ నెం. 99626 92662. 2. డా. టి. సంజీవరావు కార్యదర్శి, 35/18 2nd ఫ్లోర్ 15th street, అశోకనగర్, చెన్నై-600083.

**-ఎమ్.వి. శాస్త్రి**
9441342999

-సంకేపల్లి నాగేంద్రశర్మ
9441797650.

# పర్యాటక కేంద్రంగా పోతన 'బమ్మెర' !

## 40కోట్ల అభివృద్ధి టూరిజం సర్క్యూట్ ఏర్పాటు, అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంఖుస్థాపన






*పలికెడిది భాగవతమట*
*పలికించెడివాడు రామభద్రుండట।*
*నే బలికిన భవహర మగునట*
*పలికెద వేఱొండు గాథ బలుకగ నేలా॥*

తెలుగు, సంస్కృతాలలో సహజ పాండిత్యం గల బమ్మెర పోతనామాత్యుడు తేటతెలుగులో మహాభాగవతాన్ని అనువదించి, తెలుగు జాతి, సంస్కృతికి పట్టుగొమ్మగా నిలిచారు. పండితోత్తముడి గానే కాక, హాలికుడిగా సాధారణ జీవితం గావించి, తెలుగు జాతి సంస్కృతికి తన రచనల ద్వారా పరిపుష్టిని కలిగించారు. మహాకవి పోతన్న మన తెలుగువాడు, తెలుగు పద్య సాహిత్యానికి గర్వకారణంగా నిలిచినవాడు బమ్మెర పోతన్న. బమ్మెర గ్రామం ప్రస్తుతం తెలంగాణా రాష్ట్రంలోని జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో వుంది. ఇవే కాక మరో ఐదు గ్రామాలు పాలకుర్తి, వల్మిడి మొదలగునవి బమ్మెరకు సమీపంలో వుండటంతో, ఈ ఆరు గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రణాళికలను రూపొందించింది. పోతన్న తన సొంత గ్రామంపేరుతోనే సుప్రసిద్ధుడైనాడు.

క్రీ.శ..1450-1510 మధ్య జీవించి, తెలుగునేలకు సనాతన ధార్మిక పౌరాణిక సాహిత్యాన్ని మందార మకరందమైన పద్యాలలో అందించారు. వీరు మహాభాగవతంతోపాటుగా, భోగినీదండకం, వీరభద్ర విజయం వంటి కావ్యాలను రాశారు. తొలుత రాసింది భోగినీ దండకం. అట్లాంటి భాగవతోత్తముడి జన్మభూమియైన బమ్మెర గ్రామాన్ని ఒక చారిత్రిక కేంద్రంగా, మహాకవి జన్మించిన స్మారక కేంద్రంగా, టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దడానికి తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్రావు ఏప్రిల్ 28న ఈ గ్రామాన్ని సందర్శించి, అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. బమ్మెర గ్రామానికి ఏడున్నర కోట్లు కేటాయిస్తున్నట్లు, అంతేకాక బమ్మెర చేరడానికి బైపాస్ రోడ్లనిర్మాణానికి కూడా నిధులు కేటాయిస్తామని, స్థానిక ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకరరావు ఈ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. బమ్మెరలో ప్రస్తుతం పోతన్న భారీ విగ్రహం తోపాటు, ఒక అతిథి గృహం, థియేటర్, ధ్యానకేంద్రం, బమ్మెర శివాలయం వంటివి ఈ ప్రణాళికలో వున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణా ఆదికవి పాలకుర్తి సోమనాధుడు జన్మించిన పాలకుర్తిని, పక్కనే వున్న వల్మిడిని, ఖిలాస్‌పూర్ కోట, జాఫర్‌గడ్ కోట, ఇత్తడి కళాకారులకు నిలయమైన పెంబర్తి లోహ పరిశ్రమని, పోతన్న బమ్మెరను అభివృద్ధి చేయడానికి తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం నలభై కోట్ల రూపాయల్ని మంజూరీ చేసింది. ఈ ఆరు గ్రామాలను కలిపి ఒక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయడానికి, రోడ్లు, మంచినీటి వసతి, హోటల్, క్యాంటిన్, ఉద్యాన వనాలు వంటి మౌలిక సదుపాయాలు, ఇతర టూరిజం నిర్మాణాలకు ఈ నిధుల్ని కేటాయిస్తారు. బమ్మెరగ్రామంలోని పోతన్న సమాధిని సందర్శించి ముఖ్యమంత్రి పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. పోతన్న తన పంట పొలానికి వాడుకున్న మోటబావిని సందర్శిం చారు. పోతన్నకు చెందిన 432 ఎకరాల స్థలాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కుదుర్చుకున్న ఎంవోయును (ఒప్పందం) సిఎం సమక్షంలో వరంగల్ కాకతీయ హెరిటేజ్ ట్రస్టు వ్యవస్థాపకులు, సీనియర్ చరిత్రకారులైన ప్రొఫెసర్ ఎం.పాండు రంగారావు పర్యాటక శాఖ తరుపున కలెక్టర్ దేవసేన - ఫైళ్ళు మార్చుకున్నారు. తెలంగాణాలో సాహితీ, సాంస్కృతిక సుగంధాల్ని వెదజల్లిన ఇట్లాంటి మహామహుల నివాస ప్రాంతాలను స్మారక, చారిత్రక, టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి తాము కృతనిశ్చయంతో వున్నట్లు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రకటించారు. తాను చదువుకునేటప్పుడు పద్య సాహిత్యంలో జరిగే వివిధ పోటీల్లో తాను పాల్గొంటూ వుండేవాడినని, పద్య సాహిత్యం పట్ల ఆసక్తి వుండటం వల్ల మొదటి బహుమతి తనకే వచ్చేదని, తెలుగు సాహిత్యంపై మంచి పట్టున్న తమ గురువుగారైన పరాశరం గోపాల క్రిష్ణమూర్తి తనకు ప్రోత్సాహం ఇచ్చేవాడని అన్నారు. సాహిత్య పోటీలలో తనకు బహుమతులు రావడం వల్ల, తన తోటి విద్యార్థులకు ఈర్ష్య వుండెడిదని సిఎం అన్నారు. డా.సినారె రాసిన మందార మకరం దాలు అనే పోతన పద్యాల గ్రంథం చదివి తాను పోటీలకు హాజరై విజేతగా నిలిచినానని అన్నారు. ఈసందర్భంగా పోతన రాసిన ప్రహ్లాద ఘట్టంలోని భాగవత పద్యాల్ని చదివి వినిపిం చారు. ఇందుగలడందు లేదు, చక్రి సర్వోపగతుండని, ఎందెందు వెతికినా

అందందే కలదని... ముఖ్యమంత్రి పద్యం చదివి వినిపించారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర విద్యామంత్రి కడియం శ్రీహరి, టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పేర్వారం శ్రీరాములు, ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులున్నారు. పోతన్న రాచకొండ ప్రభువైన సర్వజ్ఞ సింగభూపాలుడి కోరికపై భోగినీ దండకాన్ని రాశారు. తదుపరి వీరభద్ర విజయాన్ని కావ్యంగా రాశారు. ఇది వీరశైవానికి చెందినది. మహాభాగవతం మాత్రం నరుడైన ఏ రాజుకు, ఎవ్వరికి అంకితం ఇవ్వక, తాను కొలిచే దైవమైన శ్రీరామ చంద్రమూర్తికే అంకితం ఇచ్చాడు. రాచకొండ ప్రభువు అర్థించినా, సున్నితంగా రాజాశ్రయాన్ని తిరస్కరించాడు. పోతన్న ఒకసారి ఒక గ్రహణం రోజున గోదావరీ తీరంలో దైవ ధ్యానంలో నిమగ్నుమై వుండగా, ధనుర్ధారియైన శ్రీరామచంద్రుడు ప్రత్యక్షమై, తెలుగులోకి మహాభాగతవాన్ని అనువాదం చేయాల్సిందిగా కోరాడు. దైవం కోరికపై వ్యాసమహాకవి రాసిన భాగవతాన్ని తెలుగులోకి స్వేచ్ఛాను వాదం చేసి, తన ప్రభువైన రామునికే అంకితం ఇచ్చి, తన అపార రామభక్తిని పోతన్న ప్రకటించుకున్నాడు. పోతన్న హాలికుడిగానే వ్యవసాయం చేసుకుంటూ, సాధారణ జీవితం గడుపుతూనే అసాధా రణ ప్రజ్ఞతో భాగవతాన్ని తెలుగులోకి పద్యాలలో తర్జుమా చేశారు. రమణీయ పద్య కవిత్వానికి జవజీవాలు పోశారు. ముప్పయి, నలభై ఏళ్ళ క్రితం ఇంగ్లీష్ మీడియం చదువులు రాక ముందు – పోతన్న రాసిన భాగవత పద్యాలు తెలుగువాళ్ల నోళ్ళలో ఎప్పుడూ సుస్వర కంఠ స్వరంతో కదలాడుతూనే వుండేవి. కానిగిరి బడులలో పోతన్న పద్యాలతోపాటు, కవిత్రయం మహాభారత పద్యాలు, తిరుపతి వెంకట కవులు రాసిన పాండవోద్యోగ పర్వంలోని పద్యాలు, ధర్మపురి కాకుత్సం, శేషప్పకవి రాసిన శతక పద్యాలు చెబుతూవుండేవారు. పోతన్న కవికాలాదులు ఇతమిత్థంగా రికార్డు కాలేదని చెబుతారు. పోతన్న పంచశతి ఉత్సవాలు మాత్రం వరంగల్‌లో రాష్ట్ర ప్రభుత్వంలో పి.వి. మంత్రిగా వున్న హయాంలో 1975లో ఘనంగా నిర్వహిం చారు. పోతన్న సమాధిని తాను 16 ఏళ్ళ కిందట దర్శించానని, తెలుగు జాతి సాహితీ వైభవానికి ప్రతీకగా నిలిచిన పోతన్న స్మారక కేంద్రాన్ని అభివృద్ధి చేయాలన్న తలంపు, ఆరోజే తనకు కలిగిందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. సుప్రసిద్ధ పద్యకవిమార్తాండులైన నందూరి రామక్రిష్ణమాచార్య, కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిల సంపాద కత్వంలో పరిష్కరించి, చక్కటి ముందుమాటలతో పోతన మహా భాగవతాన్ని టిటిడివారు సర్వాంగ సుందరంగా ముద్రించారు. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ హయాంలో హైదరాబాద్ ట్యాంకు బండ్ పై పోతన్న విగ్రహాన్ని, ఇటీవల బమ్మెరలో పోతన్న విగ్రహాన్ని నెలకొల్పారు. పోతన సాహితీ విజ్ఞాన పీఠం, పాలకుర్తి సోమన పీఠాలు రెండూ తెలంగాణాలో చురుకుగా పనిచేస్తున్నాయి. అ

# మా తెలుగుతల్లికి 'డబుల్ మల్లె'పూదండ!

నిత్య వ్యవహారాల్లోనూ సామాజికంగా వర్తించే విషయాలు అనేకం ఉంటాయి. అందుకు ఉదాహరణే మా దంపతులకు ఎదురైన ఈ అనుభవం. అర్ధాంగితో కలిసి ఓ సాయంత్రం పూట నడకకు వెళ్ళివస్తున్నాను. రోడ్డువారగా తోపుడు బండిలో ఓ మహిళ పూలు అమ్ముతోంది. పూలు కొనటానికి శ్రీమతి ఆ బండి దగ్గరకు వెళ్ళింది. నేనూ ఆవిడను అనుసరించాను. ఎదురుగా మల్లెపూలు రాశి పోసి ఉన్నాయి. నాభార్యకు వాటిపై దృష్టిపడలేదు.

"అవ్వా! బొండుమల్లెలున్నాయా?" అనడిగింది. ఆ మాటలు అర్థంకానట్లుగా ముఖం పెట్టింది పూలమ్మి.

"పోనీ దొంతరమల్లెలున్నాయా?" అంది పట్టువదలని విక్రమార్కురాలిలా.

అప్పుడు పూలమ్మి ఏదో ఆలోచనలో పడింది. పక్కన నీళ్ళు చిలకరించి ఉన్న గోనెపట్టాను తొలగించి–"నువ్వడిగే పూలు ఇవేనా?" అంది.

వాటిని చూడగానే ఇల్లాలి కళ్ళు కలువల్లా వికసించాయి.

"అవునవును. నాక్కావలిసింది అవే" అన్నది ఆనందంగా. అంతటితో ఊరుకోకుండా–

"బొండుమల్లెలు ఉన్నాకూడా అమ్మటానికి తటపటాయిస్తున్నా వేం?" అని ప్రశ్నించింది.

"మీరేదో అంటున్నారు. నాకు తెలవలేదు. డబుల్ మల్లెలని అడగాల్సింది" అన్నది పూలమ్మి.

ఏదైతేనేం తనకు బాగా ఇష్టమైన బొండుమల్లెలు దొరికాయన్న సంతోషంతో ఇంటికి తిరిగి వచ్చింది శ్రీమతి.

రెండు రోజుల తర్వాత నేను బజారుకు బయలుదేరుతుంటే ఓ ఉత్తర్వు జారీచేసింది.

"వచ్చేటపుడు డబుల్‌మల్లెలు రెండు చటాకులు పట్టుకురండి" అంది.

"నీక్కావలసింది బొండుమల్లెలేనా?" అన్నాను సందేహ నివృత్తి పేరిట ఆటపట్టిస్తూ.

"మీకు అవన్నీ అనవసరం. డబుల్‌మల్లెలని చెప్పి వాటిని పట్టుకురండి" అంది మరోమాటకు తావులేకుండా.

మల్లెల వాసనలు మా ఇంట గుబాళిస్తూనే ఉన్నా చిరకాలంగా మా ఇంట వింటూవస్తున్న బొండుమల్లె, దొంతర మల్లె మాటలు తెరమరుగయ్యాయి!

మా ఇంట నిత్యం తెలుగుతల్లికి 'డబుల్ మల్లెపూదండ'లను భక్తితో సమర్పించుకుంటున్నాం.

**– గోవిందరాజు చక్రధర్**
98498 70250

శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు
మానసిక వికాసానికి తల్లి భాష

**తెలుగు భాషోద్యమసమాఖ్య, మాతృభాషా మాధ్యమ వేదికలకు, అనేక ఉపాధ్యాయ సంఘాలకు చెందిన ఉద్యమకారుల చొరవతో విశాఖపట్నంలో ఉద్యమం చురుకుగా సాగుతోంది. అందుకు సంబంధించిన కొన్ని వార్తలు ఇవి:**

## బ్యాంకులలో తెలుగు వాడకం



తెలుగు భాషోద్యమకారుల దళం మే 11న విశాఖపట్నం వీధులలో తెలుగు వాడకం కోసం తిరగటం మొదలు పెట్టింది. వేదుల కామేశ్వర శర్మ గారి నాయకత్వంలో మాదిరెడ్డి రమేష్, ఈ. వెంకటరావు, పారుపల్లి కోదండరామయ్య ఈ పనిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, విజయా బ్యాంక్ మేనేజర్లను కలిశారు. వాడకందారులు డబ్బులు జమ చేయటానికి, డి.డి. అప్లికేషను కోసం వగైరా వాడే ఫారాలు తెలుగులో ఉండాలని మేనేజర్లను గట్టిగా కోరారు. తమిళనాడులో తమిళంలో, కర్ణాటకలో కన్నడంలో, లక్నోలో హిందీలో ఉండగా ఇక్కడ ఇతర భాషలలో మాత్రమే ఉండటం న్యాయమా? అని ప్రశ్నించారు. అందరు మేనేజర్లు ఇది సరిచేయ వలసిన తప్పుగానే ఒప్పుకొన్నారు. తప్పక తగు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు.

## ఉపాధ్యాయసంఘాల సమావేశం



మే 12న సింహాద్రి అప్పడు గారు చొరవ తీసుకొని ఈ రోజు ఉపాధ్యాయ సంఘాల సమావేశం జరిపారు. తెలుగు ఉద్యమకారులు పరవస్తు సూరి, కోదండ రామయ్య, ఎర్రా నాయుడు గారలు కూడ హాజరయ్యారు. ఉపాధ్యాయులు ప్రసాద్, అంబేద్కర్, ప్రసాద రావు, వెంకటపతి రాజు, పైడి రాజు, సత్యనారాయణ, శ్రీనివాస రావు, ధనంజయ రావు, రామకృష్ణ, రాజు, సూరి, మధు, శంకర రావు గారలు వగైరా పాల్గొని వారి అభిప్రాయాలను తెలిపారు. అందరిలో ఉద్యమ ఉత్సాహం కనపడింది. సుదీర్ఘమైన చర్చ తరువాత, 13 ఉపాధ్యాయ సంఘాల సభ్యులతో ఒక ఉద్యమ సంఘాన్ని, వేణుగారు కన్వీనరుగా ఏర్పరచారు.

అందరూ ఒకే మాటతో, తెలుగు భాష రక్షణ కోసం గట్టిగా కదలాలని అభిప్రాయానికి వచ్చారు. మిగిలిన ఉపాధ్యాయులను కూడా కదిలించాలని, తల్లిదండ్రులకు పిల్లలకు వివరంగా విషయాలను చెప్పి, తెలుగు కోసం ఒప్పించాలని, పెద్దలను అధికారులను రాజకీయనాయకులను మంత్రులను కలవాలని తేల్చారు. ఎండాకాలం ఉపాధ్యాయ శిక్షణా శిబిరాలకు వెళ్లి అందరిని కలవాలని నిర్ణయించారు. మండల స్థాయి అధికారులు, రాజకీయ నాయకులను కూడ కలవాలని తీర్మానించారు. విశాఖ జిల్లాను రాష్ట్రంలోనే, తెలుగు భాషోద్యమంలో, అగ్రగామిగా ఉండేట్లు పాటు పడతామని ప్రతిన పూనారు.

## మాతృభాషామాధ్యమ వేదిక ప్రదర్శన



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తెలుగు వ్యతిరేక ధోరణిపై 26న విశాఖ లోని GVMC గాంధీబొమ్మ దగ్గర చాల ఉద్వేగవంతంగా అన్ని ప్రజాసంఘాల నిరసన సభ జరిగింది.

సింహాద్రి అప్పడు APTF, విశ్వేశ్వరం గారు, ధర్మేందర్ రెడ్డి DTF, XAVIER, వీరభద్ర రావు APTF, వై ఆర్ కే ప్రసాద్ UTF, రొంగలి రాంబాబు, వర్మ TNUS, కత్తి పద్మ మహిళా చేతన, మణి IDWA, అజయ్ SFI, సురేష్ PDSO, వర్ధిని PDSU, కన్నయ్య సమైక్య భారతి, P L నారాయణ, పారుపల్లి కోదండరామయ్య, యర్రనాయుడు, నరసింగరావు, వెంకటరావు, నారాయణమూర్తి, అడపా రామకృష్ణ, నూకాచారి జన సాహితీ, V V బాలకృష్ణ CRPP, డి ఆర్ కిషోర్ విద్యా పరిరక్షణ సమితి, జగదీశ్ SFI, కృష్ణారావు DYFI, T. శ్రీరామమూర్తి పౌర హక్కుల సంఘం, తోపాటు ఇంకా అనేక విద్యార్థి, సాహితీ, ప్రజా సంఘాల వారు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని మధు, DTF నడిపారు. వక్తలు ప్రభుత్వ తెలుగు భాషా విధానంపై చాల పరుషంగా దాడి చేశారు. వివిధ దేశాల, రాష్ట్రాల అనుభవాలను వివరించారు. ఎక్కడా లేనిది ఇక్కడ మాత్రం భాషా వ్యతిరేకత ఎందుకు వచ్చింది? అని ప్రశ్నించారు. ఈ మహానాడులో కొత్త భాషావిధానం ప్రకటించాలి అని డిమాండ్ చేశారు. లేకపోతే, ఈ ఉద్యమాన్ని ఇంకా పెద్ద ఎత్తున చేస్తామని, విజయం సాధించే వరకు విశ్రమించం అని శపథం చేశారు.

## గ్రంథాలయం

**ఈ యుగం మాది:** దళిత మహాకావ్యం–మహాకవి డా॥కత్తి పద్మారావు కవిత్వం; పుటలు: 482, వెల: రు.500/–, ప్రచురణ: లోకాయత ప్రచురణలు. ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి, లోకాయత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్ రీసెర్చి సెంటర్, అంబేద్కర్ కాలనీ,పొన్నూరు–522124. ఫోన్: 9849741695.




**దళితుల సామాజిక సాంస్కృతిక చరిత్ర:** ప్రత్యామ్నాయ చరిత్ర; రచన: డా॥కత్తి పద్మారావు ; పుటలు: 255, వెల: రు.250/–, ప్రచురణ: లోకాయత ప్రచురణలు. ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి, లోకాయత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్ రీసెర్చి సెంటర్, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు–522 124. ఫోన్: 9849741695.




**భగత్‌సింగ్ :** స్వాతంత్ర్యయోధుల్లో ఆల్‌టైమ్ గ్రేట్ భగత్‌సింగ్ ఉజ్వల చరిత్ర– ఉన్నది ఉన్నట్టు; రచన: ఎం.వి.ఆర్.శాస్త్రి; పుటలు: 294, వెల: రు.200/–ప్రచురణ, ప్రతులకు:దుర్గా పబ్లికేషన్స్, జి–1, సాయికృష్ణా మాన్షన్, 1-1-2309, వివేక్ నగర్, చిక్కడపల్లి, హైదరాబాద్. ఫోన్ : 040–27632824, 9441257961/62




**సాహితీ ఉద్యమంలో కరదీపికలు:** వ్యాసాలు; రచన: అడపా రామకృష్ణ; పుటలు: 84, వెల: రు.40, ప్రతులకు: ది సెక్రెటరీ, అడపా రామకృష్ణ, ఇం.నెం.43–21–21, దొండపర్తి జంక్షన్, విశాఖపట్నం–16. ఫోన్: 95052 69091.




**ఈతరంకోసం కథాస్రవంతి :** పూసపాటి క్రిష్ణంరాజు కథలు; సంపాదకత్వం: డా॥చందు సుబ్బారావు. పుటలు:111, వెల: రు.50/– ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిల్లా. ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ మరియు నవచేతన బుక్‌హౌస్ బ్రాంచీలు.



**సరసి కార్టూన్లు–4 :** కార్టూనిస్టు: సరసి; పుటలు: 176, వెల: రు.130/– ప్రతులకు: ఎస్. రామనరసింహం, ఫ్లాట్ నెం.56, 3వ వీధి, అనంత సరస్వతీ నగర్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ –47. ఫోన్:040–27224114, 9440542950




## 'తెలుగువాణి' ట్రస్టు ఆధ్వర్యంలో తమిళనాట తెలుగుతరగతులు

తెలుగువాణి ట్రస్టు నేటి తమిళనాడు రాష్ట్రంలో ఉన్న తెలుగువారికి వారు మాట్లాడే భాషకు లిపిని నేర్పి, ఆ విధంగా వారు తమ అమ్మనుడి తెలుగులో చదవటం, రాయటం నేర్చుకునేందుకు 2004 నుండి పాటుపడుతున్న సంగతి 'అమ్మనుడి' (నడుస్తున్న చరిత్ర) పాఠకులకు తెలిసిందే. తిరుప్పూరు జిల్లాలో 50 పల్లెల్లో తరగతులను నడిపే కార్యక్రమాన్ని విజయవంతంగా చేస్తున్నది. మే నెల చివరకు ఈ కార్యక్రమం పూర్తికానున్నది. 2000మందికి పైగా తెలుగుపిల్లలు ఈ శిక్షణ పొందారు. జూన్ 18న కోయంబత్తూరులో జరుగనున్న పెద్ద సభలో వీరు అనేకమంది పెద్దల సమక్షంలో శిక్షణపత్రాలను అందుకోనున్నారు. ఆ సభలో తెలుగురాష్ట్రాలనుండి పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. తెలుగువాణి ట్రస్టీలు స.వెం.రమేశ్, దామోదర్, మార్టూరి వసంతనాయుడు స్థానిక ఇతర పెద్దలతో కలిసి 18వ తేదీన జరుగనున్న చరిత్రాత్మక సభను నిర్వహించనున్నారు. తరగతుల నిర్వహణ బాధ్యులు స.వెం.రమేశ్ పంపిన నివేదిక ఇది:

ఉడుమల పేటలో 'తెలుగువాణి' తెలుగు తరగతులను మొదలు పెట్టింది. పాత కోయంబత్తూరు, ఇప్పటి తిరుప్పూరు పెవ్వంటెం (జిల్లా) లోని ఒక వంటెమే(తాలూకా) ఉడుమలపేట. నాటు తెలుగుపేరు ఇది. చాలామంది 'ఉడుముల, ఉడుమాల' అని పొరపడు తుంటారు. నిక్కానికి ఇది ఉడుమలపేట. పడమటి కనుమలలో ఒక వంతైన ఏనుగుమలలు ఉడుముకొని(ఆవరించుకొని, చుట్టూ పరచుకొని) ఉండే ఊరిది. 'ఉడుముకోవడం' అనే పనిపలుకు ఇక్కడి తెలుగువారు పలికేది. ఉడుపు(బట్ట) అనే పేరుపలుకు దీనినుండే పుట్టుండవచ్చు.

ఈ తావంతా తెలుగు మాటల, తెలుగుపాటల మయం. తెలుగును పలుమాడే మాదిగవారు ఒక్కరే 22 నూర్వాలు ఉన్నారిక్కడ. మొత్తం తెలుగు లెక్క 49 నూర్వాలు. తమిళ లెక్క 41 నూర్వాలు. కన్నడ, ఉరుదూ, మలయాళ, ముదవ నుడుల వారు మిగిలినవారు. గడచిన రెండేళ్లుగా ఈ పల్లెపల్లెనా తెలుగువాణి పనిచేస్తూ వస్తున్నది. పదుల పల్లెకళలు, నూర్ల పల్లెపాటలు తెలుగులోనే సాగుతున్నాయి ఇప్పటికీ. వీటిని గుర్తించి అమలు చేయడం తెలుగువాణి పని, వీటిని ఏ పలుచదువిలు (విశ్వవిద్యాలయం) వారో అరసి మెలపాలసిందే. తెలుగు పలుమాడేవారికి రాయడం చదవడం నేర్పడమనేది తెలుగువాణి చేసే స్వచ్ఛమయిన పని. ఆపనే ఇక్కడ ఇప్పుడు పెద్దఎత్తున మొదలయింది. 25 మంది పరుపరులు (ప్రచారకులు) హోసూరుపల్లి పట్టు తావుల నుండి వచ్చి తరగతులను నడుపుతున్నారు. ఏప్రిల్, మే నెలలో 50 పల్లెల్లో తరగతులను నడుపుతుంది తెలుగువాణి. ఒక్కొక్క ఊరిలోనూ తరగతులను నడపడానికి అయ్యే మొత్తం చెల్లును ఉత్తరమెరికా తెలుగు సంగం(తానా)వారు తలకెత్తుకొన్నారు. తరగతులు ముగియబోతున్నపల్లెలపేర్లు తరగతుల ఫోటోలు ఈ ప్రక్కపుటలో చూడండి.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362

# తెలుగువాణి ట్రస్టు ఆధ్వర్యంలో తమిళనాట తెలుగుతరగతులు

ఉడుములపేట ప్రాంతంలోని ఈ క్రింది గ్రామాలలో తరగతులు జరిగినాయి

1) కుప్పంపాళెం 2) సామరాయపల్లి 3) బాపినారిచెరువు 4) మరులపల్లి 5) కనుమనూరు 6) గండ్లపల్లి 7) రాజావూరు 8) మటమూరు 9) గొర్లగుంట 10) మురుగుత్తి చెరువు 11) కరిచికోట 12) ఆలంపాళెం 13) గురప్పనాయుడూరు 14) జింకపల్లి 15) పళ్లపాళెం 16) చెల్లాండమ్మపల్లి 17) చిన్నకుమారపాళెం 18) రామేగౌడు కొత్తూరు 19) పెద్ద బాళపాడు 20) మొదుకు పల్లి 21) దీపాలపల్లి 22) ఎర్రజనంపల్లి 23) మెట్టుదిన్న 24) వెన్నమానుపల్లి 25) పెద్దపాపలనూతి 26) బేళూరు 27) బండగలూరు 28) గట్టుకొత్తూరు 29) కళలపల్లి 30) గణపతిపాళెం 31) బెణసపల్లి 32) అమ్మపల్లి 33) పొట్టెంపాళెం 34) లింగమావూరు 35) ఇప్పలనగరం 36) మర్రిమానూరు 37) జల్లిపల్లి 38) వెంకటాపురం.

**కొన్ని గ్రామాల్లో తరగతుల సందర్భంగా తీసిన ఫొటోలు ఇవి.**














వార్తవివరాలు లోపలిపుటల్లో...

అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక)
AMMANUDI (Telugu Monthly)
June 2017, Vol.3, Issue 4
Date of publication : 1st of every month
Date of posting : 4th of every month
RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17

